అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 24-01-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 24 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50



వంద కోట్లకు చేరువలో భారతీయ ఓటర్లు



న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో 99.1 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు ఓటర్ల సంఖ్య 96.88 కోట్లు. దీనిని బట్టి చూస్తే భారతీయ ఓటర్ల సంఖ్య త్వరలోనే వంద కోట్లకు చేరుతుందని అర్థమవుతోంది. ప్రతి సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25వ తేదీన నిర్వహిస్తారు. ఆ రోజు ఎన్నికల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవం. 1950 జనవరి 25వ తేదీన ఎన్నికల కమిషన్ ఏర్పడింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర ఎన్నికల ...15లో

మరింత ముదిరిన కృష్ణాజలాల వివాదం

సుప్రీంలో ఏపీ పిటిషన్

ఫిబ్రవరి 13న విచారణ

ట్రిబ్యునల్ తాజా ఆదేశాలపై ప్రస్తావన



వివరాలు 7లో

అమెరికాకే దెబ్బ

వలసదారులను కాదంటే అధోగతే

- ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే నష్టం
- 2008 సంక్షోభం కంటే దారుణమైన పరిస్థితికి గురయ్యే ప్రమాదం
- ఆర్థిక వృద్ధి రేటు పడిపోతుంది
- సామూహిక తరలింపులకు భారీ మొత్తంలో నిధులు అవసరం
- అంతర్జాతీయ నిపుణులు, మేధావుల విశ్లేషణ



అమెరికా నూతన అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే అటువైపుగా చర్యలకు ఆదేశించారు. కోటి మందికి పైగా అక్రమ వలసదారులు ఆ దేశంలో ఉన్నారన్నది అంచనా. వీరు ఇప్పటికే ఆ దేశ కార్మికరంగంలో పెనవేసుకొనిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడుతున్నారు. ఇప్పుడు వీరి తరలింపుతో అమెరికా ఆర్థిక వ్యవస్థకే నష్టమనీ, ట్రంప్ నిర్ణయం అమలుకు భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందని అంతర్జాతీయ నిపుణులు, విశ్లేషకులు, మేధావులు అంటున్నారు.

వాషింగ్టన్ : అక్రమ వలసదారుల విషయంలో అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం ఆ దేశానికే చేటు తెచ్చే ప్రమాదమున్నదని అంతర్జాతీయ నిపుణులు, విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. అక్కడ పని చేసే వీరిని కాదనుకుంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం వాటిల్లే అవకాశమున్నదని చెప్తున్నారు. ట్రంప్ చెప్పినట్టుగా సరైన పత్రాలు లేవన్న కారణంగా అమెరికాలో పని చేస్తున్న 1.30 కోట్లమందిని బహిష్కరిస్తే.. 2008 నాటి సంక్షోభాన్ని మించిన కఠిన పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. అమెరికా నుంచి అక్రమ వలసదారులను తరలించటానికి కావాల్సిన వనరులు, అవకాశాలు ఆ దేశ అధ్యక్షుడికి ఉన్నాయా అన్నదే సమస్యని అంటున్నారు.

'ట్రంప్, బీజేపీ నేతల మాటలు ఒకటే'

అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. భారత్‌లో మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) విషయంలో బీజేపీ నాయకులు వాడిన భాష.. ట్రంప్ మాటలను ప్రతిబింబిస్తున్నదని కొందరు మేధావులు చెప్తున్నారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం అమలు జరిగితే అమెరికాకే హానికరమని వారు అంటున్నారు. ట్రంప్ తన రెండో ...15లో

దావోస్@ రూ. 1,78,950 కోట్లు

కొత్త ఒప్పందాలతో 49,500 ఉద్యోగాలు

20 సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూ

గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లు

అమెజాన్ రూ.60 వేల కోట్ల పెట్టుబడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో రాష్ట్రానికి మొత్తం రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గురువారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు వెల్లువెత్తాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన ఉత్పత్తితో పాటు హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ అభివృద్ధి, ఆహారం, సేవల రంగం, ఏఐ ఆధారిత ఐటీ సేవల విస్తరణ, అత్యాధునిక డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి మొత్తం 20 కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. ప్రపంచ దిగ్గజ కంపెనీ అమెజాన్ రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు బృందం అమెజాన్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకెల్‌తో జరిగిన చర్చల అనంతరం కంపెనీ తన పెట్టుబడిని ప్రకటించింది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో డేటా సెంటర్లను ఆ కంపెనీ విస్తరించనుంది. గతేడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈ సారి నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 49,500 ఉద్యోగాలు లభిస్తాయని ...15లో

రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు చేసుకున్న కంపెనీలు

దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో 20 కంపెనీలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. 14 కంపెనీలు తమ పెట్టుబడుల మొత్తాన్ని ప్రకటించాయి. యూనిలివర్, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, విప్రో, సుహానా మసాలా, ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్ కంపెనీలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తామని ఎంవోయూ కుదుర్చుకున్నా ఎంత మొత్తం పెట్టుబడి పెడతాయో ప్రకటించలేదు.

- రూ. 45,500 కోట్లు — సన్ పెట్రో కెమికల్స్
- రూ. 60,000 కోట్లు — అమెజాన్ వెబ్ సర్వీసెస్
- రూ. 10,000 కోట్లు — కంట్రోల్ ఎస్
- రూ. 800 కోట్లు — జేఎస్ డబ్ల్యూ
- రూ. 500 కోట్లు — స్కైరూట్ ఏరో స్పేస్
- రూ. 15,000 కోట్లు — మెఘా ఇంజనీరింగ్
- రూ. 15,000 కోట్లు — టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్
- రూ. 5,000 కోట్లు — ఉర్సా క్లస్టర్స్
- రూ. 4,500 కోట్లు — జేసీకే గ్రూప్
- రూ. 7,000 కోట్లు — మైత్రా ఎనర్జీ
- రూ. 400 కోట్లు — అగిలిటి
- రూ. 10,000 కోట్లు — సిఫీ టెక్నాలజీస్
- రూ. 250 కోట్లు — ఫినిక్స్
- రూ. 5,000 కోట్లు — రామ్కీ గ్రూప్



దావోస్‌లో విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ రిషబ్ ప్రేమ్‌జీతో సీఎం రేవంత్‌రెడ్డి

భారీ మొత్తంలో పెట్టుబడుల పట్ల సీఎం రేవంత్ హర్షం

ట్రంప్ నిర్ణయంతో కలవరం



- ముందస్తు ప్రసవాలకు భారతీయులు
- నెలలు నిండకుండానే డెలివరీలకు రెడీ
- 'జన్మత: పౌరసత్వం' రద్దు ఎఫెక్ట్
- ఫిబ్రవరి 20 నుంచి ఆదేశాలు అమల్లోకి
- ఆలోగా పిల్లలకు జన్మనిస్తేనే అమెరికా పౌరసత్వం
- దీంతో ప్రసవాలకు తొందరపడుతున్న దంపతులు
- తల్లి, బిడ్డకు ప్రమాదమంటున్న వైద్యులు

15లో..

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్ర

వారం కూడా తిరక్కుండానే ట్రంప్ తుంటరి చర్య

బైడెన్ జారీచేసిన ఉత్తర్వులు వెనక్కి

7లో..



వారికి క్షమాభిక్ష

సరికాదు

డోనాల్డ్ ట్రంప్‌నకు షాక్

అమెరికా నూతన అధ్యక్షుడి నిర్ణయాన్ని తప్పుబట్టిన న్యాయమూర్తులు

వాషింగ్టన్ : వివాదాస్పద నిర్ణయాలతో అలజడి రేపే అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు అక్కడి న్యాయమూర్తులు షాకిచ్చారు. క్యాపిటల్ హిల్ భవనంపై దాడి చేసిన తన మద్దతుదారులకు ఆయన క్షమాభిక్ష ప్రసాదించిన విషయం విదితమే. అయితే, ఈ నిర్ణయాన్ని ముగ్గురు ఫెడరల్ న్యాయమూర్తులు ఖండించారు. ఇటీవలే అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ అనంతరం ట్రంప్.. 2021 జనవరి 6 నాటి దాడుల్లో పాల్గొన్న 1500 మందికి క్షమాభిక్షను ప్రకటించారు. దీనిపై న్యాయమూర్తి ...15లో

వామపక్షమే ప్రత్యామ్నాయం

ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వాల పాలనపై చర్చిస్తాం.. పథకాల అమలులో వైఫల్యాలు, ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఆందోళనలకు ప్రణాళికలు రూపొందిస్తాం. వివిధ పార్టీలను సమీకరించి ప్రజా సంఘాలనూ ఐక్యం చేసే ఆలోచనతో మహాసభల్లో తీర్మానాలుంటాయి. ప్రజా ఉద్యమాల నిర్మాణంలో లోటుపాట్లను అధిగమించేందుకు ప్రయత్నిస్తాం. రాబోయేకాలంలో పోరాటాలను మరింత పకడ్బందీగా నిర్వహించే దిశగా ముందుకెళ్తాం' అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా తమ్మినేనితో ప్రత్యేక ఇంటర్వ్యూ..ఆయన మాటల్లోనే..

- ఉద్యమాల నిర్మాణంలో లోటుపాట్లను అధిగమిస్తాం
- గడిచిన మూడేండ్లలో ఎన్నో విజయాలు..ఆ స్ఫూర్తితోనే ముందుకు
- సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల నేపథ్యంలో.. నవతెలంగాణ ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి కె.శ్రీనివాసరెడ్డితో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ముఖాముఖి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడగలిగే రాజకీయ, సైద్ధాంతిక స్పష్టత వామపక్షాలకే ఉంది. రాబోయే కాలంలో వామపక్షాలను అభిమానించటం, ప్రజా సమస్యల ఆధారంగా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాటబాట పట్టడం తప్ప ప్రజలకు మరో మార్గం లేదు. ఆ రకమైన సందేశాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ ప్రజలకు ఇవ్వనుంది. ప్రభుత్వాలు దేశ సంపదను కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. అదానీలు, అంబానీలు రూ.లక్షల కోట్లు వెనుకేసుకుంటున్నారు. ఇంకోవైపున కార్మికులు, పేదలు, రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. కార్మికుల కష్టానికి తగిన జీతాలు లేవు.. భద్రత లేదు. కార్మిక చట్టాలు కూడా రద్దు చేశారు. మైనార్టీలకు బతుకుమీదనే ఆశలేకుండా చేశారు. రాజ్యాంగ సంస్థలనూ నిర్వీర్యం చేస్తున్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడే శక్తులు ...3లో



కళ పోరాట ఆయుధం

సకల కళలకు శ్రమే పుట్టినిల్లు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య



- సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ఉత్సాహ భరితంగా ప్రారంభమైన రాష్ట్ర ప్రజా సాంస్కృతికోత్సవాలు
- కార్మిక పోరాట స్ఫూర్తిని నింపిన హల్లాబోల్
- నియంతృత్వంపై ఉక్కు పిడికిలి డెమోక్రసీ
- పోరాట తెగువను చాటిన వీర తెలంగాణ
- ప్రజల్ని ఆలోచింపజేసిన వీధి నాటకాలు, పాటలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రమ నుంచి పుట్టిన ఆటా-పాటా-మాట ఉవ్వెత్తున ఎగసిపడే ప్రజా పోరాటాలకు ఆయుధం లాంటివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ సెంటర్‌లో రాష్ట్ర స్థాయి ప్రజా సాంస్కృతికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతికోత్సవాల్లో కళాకారులు ప్రదర్శించిన వీధి నాటికలు, పాటలు, డప్పుల దరువుల్లో ప్రజా జీవితాలకు సంబంధించిన అంశాలను వివరించారన్నారు. ప్రజల్ని ఆలోచింప చేయడమే కాకుండా చైతన్య పర్చి పోరాటాల వైపు నడిపేందుకు పాట, ఆట ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. హాష్మి ముగ్దుం మైనోద్దీన్ లాంటి ఆనాటి గొప్ప కళాకారులతో పాటు నేటి ఎంతో మంది కళాకారులు ప్రజల గొంతుకై ఆడిపాడిన పరిస్థితి ఉందన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో ...16లో



ప్రారంభ సభలో ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి



రైతులు, వినియోగదారులు, మీడియాను సమీక్షల్లో భాగస్వామ్యం చేయాలి

1912 ను విస్తృతంగా ప్రచారం చేయాలి : ఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రానున్న వేసవిలో రెప్పపాటు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేయాలని సూచించారు. వేసవి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా సీఎండీలు మొదలు ఎస్ఈల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలనీ, విస్తృతంగా సమీక్ష, అవగాహన సమావేశాలు నిర్వహించాలని ...15లో

లాస్ ఏంజిలిస్‌లో ఆరని మంటలు

మరో 9వేల ఎకరాల దగ్ధం

50వేల మంది తరలింపునకు ఆదేశాలు



కాస్టాటిక్, కాలిఫోర్నియా : అమెరికాలోని సంపన్నుల ప్రాంతమైన లాస్‌ఏంజిలిస్‌లో మూడు వారాల క్రితం చెలరేగిన దావానలం ఇంకా పూర్తిగా శాంతించక మునుపే మరో ప్రాంతంలో తాజాగా కార్చిచ్చు మొదలైంది. గాలులు కూడా ఉధృతంగా వీస్తుండడంతో అక్కడ మంటలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయని అధికారులు తెలిపారు. కాగా, ఈ మంటల ముప్పుతో దాదాపు 50వేల మందిని ఇండ్లనుఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. లాస్‌ఏంజిలిస్‌కు ఉత్తరంగా పర్వత ప్రాంతాల్లో కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం ఉదయం తలెత్తిన ఈ మంటలు ఒక రోజులోనే దాదాపు 9వేల ఎకరాలను దగ్ధం చేశాయి. ప్రముఖ రిక్రియేషన్ ...7లో

గ్రామసభల్లో అదే తీరు

లబ్దిదారుల ఎంపికపై రీసర్వేకు డిమాండ్

అనర్హులున్నారంటూ నిలదీతలు

ఫైనల్ కాదు..మళ్లీ దరఖాస్తులు తీసుకుంటామన్న అధికారులు

పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణ



నవతెలంగాణ- విలేకరులు

ప్రజాపాలన గ్రామసభల్లో గురువారం నిరసనలు, నిలదీతలు కొనసాగాయి. నాలుగు సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, రీసర్వే చేయాలంటూ జనం డిమాండ్ చేశారు. పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఘర్షణకు దిగారు. ప్రొటోకాల్ విషయంలో వివాదం ఏర్పడింది.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం, నూతన్‌కల్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. అనర్హులకు పథకాలు వచ్చాయని ఇందిరమ్మ కమిటీ సభ్యుల ముందే గ్రామస్తులు ఆందోళన చేశారు. జవహర్‌నగర్ 19వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో ప్రొటోకాల్ వివాదం ఏర్పడింది. ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ఫొటోలు లేవని కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అభ్యంతరం తెలిపారు.

ఖమ్మం జిల్లా ఖమ్మం అర్బన్ మండలం 57వ ...15లో

త్వరితగతిన లెండి ప్రాజెక్టు నిర్మాణం

మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధులతో సమీక్ష

ఇరు రాష్ట్రాలు సంయుక్తంగా రూ.1040 కోట్ల ఖర్చు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహారాష్ట్ర-తెలంగాణ మధ్య నున్న లెండి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక దష్టి సారించిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ రవీంద్రచవాన్, మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌రావు పాటిల్, సురేష్ పండిత్ వార్, సుభాష్‌బాద్, వాకిడిష్వార్, దినేష్ అవాజ్, సందీప్ పాటిల్ తదితర మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధుల బందం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా లెండి భారీ ప్రాజెక్ట్ పూర్తి చేసే అంశంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1984 ప్రాంతంలో రూ.2183.88 కోట్ల అంచనా వ్యయంతో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా వద్ద ప్రారంభించిన లెండి ప్రాజెక్ట్ పూర్తయితే తెలంగాణలో 38573.15 ఎకరాలు, మహారాష్ట్రలో 27710.397 ఎకరాలు సేద్యంలోకి వస్తుందన్నారు. ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల ఒప్పందం ప్రకారం అటు మహారాష్ట్ర ఇటు తెలంగాణ రాష్ట్రాలు ఈ ప్రాజెక్ట్‌పై రూ.1040.87 కోట్లు ఖర్చు చేశాయని చెప్పారు. దీంతో ఎర్తేన్ డ్యామ్ వర్క్ 70శాతం, స్పిల్ వే 80శాతం పూర్తిచేసినట్టు వివరించారు. కాలువల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని ఆయన తెలిపారు. భూ అంతర్భాగం నుంచి పైపుల ద్వారా నీటిసరఫరాకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు.

అయితే కాలక్రమంలో భూనిర్వాసితులు అడ్డుపడడంతో 2011లో అర్థాం తరంగా నిలిపివేయబడిన పనులను తిరిగి పునరుద్ధరించి నట్టు తెలిపారు. నది గర్భంలోని మట్టి పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొం దించుకుంటు న్నట్టు ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల ఒప్పందం లో భాగంగా వచ్చే ఏడాది చివరినాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు మంత్రి వివరించారు.

యూజీసీ ప్రతిపాదనలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా ప్రతిపాదనలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ యూజీసీ ప్రతిపాదనలు రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రాల అధికారాలను కేంద్రీకృతం చేసి విశ్వవిద్యాలయాల పాలనను కేంద్రం చేతుల్లోకి తీసుకోవడం సరైంది కాదన్నారు. వీసీల నియామకానికి సంబంధించి ప్రస్తుత విధానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయం, యూజీసీ నుంచి ఒకరు చొప్పున ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ ఏర్పడుతుందని వివరించారు. ఈ విధానం బాగుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వం పాత్ర ఇందులో ఉందని చెప్పారు. ఆ సెర్చ్ కమిటీ పరిశీలించి ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లతో జాబితాను తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తుందని వివరించారు. కానీ యూజీసీ ప్రతిపాదనల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు వీసీల నియామకంలో ఎలాంటి పాత్ర లేదన్నారు. ఇంకోవైపు వీసీలుగా నియామకం కావాలంటే ప్రొఫెసర్‌గా పనిచేయాల్సిన అవసరం లేదనీ, ఏ రంగంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం నియమించడానికి అవకాశం ఉందని చెప్పారు. విశ్వవిద్యాలయాలపై రాజకీయ జోక్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ నుంచి రాష్ట్రాలకు ఎలాంటి నిధులు రావడం లేదన్నారు. అలాంటప్పుడు విధానాలు రూపొందించి దాన్ని అమలు చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అయితే కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఉన్నట్టుగా వీసీల పదవీకాలం ఐదేండ్లు ఉంటే బాగుంటుందని చెప్పారు.

24న కేపీహెచ్‌బీలో స్ట్రే పీసెస్ ప్లాట్లు వేలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలో మిగిలిన చిన్న విస్తీర్ణం గల (స్ట్రే పీసెస్) వేలాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్టు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మెన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల నిర్మాణ పథకాలను అమలు చేసేందుకు వీలుకాని అక్కడక్కడ ఇళ్ల మధ్య ఉన్న ప్లాట్లు మాత్రమే వేలానికి ప్రజలకు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. వేలానికి నిర్దేశించిన ప్లాట్లు అత్యంత విలువైన అభివృద్ధి చెందిన ప్రాంతాలకు సంబంధించినవనీ, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని బోర్డు ద్వారా చేపట్టే ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణాలకు వినియోగించబడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ సుమారు రూ.700 కోట్ల విలువైన హౌసింగ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఆయా భూములకు ప్రహారీ గోడల నిర్మాణం ప్రారంభమైందనీ, ఇందు కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. చట్టవి రుద్ధంగా ఆక్రమించే వారిని ఇకపై ఉపేక్షించేది లేదనీ, వారిపై చట్టప రంగా క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు.

200 మంది పోలీసుల పహారాలో దళిత వరుడి ఊరేగింపు

కోరలు చాచిన కుల వివక్ష

జైపూర్: రాజస్థాన్‌లో కుల వివక్ష తీవ్ర రూపు దాల్చింది. దళితులు శుభకార్యాలు చేసుకునేందుకు కూడా వీల్లేని విధంగా అక్కడి పెత్తందార్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. దీంతో దళితుల శుభకార్యాలను సైతం పోలీసుల పహారాలో నిర్వహించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో లావెరా గ్రామంలో ఇలాంటి సంఘటనే జరిగింది. పెళ్లి సందర్భంగా నిర్వహించే 'బరాత్' నిర్వహిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఒక దళిత కుటుంబాన్ని పెత్తందార్లు బెదిరించడంతో ఆ కుటుంబం జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది.





భవిష్యత్ ఎర్రజెండాదే

- ప్రజా ఉద్యమాలతో పాలకుల విధానాలు ఎండగడుతాం
- హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
- ఫిబ్రవరిలో ప్రజా ఉద్యమాలు
- 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ
- అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆంక్షలతో నష్టం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- మిర్యాలగూడలో గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-మిర్యాలగూడ

పాలకుల విధానాలు చూసి ప్రజలు విసిగిపోయారని, రాబోయే కాలమంతా ఎర్రజెండాదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఈదులగూడెంలో సుందరయ్య విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అక్కడే సీపీఐ(ఎం) జెండాను కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు. అక్కడి నుంచి రామచంద్రగూడెంలోని గాదె శ్రీనివాసరెడ్డి స్థూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థూపం ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో, మీడియా సమావేశంలో తమ్మినేని ప్రసంగించారు. పేదల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. దోపిడీ ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటుందని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల హామీలు ఇచ్చి అమల్లో విఫలమైందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అఖిలపక్షాల అభిప్రాయాలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాబోయే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు స్పష్టంగా ఉండాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఫిబ్రవరిలో ప్రజాఉద్యమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. కేటాయించిన నిధులను సక్రమంగా అమలు చేసే వరకు అన్ని కమ్యూనిస్టు పార్టీలను కలుపుకొని పోరాటాలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు రసాభాసగా సాగుతున్నాయని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండటం లేదని అన్నారు. అందుకే గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తున్నారన్నారు. అర్హులైన పేదలందరికీ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28వరకు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో ప్రజాసమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, పాలడుగు నాగార్జున, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్, టూటౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, వరలక్ష్మి పరశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, అయ్యూబ్, గాదె శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు గాదె పద్మ, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు

దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం చట్టాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, మైనార్టీలపై దాడులు చేస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో శ్రామికరంగం ఉద్యమాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అమెరికాలో ట్రంప్ గెలిస్తే దేశానికి లాభం జరుగుతుందని కొందరు భావించారని కానీ భవిష్యత్‌లో 200శాతం పనులు జరగవన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని చెప్పారు. ట్రంప్ ఆంక్షల వల్ల దేశ యువతకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

నాకు అధికారం ఉన్నా.. అలా చేయలేదు

- క్షమాభిక్షపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- టిక్‌టాక్‌పై ఆందోళనలను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు
- ప్రమాణ స్వీకారం తర్వాత తొలి ఇంటర్వ్యూ



వాషింగ్టన్: తాను తొలిసారి అధ్యక్షుడిగా పని చేసినపుడు తనకు తాను క్షమాభిక్ష ప్రసాదించుకునే అధికారమున్నా.. అలా చేయలేదని అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత వైట్‌హౌస్‌లో ఆయన తొలిసారి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు, తన కుటుంబ సభ్యులు, పలువురు అధికారులకు క్షమాభిక్ష ప్రసాదించుకున్నారని ట్రంప్ విమర్శించారు. తొలిసారి అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో తనకు తాను క్షమాభిక్ష ప్రసాదించుకునే అధికారం ఉన్నా దాన్ని ఉపయోగించుకోలేదని వెల్లడించారు.

ప్రస్తుతం జైల్లో ఉన్న దేశభక్తులను కాపాడేందుకే తాజాగా ఈ అధికారాన్ని వాడుకొన్నట్టు ఆయన స్పష్టంచేశారు. ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలకు సంబంధించి ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం విదితమే. ఈ విషయంలో భద్రతాపరమైన ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. కొత్త అధ్యక్షుడు ట్రంప్‌నకు తొలి ఫోన్‌కాల్ సౌదీఅరేబియా నుంచి వచ్చింది. ఆ దేశ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు.

వామపక్షమే ప్రత్యామ్నాయం



(మొదటి పేజీ తరువాయి)

వామపక్షాలు మాత్రమే. ప్రపంచం మొత్తం చూసినా కమ్యూనిస్టు దేశాలు, రాష్ట్రాల్లోనే ఇలాంటి అనర్థాలు జరగకుండా పాలన సాగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా సోషలిజమే ప్రత్యామ్నాయంగా ముందుకొస్తోంది. ఈ దేశంలోనూ కమ్యూనిస్టులు, వామపక్షాలు ప్రత్యామ్నాయంగా ఉంటారు.

మూడేండ్లలో సీపీఐ(ఎం) పోరాట ఫలితాలు..

గడిచిన మూడేండ్లలో ప్రధానంగా పోడు సమస్యలపై సీపీఐ(ఎం) పోరాడింది. ఐదు లక్షల ఎకరాలకు కేసీఆర్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందంటే ఆనాడు సీపీఐ(ఎం) పార్టీ చేపట్టిన పోరాటాలే కారణం. ఆదిలాబాద్ నుంచి అశ్వారావుపేట వరకు రోడ్లను దిగ్బంధం చేశాం. మిగతా అన్ని పక్షాలతో కలిసి ఒక ఎకరం భూమి కూడా ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకోకుండా పోరాటాలు నిర్వహించాం. ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి పట్టాలు ఇచ్చింది. ఉపాధిహామీ చట్టంపైనా ఆందోళనలు చేశాం. కూలి రేట్లు పెంచటానికి కృషి చేశాం. జీవోలు పాస్ చేయించేందుకు పోరాడాం. సింగరేణి పరిరక్షణ యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్రలు నిర్వహించాం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దిగివచ్చి సింగరేణి ప్రయివేటీకరణను నిలిపివేశాయి. మూసీ పరిరక్షణ, హైడ్రా బాధితులకు అండగా పోరాడాం. ముఖ్యంగా బీఆర్ఎస్ పాలన చివరిరోజుల్లో పేదలకు ఇండ్ల స్థలాల కోసం పోరాడాం. 18 జిల్లాల్లో రెండు లక్షలకు పైగా పేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. ఈ పోరాటంలో ప్రభుత్వం, పోలీసులు తల్లులు, పిల్లలు అని కూడా చూడకుండా ప్రజలపై నిర్బంధాలు విధించారు. సీపీఐ(ఎం) నాయకులను జైళ్లలో పెట్టారు. ఇలాంటి దుశ్చర్యలన్నింటినీ ఎదిరించి గుడిసెలను నిలబెట్టాం.

బీజేపీ ఎదుగుదల అత్యంత ప్రమాదం...

బీజేపీ మతోన్మాద చర్యలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో కూడా బీజేపీ బలం పెరుగుతుండటం అత్యంత ప్రమాదకరం. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద ధోరణిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సుజాతాలు ఏకకాలంలో నిర్వహించాం. ఈ సందర్భంగా జరిగిన సభలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, బృందాకరత్ తదితరులు హాజరయ్యారు. 15 రోజుల పాటు కొనసాగిన ఈ జాతాలో కొన్ని లక్షల మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ముగింపు సభ హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నిర్వహించాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, అంతర్జాతీయంగా ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా విస్తృతంగా పోరాడాం.

బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ గెలుపు

గడిచిన మూడేండ్లలో రాష్ట్రంలో ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్ గెలిచింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ పూర్తి ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించింది. నియంతృత్వ ధోరణి, కుటుంబ పాలన, ప్రజాస్వామ్యం దెబ్బతినటం, అవినీతి పెచ్చురిల్లటంతో పాటు పథకాల అమలులో పారదర్శకత లోపించింది. ప్రజల్లో అసంతృప్తి పెల్లుబుకింది. దీనికి ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలు కూడా తోడయ్యాయి.

అదే సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో వాగ్దానాల వర్షం కురిపించింది. ప్రజానీకం కాంగ్రెస్ వైపు మళ్లింది. అయితే ఈ సంవత్సరకాలంలోనే కాంగ్రెస్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాలన్నీ వమ్మయ్యాయి. ఒకటి, రెండు హామీలు నెరవేర్చినా అవికూడా అంతంతమాత్రంగానే అమల య్యాయి. రైతు రుణమాఫీ 60శాతం రైతాంగానికి మాత్రమే అందింది. మహిళలను బస్సు ఎక్కించటం మినహా మిగతా వాగ్దానాలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. వాటి అమలు కోసం రూ.వేలకోట్లు కావాలి. కానీ ప్రభుత్వం ఆ డబ్బులను కేటాయించే స్థితిలో లేదు. రైతుభరోసా గతంలో ఏడాదికి ఎకరానికి రూ.10వేలు ఉంది. దాన్ని రూ.15వేలు చేస్తామన్నారు. కానీ ఉన్న పదివేలు కూడా బందయ్యాయి. వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న రూ.12వేలు ఇంకా అమలు కాలేదు. మహిళలకు ఇంటికి రూ.2,500, మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. కనీసం రూ.20వేలు కూడా ఇవ్వలేకపోయారు. నిరుద్యోగ భృతి రూ.4వేల ఊసేలేదు. బీసీలు, ఎస్టీలకు అనేక వాగ్దానాలు చేశారు. గిరిజనులకు కేసీఆర్ హయాంలో ఇచ్చిన సుమారు 4 లక్షల ఎకరాల పోడు పట్టాలు కాకుండా ఇంకా లక్షల ఎకరాల భూములు పెండింగ్‌లో ఉన్నాయన్న కాంగ్రెస్ కొత్తగా ఒక్క పట్టా కూడా ఇవ్వలేదు. ఈ రకంగా అనేక వాగ్దానాల అమలు లేకపోవడం వల్ల ప్రజలు అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యంగా రైతాంగంలో అసమ్మతి పెరుగుతోంది.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలన ఉండాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అన్ని పార్టీలు, అన్ని తరగతుల ప్రజానీకాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి. ప్రతి ముఖ్యవిషయాన్ని ప్రజలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. గతంలో ప్రజాభిప్రాయాన్ని వెల్లడికానీయలేదు.. ధర్నాచౌక్ రద్దు చేశారు. నాయకులను అరెస్టు చేసేవారు.. అందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల క్యాంపెయిన్‌లో చెప్పినట్టుగా వాక్ స్వాతంత్ర్యం, పత్రికాస్వేచ్ఛను పునరుద్ధరించాలి. ప్రతి సమస్యపైనా అన్ని పార్టీలతో చర్చిస్తామన్నారు. ఏమి చర్చించారు? హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్లలో గిరిజనుల భూములు లాక్కోవడంపై ఏ పార్టీతో చర్చించారు. కనీసం అక్కడి రైతులతోనైనా చర్చించారా? రాష్ట్రంలో జరుగుతున్న ఏ ఒక్క కార్యక్రమంపైనా ఇప్పటి వరకు అఖిలపక్ష సమావేశాలు జరిగింది లేదు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలంటే ఐదేండ్లకోసారి ఎన్నికలు నిర్వహించటం కాదు.. పరిపాలనా సంబంధమైన ముఖ్య విషయాలన్నీ ఏది అమలు చేయాలన్నా దానికి ముందు ప్రజాభిప్రాయం తీసుకోవటంతో పాటుతదనుగుణంగా పాలన చేయాలి. కానీ ఈ లక్షణాన్ని ఏ ప్రభుత్వమూ పాటించట్లేదు.

కాంగ్రెస్‌పై నమ్మకం సడలుతోంది..

జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ప్రకటిస్తున్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా రూ.12వేలు, ఆత్మీయబంధు కింద వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇస్తామం టున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి కాబట్టి వీటిని అమలు చేస్తామంటున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఒకవేళ అమలు జరిపినా నామమాత్రమేనన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌పై నమ్మకం సడలుతోంది. కాంగ్రెస్, రేవంత్‌రెడ్డిపై ఏ విశ్వాసంతో ప్రజలు ఓటు వేశారో దాన్ని నిలుపుకోవాలంటే ప్రభుత్వం చాలా సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పథకాలను నిజాయితీగా అమలు చేయాలి.

ప్రభుత్వాలేవైనా యథావిధిగా నిర్బంధాలు..

రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలనే కాకుండా ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత పాలన అందిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియంతృత్వం రాజ్యమేలిందన్నారు. ప్రజాభవన్‌కు వచ్చి ముఖ్యమంత్రులు, మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చే అవకాశం కల్పిస్తామన్నారు. కేసీఆర్ హయాంలో ప్రగతిభవన్ చుట్టూ వేసుకున్న కంచెలన్నీ రేవంత్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించారు. స్వేచ్ఛ వచ్చిందన్నారు. సంతోషమే.. కానీ ఈ ప్రభుత్వంలోనూ నిర్బంధంలో తేడా లేదు. ప్రజా నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదు. యథాప్రకారం అరెస్టులు చేస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి ఏ జిల్లాకు పోయినా ముందు సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేసేవారు. ఇప్పుడూ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఏమీ తేడాలేదు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అనేది కూడా బూటకం అని తేలింది.

కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి..

కాంగ్రెస్ వాగ్దానాల అమలుకు బీఆర్ఎస్ చేసిన అప్పులను కారణంగా చూపటం సాకు మాత్రమే. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, అసెంబ్లీ ఎన్నికల క్యాంపెయిన్ నాటికి రూ.7లక్షల కోట్ల అప్పు ఉందని తెలుసు. ప్రభుత్వాలు ఏవైనా అప్పులు, ఆదాయం, ఖర్చులను బడ్జెట్‌లో చూపుతాయి. అప్పులపైన సీపీఐ(ఎం)తో పాటు కాంగ్రెస్ కూడా విమర్శిస్తూ వచ్చింది. అప్పు ఉందని తెలిసి హామీలు ఎలా ఇచ్చారు. వాగ్దానాలను ఎరగా వేసి ఓట్లు సాధించాలనే తప్పుడు ఆలోచన తప్ప మరొకటి కాదు. ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయలేని పక్షంలో ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

నాడు వ్యతిరేకించి.. నేడు భూములు లాక్కోవడం ఏంటి?

రైతులు భూములు కోల్పోతున్నారు. ఆనాడు ఇబ్రహీంపట్నం ఏరియాలో ఫార్మా సిటీ కోసం దాదాపు 13వేల ఎకరాలు సేకరించారు. దానిని కాంగ్రెస్ వ్యతిరేకించింది. సీపీఐ(ఎం) లాగానే ఆ పార్టీ కూడా ఆందోళనల్లో పాల్గొంది. కానీ మళ్లీ లగచర్లలో ఫార్మాసిటీ కోసం 3,000 ఎకరాల భూమి సేకరించటానికి పూనుకుంటున్నారు. ఇది ద్వంద్వనీతిగా భావిస్తున్నాం. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట మొదట చేసిన హడావుడి కొంత సానుకూలంగా కనిపించింది. ఆక్రమిత భూములను లాక్కుంటున్నారని అంతా సంతోషించారు. కానీ పేదల గుడిసెలకు, మధ్యతరగతి ఇండ్లకు ముప్పు రావటంతో అది వివాదాస్పదమైంది. మొత్తంగా చూస్తే ఇప్పుడున్న రాష్ట్ర పరిస్థితి 'పెనం నుంచి పొయ్యిలో పడ్డామా..?' అన్న భావన ప్రజల్లో కలిగిస్తోంది.

యువతను గాలికొదిలిన పాలకులు

ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం | ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం

- ఖాళీ పోస్టులున్నా నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం
- ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ మోడీ మోసం
- తొలి ఏడాదిలో 2 లక్షల కొలువులిస్తామని కాంగ్రెస్ సర్కారు
- 55,143 ఉద్యోగాలతో సరిపెట్టిన రేవంత్ ప్రభుత్వం
- నిరుద్యోగుల సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతర పోరాటాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయి. వారి సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేశాయి. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో విఫలమయ్యాయి. ఎన్నికల్లో చెప్పేదొకటి, అధికారంలోకి వచ్చాక చేసేదొకటి అన్నచందంగా మారింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ 2019 పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారు. వివిధ శాఖల్లో 9.64 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. వాటి భర్తీ కోసం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఏడాదిలో 55,143 ఉద్యోగాలను మాత్రమే రేవంత్ ప్రభుత్వం భర్తీ చేసింది. రాష్ట్రంలో 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ నివేదిక ఇచ్చింది. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 1.32 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. 80,039 ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పారు. కానీ అందులో 40 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఉద్యోగాల భర్తీ పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులున్నా నియామకాలను మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పాలకులు అనుసరిస్తున్న తీరుపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నది. నిరుద్యోగ యువతకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) అండగా నిలుస్తున్నది. వారి సమస్యలపై స్పందించి నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నది. ప్రభుత్వాల తీరును ఎండగడుతూ ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ ఒత్తిడి పెంచుతున్నది.

కొలువులు, పరీక్షల తేదీల్లేని జాబ్‌క్యాలెండర్

ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అసెంబ్లీ వేదికగా గతేడాది ఫిబ్రవరి రెండున ప్రకటించింది. వివిధ శాఖల్లో పోస్టుల భర్తీ కోసం 20 రకాల నోటిఫికేషన్లకు సంబంధించిన వివరాలను పొందుపర్చింది. నోటిఫికేషన్ విడుదల చేసే నెలతోపాటు, నియామక పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో వివరించింది. కానీ ఆ జాబ్ క్యాలెండర్‌లో ఏ నోటిఫికేషన్ ద్వారా ఎన్ని కొలువులను భర్తీ చేస్తారో, రాతపరీక్షలను ఎప్పుడు నిర్వహిస్తారో నిర్దిష్టంగా లేకపోవడం గమనార్హం. ప్రచారార్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎస్సీ వర్గీకరణ అమలుకు అనుకూలంగా గతేడాది ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. ఆ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం స్వాగతించింది. అందులో భాగంగా అక్టోబర్ 12న ఎస్సీ వర్గీకరణను అధ్యయనం చేసేందుకు జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ నివేదిక వచ్చిన తర్వాతే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడతాయని తెలుస్తున్నది. దీంతో పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని యువజన సంఘాలు విమర్శిస్తున్నాయి. యూత్ డిక్లరేషన్‌లో జాబ్ క్యాలెండర్‌తోపాటు నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేలు ఇస్తామని ప్రకటించింది. విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఇవేవీ ఇంకా అమలుకు నోచుకోలేదు.

వెంటాడిన టీజీపీఎస్సీ వైఫల్యాలు

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వైఫల్యాలతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, కోర్టు వివాదాలతో పరీక్షలు కొన్ని రద్దు కావడం, మరికొన్ని వాయిదా పడ్డాయి. టీజీపీఎస్సీ ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా యూపీఎస్సీని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీజీపీఎస్సీ బృందం సందర్శించి పలు అంశాలను పరిశీలించింది. టీజీపీఎస్సీ చైర్మెన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశాన్ని నియమించింది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. ఫలితాలు విడుదల కావాల్సి ఉన్నది.

ఉద్యోగాల భర్తీ కోసం డీవైఎఫ్ఐ పోరాటం


టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలంటూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయి. ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఉద్యమాల్లో ఆ సంఘం కీలకంగా పనిచేసింది. ప్రగతిభవన్‌ను ముట్టడించింది. మెగాడీఎస్సీ కోసం పోరాడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు పరుగుపందెంలో అవకతవకలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పాత పద్ధతిలో ఈవెంట్లను నిర్వహించాలని డిమాండ్ చేసింది. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్లను ముట్టడించింది. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా సర్వే చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. భగత్‌సింగ్, చేగువేరా, సుందరయ్య వంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తుంది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారిరపై దాడులు జరిగితే డీవైఎఫ్ఐ అండగా నిలిచింది. మతోన్మాదానికి వ్యతిరేకంగా చర్చాగోష్టులు, సెమినార్లు నిర్వహించింది. ఇండ్లు, ఇండ్ల స్థలాల ఉద్యమంలోనూ భాగస్వామి అయ్యింది. సినిమా టికెట్ల ధరల పెంపును వ్యతిరేకించింది. బెనిఫిట్ షోలను రద్దు చేయాలని కోరింది. భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు రక్తదానం చేస్తున్నది. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడింది.

యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి : కోట రమేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు



కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యూత్ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యతనివ్వాలి. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు నిరుద్యోగ యువతను ప్రలోభపెట్టి అధికారంలోకి వచ్చారు. గెలిచాక పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ తరహాలోనే ఈ ప్రభుత్వం కూడా పనిచేస్తున్నది. గ్రూప్-2 వాయిదా వేయాలని కోరిన అభ్యర్థుల పట్ల కర్కశంగా వ్యవహరించింది. ఇచ్చిన మాట ప్రకారం మొదటి ఏడాదిలో రెండు లక్షల కొలువుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయలేదు. నిరుద్యోగుల్లో నిరాశ ఉన్నది. టీజీపీఎస్సీని మరింత పటిష్టపరచాలి. నిరుద్యోగ రహిత తెలంగాణ కోసం తగిన బడ్జెట్‌ను కేటాయించాలి. ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీలున్నాయో జాబ్‌క్యాలెండర్ ద్వారా ప్రకటించాలి. విద్య, ఉపాధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి రాబోయే కాలంలో సమరశీల ఉద్యమాలను నిర్వహిస్తాం.

ఉద్యోగాలు భర్తీ చేసే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి : ఆనగంటి వెంకటేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి



కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో యూత్ డిక్లరేషన్‌లో భాగంగా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామనీ, నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేలు ఇస్తామనీ, యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. పూర్తిస్థాయి సమాచారం, పోస్టుల వివరాలతో జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించాలి. యూత్ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ రాయితీలతో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేయాలి. కోర్టు వివాదాలు, న్యాయ వివాదాల్లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయాలి. విభజన హామీల అమలు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. ఉద్యోగాలు పొందలేని యువతకు ఆర్థిక సహకారం చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి. హామీలను అమలు చేయాలని ప్రశ్నించే నిరుద్యోగులపై బీఆర్ఎస్ తరహాలోనే నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని మానుకోవాలి. లేదంటే యువత ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

నవతెలంగాణ

మన దేశం, మన ప్రజలు, మన జీవితాలు, మన భౌతిక సామాజిక పరిసరాలను పట్టించుకునే విద్యను బోధించాలి - మహాత్మాగాంధీ

శుక్రవారం 24 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

సంపన్నుల రాజ్యం!



మొన్ననే ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదలైంది. మానవజాతి చరిత్రలో ఇంతకుముందెన్నడూ ఎరగని అసమానతలపర్వం ఇప్పుడు సమాజాన్ని కలవరపెడుతున్నది. ప్రపంచంలో సంపదంతా ఒకవైపు పోగుపడు తుండగా, పేదరికం, దారిద్ర్యం దానికి రెండింతలు వేగంగా అభివృద్ధి చెందుతున్నది.ఇది ఆందోళన కలిగించే అంశం. ప్రతి ఏడాదిలాగే ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సమావేశం ప్రారంభమయ్యే రోజు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ అసమానతలపై ఓ నివేదికను విడుదల చేస్తుంది. ప్రపంచీకరణ సంస్కరణలు ప్రారంభమైన 1990వ దశకం నుంచి పేదల జీవితాల్లో ఎలాంటి మార్పురాలేదని, కోటీశ్వర్ల సంపద మాత్రం అమాంతం పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది.

ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో 2024 సంవత్సరంలో 204 మంది చేరారు. అంటే వారానికి సగటున సుమారు నలుగురు వ్యక్తులు కుబేరులవుతున్నారన్నమాట. ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన పదిమంది సంపద కరోనా మొదలైనప్పటి నుంచీ ఇప్పటివరకు మధ్య కాలంలో రెట్టింపు కాగా, ప్రపంచ జనాభాలో తొంభైతొమ్మిది శాతం ఆదాయం అదేకాలంలో పడిపోయింది. ప్రజలు పనుల్లేక పస్తులున్నారు. పైసల్లేక విలవిల్లాడారు. ఈ పదిమంది సంపద మాత్రం రోజుకు సగటున రూ.8.60లక్షల చొప్పున పెరిగింది. ప్రపంచ జనాభాలో సుమారు ఇరవై ఐదు లక్షల మంది దగ్గర యాభై లక్షల కోట్ల డాలర్ల సంపద పోగైంది.ఎందుకీ కోటీశ్వరుల సంఖ్య పెరుగుతోంది? కార్మికులను చేస్తున్న దోపిడీ ప్రభుత్వాలు వారికి అండగా నిలవడమే కారణం.

> మోడీ ఈ పదేండ్ల పాలన చూస్తే సంపద కేంద్రీకరణ విషయంలో అసమానతలు గరిష్ట స్థాయికి చేరి ధనవంతులు కుబేరులయ్యారు.2022-23 నాటికి దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్కశాతం మంది సంపద 22.6శాతం నుండి నలభై శాతానికి ఎకబాకింది. చారిత్రకంగా ఇది అత్యధిక పెరుగుదల. బ్రిటీష్‌వలస పాలన కాలం కన్నా మోడీ హయాంలోనే ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయని ఒక అధ్యయనం వివరించింది. నేలచూపులు చూస్తున్న వినిమయ వస్తు పరిశ్రమ, తలసరి రుణాల పెరుగుదల, పొదుపు రేటు తగ్గడం ఈ వాస్తవానికి బలం చేకూర్చే అంశాలు.

సంపదలో 36శాతం వారసత్వం నుంచి వచ్చిందే. 'కోటీశ్వరుల సంపద మాత్రమే పెరగలేదు, దీంతోపాటు ఆర్థికరంగంపై వారి పెత్తనం కూడా పెరుగుతోంది' అని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ చెప్పిన మాటల్ని తేలిగ్గా తీసుకోకూడదు, ఎందుకంటే, ఈ రోజు ప్రపంచ దేశాల్ని పన్నులు, సుంకాల రూపంలో పీల్చి పిప్పిచేస్తున్న అగ్రరాజ్యం, దానికి కుబేరుడు ప్రెసిడెంట్ అయ్యాడు. ఆయనకు మద్దతిచ్చిన ప్రపంచంలో అత్యంత సంపన్నుడు 'ఎక్స్' అధినేత ఎలాన్‌మస్క్ ఇతను రాబోయే కాలంలో ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడుపుతారని వస్తున్న వార్తల్లో ఆశ్చర్యం లేదు. రాష్ట్రాలు, దేశాలు, ఖండాల్లోని ఆర్థిక అసమానతల్లో తేడాలుండొచ్చు, మూలం మాత్రం పెట్టుబడిదారీ విధానమేనన్న సంగతి మరవకూడదు.

మన దేశంలో చూస్తే అసమానతలు పెరగడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రధాన కారణం. కార్పొరేట్ల స్వప్రయోజనాల కోసం పాటుపడటం, వారికి లబ్ది చేకూర్చే విధంగా చట్టాల్ని తీసుకురావడం, రూల్స్‌ని రూపొందించడం, యథేచ్ఛగా సాగుతున్న అవినీతికి వంతపడటం. ఇంకా ప్రమాదకరమైన అంశం ఏమిటంటే? పాలకులే ఏకంగా బడా పారిశ్రామికవేత్తలతో మిలాఖత్ అవ్వడం. ఇలాంటి నాయకులు దేశాన్ని ఏలుతుంటే సంపద కొద్దిమంది వద్దే కేంద్రీకరణ కాకుండా ఎలావుంటుంది?ఇప్పుడు భారత్‌లో జరుగుతున్నది కూడా అదే. మోడీ ఈ పదేండ్ల పాలన చూస్తే సంపద కేంద్రీకరణ విషయంలో అసమానతలు గరిష్ట స్థాయికి చేరి ధనవంతులు కుబేరులయ్యారు.2022-23 నాటికి దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్కశాతం మంది సంపద 22.6శాతం నుండి నలభై శాతానికి ఎకబాకింది. చారిత్రకంగా ఇది అత్యధిక పెరుగుదల. బ్రిటీష్‌వలస పాలన కాలం కన్నా మోడీ హయాంలోనే ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయని ఒక అధ్యయనం వివరించింది. నేలచూపులు చూస్తున్న వినిమయ వస్తు పరిశ్రమ, తలసరి రుణాల పెరుగుదల, పొదుపు రేటు తగ్గడం ఈ వాస్తవానికి బలం చేకూర్చే అంశాలు.

స్వాతంత్ర్యం ఆవిర్భవించినప్పటి నుంచి పాలకవర్గాలు చేస్తున్న స్వప్రయోజిత నిర్ణయాలు కార్పొరేట్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.కానీ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్థానంలో అదనంగా కులం, మతం, ప్రాంతం చేరాయి. ఇవి ప్రజల్ని విభజించి పాలించే విధానానికి దోహదం చేస్తున్నాయి. నేడు కేంద్ర పాలకులు అదానీ, అంబానీలాంటి కార్పొరేట్లకు కట్టబెట్టే భూగర్భ గనులు, విమానాశ్రయాలు, రైల్వేలు, టెలికాం, విద్యుత్ ఇవన్నీ కూడా భారత ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారాలు వేసే చర్యలే! పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాల ఫలితమే అసమానతల స్థాయి పెరగడానికి కారణం. ఇది పేదరికాన్ని మరింత పెంపొందిస్తున్నది. ఉపాధిని కబళిస్తున్నది. ఉద్యోగాల ఊసే లేకుండా చేస్తున్నది. ప్రజల్ని మరింత దారిద్ర్యానికి దిగజారుస్తున్నది.గతంలో ఎన్నడూ లేని విధంగా అదానీ,అంబానీ లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు రూ.పదహారు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాల్ని మాఫీ చేసింది మోడీ సర్కార్. ఈ డబ్బంతా ఎవరిది? ప్రజలదే కదా. అందుకే ప్రపంచ ఆకలిసూచీలో మన దేశానిది నూట ఐదవ స్థానం.

అణుశక్తి రంగానికి పునాదులు వేసిన హోమి.జె.బాబా



డాక్టర్ దేవరాజు మహారాజు



అణుశక్తి రంగంలో భారతదేశాన్ని ప్రపంచ దేశాల మధ్య తలెత్తుకుని నిలబడేట్లు చేసింది డాక్టర్ హోమి జహంగీర్ బాబా. ఆయన రూపకల్పన చేసిన పథకాల ఫలితంగానే ఈరోజు దేశంలో పలు అణురియాక్టర్లు విస్తరించాయి. పలు పరిశోధనలకు అవకాశం ఏర్పడింది.1948లో ఆటమిక్ ఎనర్జీ కమిషన్‌కు మొట్టమొదటి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాబా, దాని సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషిచేశాడు. ఆనాటి ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహద్దూర్ శాస్త్రి హయాంలలో భారత ప్రభుత్వానికి శాస్త్రసాంకేతిక రంగాలకు సంబంధించి సలహాదారుగా ఉన్నాడు. దేశంలో ఆటమిక్ ఎనర్జీ ప్రోగ్రాంకు పునాదులు వేసి, పెంచిపోషించాడు. డా. హోమి.జె.బాబా ఎంతటి వైజ్ఞానికుడో అంతటి కార్యనిర్వహణాధికారి. అందువల్లనే 1956లో 'అప్సర'ను ప్రారంభించ గలిగాడు. ముంబాయి ట్రాంబేలో ప్రారంభమైన ఈ అణురియాక్టర్, ఆసియాలోనే మొట్టమొదటిదిగా అయ్యింది. ఈయన సలహా సంప్రదింపులపైనే, సర్కస్, జర్లినా అనే రెండు న్యూక్లియర్ రియాక్టర్లు కూడా ఆ రోజుల్లోనే ప్రారంభమయ్యాయి.

డాక్టర్ హోమి జహంగీర్ బాబా 1909 అక్టోబర్ 30న ముంబాయిలో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించాడు. బాల్యం బొంబాయిలోనే గడిపాడు. అక్కడే చదువుకున్నాడు. నలభై అయిదేళ్ల తర్వాత అతను అక్కడే బొంబాయిలో ఒక అణుశక్తి కేంద్రాన్ని స్థాపిస్తాడని ఎవరూ ఊహించలేదు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు సైన్స్‌కు సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివేవాడు. క్లాసులోని పాఠాలకు పరిమితమై పోయేవాడు కాదు. కవిత్వమన్నా, చిత్రలేఖనమన్నా, పాశ్చాత్య సంగీతమన్నా ఎంతో ఇష్టపడేవాడు. సజనాత్మకశక్తికి పరిధులుండవు. అడ్డుగోడలుండవు. మనిషిలో ఒక విశాల భావం రూపుదిద్దుక దానికి సహజంగా కళలు ఎంతగానో దోహదపడతాయన్న విషయం ఎన్నోసార్లు రుజువైంది. అందుకే హోమి. జె.బాబాలోని చిత్రకారుడు, సాహిత్యాభిమాని జీవితాంతం సజీవంగానే ఉన్నారు.

అంచెలంచెలుగా ఎదిగి జహంగీర్ బాబా బొంబాయిలోని ఎల్ఫిన్ స్టోన్ కాలేజీలో చేరాడు. ఆ తర్వాత అక్కడి రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరాడు. పట్టా పుచ్చుకుని, ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచించాడు. అతనికైతే స్వతహాగా భౌతికశాస్త్రమంటే మక్కువ. కానీ, కొడుకు ఇంజనీర్ కావాలన్నది డా.బాబా తండ్రి కోరిక. కొడుక్కి తండ్రి కోరిక తీర్చక తప్పలేదు. ఉన్నతవిద్య కోసం కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వెళ్లాడు హోమి. అక్కడినుంచి 1930లో ఇంజ నీరింగు పట్టా తీసుకున్నాడు. కేవలం తండ్రి కోరిక తీర్చడానికే మాత్రమే- ఇంజనీరయితే- డా.బాబా స్వదేశానికి తిరిగి వచ్చి, ఒక సాధారణ ఇంజనీయర్‌గా స్థిరపడి పోయేవాడు. కానీ, అతనిలోని జ్ఞానపిపాస తీరలేదు. భౌతిక శాస్త్రంపై ఉన్న అభిరుచి తగ్గలేదు. సరికదా- రెండు మూడు రెట్లు ఇనుమడించింది. అందుకే మరో నాలుగేండ్లు అక్కడే ఉండి, ప్రపంచ ప్రసిద్ధులైన శాస్త్రవేత్తలతో కలిసి పనిచేశాడు 1934లో పి.హెచ్.డి పట్టా పొందాడు.

నీల్స్‌బోర్, ఫెర్మీ, పౌలి, వంటి వారితో కలిసి పనిచేసిన అనుభవం వధాపోలేదు. ఆ తర్వాత తన తర్వాతి తరం భారతీయ శాస్త్రవేత్తల్ని ప్రభావితం చేయగలిగారు. డాక్టరేట్ సాధించిన తరువాత కూడా 1937లో వాల్టర్ హెట్లర్‌తో కలిసి జగత్సంబంధమైన సూర్యకిరణాలపై విశేషమైన పరిశోధనలు చేశాడు. వాటివల్ల ఆయనకు అంత ర్జాతీయ పరిశోధనా రంగంలో

> జీవితాంతం బ్రహ్మచారిగా గడిపిన డాక్టర్ హోమి జహంగీర్ బాబా ఒక స్వాప్నికుడు. ఒక స్ఫురద్రూపి, ఒక మృదుభాషి, ఒక వైజ్ఞానికుడు, ఒక కార్యశీలి, ఒక వక్త, అంతర్జాతీయ అవగాహన గల దేశభక్తుడు! డబ్బుకు, తక్కువ స్థాయి ప్రాచుర్యానికి ఆయన ఎప్పుడూ విలువనివ్వలేదు కేంద్ర ప్రభుత్వం కేబినెట్‌లోకి ఆహ్వానిస్తే, మర్యాదగా తిరస్కరించాడు. ప్రధానమంత్రికి వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగానే ఉంటానన్నాడు. ఎందుకంటే ఆయనేమిటో ఆయనకు తెలుసు. ఆయన విలువ ఆయనకు తెలుసు. ఆయనకు సంతప్తినిచ్చే రంగమేదో ఆయనకు తెలుసు. ఈ దేశానికి తను ఏ రకంగా ఉపయోగపడగలడో, ఏ రకంగా సేవ చేయగలడో ఆరకంగానే చేశాడు. తను ఇమడని రంగంలో పొరపాటున కూడా ప్రవేశించలేదు.

మంచి గుర్తింపు లభించింది. MESONS అనే ప్రాథమిక అణువుల్ని కనుగొన్నవాడిగా వైజ్ఞానిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

1940లో హోమి.జె.బాబా స్వదేశం తిరిగివచ్చాడు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ - భౌతికశాస్త్ర విభాగంలో రీడర్‌గా చేరాడు. తర్వాత ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాడు. అప్పటినుండే ఆయన పథకాలు, కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వదేశం తిరిగొచ్చిన ఐదేండ్లలోనే టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ 1945లో స్థాపించాడు. దానికి ఫౌండర్ డైరెక్టర్ అయ్యాడు. శాస్త్ర వైజ్ఞానిక రంగంలో ఆయన ప్రభావం ఎంతగా ఉండేదంటే, ఆయన ఇచ్చిన ప్లాన్‌కు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఎప్పుడూ అడ్డుచెప్పేవాడు కాదు. వారిద్దరికీ ఒకరి మీద ఒకరికి అచంచలమైన విశ్వాసం ఉండేది. అందుకే గాఢమైన స్నేహితులయ్యారు. అసలు వైజ్ఞానికులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించి, వారి సామర్థ్యాన్ని దేశానికి ఉపయోగించడంలో నెహ్రూను మించిన ప్రధాని మనకు మరొకరు లేరు-అంటే అతిశయోక్తి కాదు. ఆయన దార్శనికుడు కాబట్టే త్వరితగతిన భారత దేశం ప్రపంచస్థాయి పరిశోధనాశాలలు నెలకొల్పుకోగలిగింది. అందువల్ల నూతన సంస్థల రూపకల్పనలో డా. హోమి జె.బాబాకు ప్రభుత్వపరంగా ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాలేదు. డా.బాబాకే కాదు, నాటి శాస్త్రవేత్తలకు ఎవరికీ ఏ ఇబ్బంది కలగలేదు. కారణం దేశ నిర్మాత నెహ్రూ ప్రధానిగా ఉండటం!

డాక్టర్ హోమి జె.బాబా దేశంలో అణుశక్తి రంగాన్ని ఎంతగా అభివృద్ధి పరిచాడో, దాన్ని శాంతి పూరితమైన ప్రయోజనాలకు మాత్రమే వాడాలని అంతగా తపన పడ్డాడు. ఆ ఆలోచనకు అంతర్జాతీయంగా ప్రాచుర్యాన్ని సాధిం చాడు. 1955లో జెనీవాలో జరిగిన మొట్టమొదటి ఆటమిక్ ఎనర్జీ కమిషన్- యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌కు ఛైర్మన్ అయ్యాడు. ఆటంబాంబుల్ని అన్నిదేశాలూ బహిష్కరించాలని పిలుపునిచ్చాడు. వినాశానికి దారితీసే పనులేవీ అణు శక్తితో చేయగూడదనీ- ఈ విషయంలో ప్రపంచ దేశాలన్నీ ఏకాభిప్రాయానికి రావాలనీ- ఆయన పట్టుబట్టాడు. ఒక శక్తిని సృష్టించడం మానవుడి చేతిలో ఉంది. దాన్ని అదుపులో ఉంచుకోగల మనోనిగ్రహం కూడా మనిషికే ఉండాలని వాంఛించాడు డా. హెూమిబాబా. ఆయన దూరదృష్టి గొప్పది!

మన దేశంలో తారాపూర్లో మొట్ట మొదటి ఆటమిక్ పవర్ స్టేషన్ నెలకొల్పిందీ, రెండేళ్ల తర్వాత రాజస్థాన్‌లో పోఖ్రాన్ ఫ్లుటో నియం ప్లాంట్ నెలకొల్పింది డా. హోమీ బాబా నేతృత్వంలోనే- ఆ విధంగా దేశంలో 1974 మే18న న్యూక్లియర్ డివైస్, పని ప్రారంభించింది. ఇంతలో జరగరాని సంఘటన ఒకటి జరిగింది. వైజ్ఞానికరంగం స్తబ్దతలో కూరుకుపోయింది.1966 జనవరి 24న ఒక అంతర్జాతీయ సదస్సుకు వెళ్తూ 56వ యేటా విమాన ప్రమాదంలో డా. బాబా ఫ్రాన్స్- మోంట్ బ్లాంక్ మాసిఫ్‌లో మరణించారు. ఎయిర్ ఇండియా విమానం 101 క్రాష్ కావడంతో ఆ ప్రమాదం జరిగింది. దేశం ఒక గొప్ప మనిషిని, జాతి రత్నాన్ని కోల్పోయిందని నాటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ప్రకటించారు. అంచెలంచలుగా దేశం వైజ్ఞానికంగా ఎదుగుతున్న దశలో హోమి.జె.బాబాను దేశం కోల్పో వడం అతిపెద్ద విషాదమనీ, ఆలోటును ఎవరూ పూడ్చలేరని, ప్రధానికి వైజ్ఞానిక సలహాదారుగా ఉన్న డా. హోమి బాబా మరణం, వ్యక్తిగతంగా తనకు పెద్దదెబ్బ అనీ- శ్రీమతి ఇందిరా గాంధీ తన సంతాప సందేశంలో ప్రకటించారు. వివిధ రంగాల్లో ఆయన చేస్తూ వచ్చిన కృషిని బేరీజు వేసుకోవడానికి, ఆయన వదిలి వెళ్లిన పనులు పూర్తి చేయడానికి ఎంతో నిపుణత, ఎంతో మనో ధైర్యం అవసరమౌతుంది- అని ఆమె అన్నారు. డా.బాబా మరణానంతరం, ఆయన జ్ఞాప కార్థం ఆయన నెలకొల్పిన సంస్థలన్నింటికీ ఆయన పేరు పెట్టారు. ట్రాంబేలోని ఆటమిక్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ బాబా ఆటమిక్ రీసెర్చ్‌గా- బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌గా మారింది. ఆయన ఆటమిక్ ఎనర్జీ కమిషన్‌కు ఛైర్మన్ కావడమే కాదు, 'పీస్‌ఫుల్ యూసెస్ ఆఫ్ ఆటమిక్ పవర్ కమిషన్'-కు కూడా ఛైర్మన్ కావడం విశేషం!

జీవితాంతం బ్రహ్మచారిగా గడిపిన డాక్టర్ హోమి జహంగీర్ బాబా ఒక స్వాప్నికుడు. ఒక స్ఫురద్రూపి, ఒక మృదుభాషి, ఒక వైజ్ఞానికుడు, ఒక కార్యశీలి, ఒక వక్త, అంతర్జాతీయ అవగాహన గల దేశభక్తుడు! డబ్బుకు, తక్కువ స్థాయి ప్రాచుర్యానికి ఆయన ఎప్పుడూ విలువనివ్వలేదు కేంద్ర ప్రభుత్వం కేబినెట్‌లోకి ఆహ్వానిస్తే, మర్యాదగా తిరస్కరించాడు. ప్రధానమంత్రికి వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగానే ఉంటానన్నాడు. ఎందుకంటే ఆయనేమిటో ఆయనకు తెలుసు. ఆయన విలువ ఆయనకు తెలుసు. ఆయనకు సంతప్తినిచ్చే రంగమేదో ఆయనకు తెలుసు. ఈ దేశానికి తను ఏ రకంగా ఉపయోగపడగలడో, ఏ రకంగా సేవ చేయగలడో ఆరకంగానే చేశాడు. తను ఇమడని రంగంలో పొరపాటున కూడా ప్రవేశించలేదు.

కె.ఎస్. కృష్ణన్, సత్యేంద్రబోస్, మేఘనంద్ సాహా, బీర్బల్ సహాని, విక్రమ్ సారాబాయి, ఎస్.కె.మిత్ర, మొదలైన భారతీయ శాస్త్రవేత్తల స్థాయికి ఎదిగిన హోమి జహంగీర్ బాబాను దేశం ఎప్పుడూ మరువలేదు. ఆయన అంతరంగం లోని చిత్రకారుడు జీవితాంతం సజీవంగా ఉన్నట్టుగానే- ఈ చిత్రకారుడిలోని వైజ్ఞానికుడూ సజీవంగానే ఉన్నాడు. అందుకే మన దేశపటం మీద శక్తివంతమైన అణుశక్తి కేంద్రాల్ని చిత్రించగలిగాడు. ఆడమ్స్ ప్రైయిజ్ (1942) విజేత, రాయల్ సొసయిటీకి ఎన్నికైన సభ్యుడు, మన పద్మ భూషణుడు (1954) డాక్టర్ హోమి జహంగీర్ బాబా. "ఫాదర్ ఆఫ్ ఇండియన్ న్యూక్లియర్ ప్రోగ్రాం"గా గుర్తుంటాడు.

ఈ వ్యాసరచయిత వైజ్ఞానిక సలహాదారుగా, సిద్ధార్థ నిర్వహణలో డాక్టర్ హోమి జె బాబా-డాక్టర్ విక్రమ్ సారాబాయి సైంటిఫిక్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాదు, ఎ.ఎస్.రావు నగర్‌లో 2024 నుండి చురుకుగా పని చేస్తూ ఉంది. మహనీయులైన ఆ మహాశాస్త్రవేత్తల స్ఫూర్తిని యువతరానికి అందిస్తూ ఉంది.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

8 గంటల పనిదినాన్ని వదులుకుందామా?

- సి.సాంబిరెడ్డి,
9490300107



ఈ మధ్య కార్పొరేట్ దిగ్గజాలు కొందరు పని గంటలు పెంచాలనే డిమాండ్‌ను బలంగా ముందుకు తెస్తున్నారు. ఈ డిమాండు ఈనాటిది కాదు. పెట్టుబడిదారీ విధానం ప్రాణం పోసుకున్న దగ్గర నుండి పెట్టుబడిదారీ వర్గం నిరంతరం ఈ పని గంటలు పెంచే ప్రయత్నం చేస్తూనే వుంది. కార్మికవర్గం దాన్ని అంతేబలంగా తిప్పి కొట్టి వుండకపోతే, ఈపాటికి వాళ్ల పని దినాలను పూర్తిగా 24 గంటలకు పెంచి వుండేవాళ్లేమో! 24 గంటలా, అని ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే, చరిత్రలో వాళ్ల పని గంటలను పెంచుకున్న తీరును చూస్తే, వాళ్ల దురాశకు హద్దులుండవని మనకు అర్థమౌతుంది.

ఇంగ్లాండులో ఫాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు చూస్తే, మార్క్సుకే ఆశ్చర్యం కలిగింది. అక్కడ పని గంటలు 13,14,15 అట్లా హనుమంతుని తోకలా 16,17,18 గంటల వరకు పెరుగుతూ పోయాయి. ఇంకా ముందుకు పోవాలనే వాళ్ల కోరిక. కాని పోలేక పోయారు. కారణం, వున్నది రోజుకు 24 గంటలే. వాటిలో 18 పోతే, ఇక మిగిలేది ఆరు గంటలు మాత్రమే. ఆ ఆరు గంటల్లో ఉదయాన్నే నెరవేర్చాల్సిన కాలకృత్యాలు, వంట, రెండుసార్లు తిండి, పిల్లలను సముదాయించటం, నిద్రపోవటం- ఇవన్నీ సాధ్యమా? అసాధ్యమనే, మనం అనుకుంటాం. అయినా, రాజు తల్చుకుంటే, దెబ్బలకు కొదవా, అన్నట్లు పెట్టుబడిదార్లు తలచుకుంటే జరగంది ఏముంటుంది? వాళ్లు అనుకున్నారు, కార్మికులు అన్నిటినీ ఆ ఆరుగంటల్లోనే ముగించారు.

> మన కార్పొరేటు దిగ్గజాలు పని గంటలు పెంచమని ఎందుకు డిమాండు చేస్తున్నాయి? తమ సంపదలు పెంచుకోటానికే, కదా! దానధర్మాలు చేయటానికి కాదు, కదా! దానధర్మాలు చేసేవాళ్లు ప్రభుత్వ ఖజానాలు కొల్లగొడతారా? కాని జరిగిందేమిటి? మన ప్రధాని నరేంద్ర మోడీ అంబానీ, అదానీల లాంటి కార్పొరేట్ దిగ్గజాల బ్యాంకు అప్పులు పదహారు లక్షల కోట్ల రూపాయలు రద్దు చేశాడు. ఇది అప్పనంగా ప్రజాధనాన్ని వాళ్లకు దోచిపెట్టటమే కదా!

కార్మికులను ఫాక్టరీలోనే వుండమన్నారు. అక్కడే తిండి, అక్కడే పడక, అక్కడే సంసారం. అక్కడే అన్నీ ఎట్లా? ఫాక్టరీ ఆవరణలోనే గూళ్ల లాంటి చిన్నచిన్న గదులు కట్టారు. ఒక్కొక్క దాంట్లో, నలుగురైదుగురిని కుక్కారు. అక్కడే ఆడవాళ్లు, అక్కడే మగవాళ్లు, అక్కడే బాల కార్మికుల్లోని మగ పిల్లలు, ఆడ పిల్లలు. అందరూ కలిసే వుంటారు. కలిసే తింటారు. కలిసే నిద్రపోతారు. ఈ క్రమంలో ఎన్ని ఘోరాలు జరుగుతాయో మనం ఊహించగలమా? (ఇదంతా పూర్తిగా అర్థం కావాలంటే మార్క్సు కాపిటల్ గ్రంథం చదవాల్సిందే.) ఆ పుట్టే బిడ్డల బాధ్యత ఎవరిది? ఇంత అమానుషత్వానికి, ఇంత దుర్మార్గానికి పాల్పడ గలిగింది, ఒక్క పెట్టుబడిదారీ వర్గమే. వీళ్ల వారసులే ఇప్పటి మన కార్పొరేట్ దిగ్గజాలు. ఆనాడు వాళ్లు ఎందుకు చేశారు ఈదుర్మార్గమంతా? ఆ 18 గంటలు పని చేయించుకుని గరిష్ట లాభాలను గుంజటానికే. వారి సంపదలు పెంచుకోటానికే, కదా!

ఈ పరిస్థితిని ఇట్లాగే ఎల్లకాలం కొనసాగించాలని వారు కలలు కన్నారు. కాని, అది వారి పేరాసే, అని తరువాత రుజువైంది. పని గంటల తగ్గింపు కోసం పోరాటం మొదట 1866లో చికాగో నగరంలో జరిగింది. దానిమీద ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఆరుగురు కార్మికులు ఆ పోరాటంలో నేలకొరిగారు. వారి రక్తంతో తడచిన బట్టే ఈనాటి మన ఎర్రజెండా. కార్మికవర్గ పోరాటాలకు అది శాశ్వత చిహ్నంగా నిలిచిపోయింది.

ఐరోపాలో జరిగిన పునరుజ్జీవనోద్యమం తరువాత పెట్టుబడిదారీ విధానం బాగా బలపడింది. ఇటు కార్మికవర్గం, అటు బూర్జువావర్గం రెండూ కూడా బలపడ్డాయి. కార్మికవర్గం ఆరోజుల్లో వేతనాల పెంపు, పని గంటల తగ్గింపు కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించింది. దానికి మార్క్సిస్టు సిద్ధాంతం తోడవడంతో అది మరింత బలపడింది. అనేక ఐరోపా దేశాల్లో జరిగిన కార్మికవర్గపోరాటాలు తిరుగుబాటు రూపం కూడా తీసుకున్నాయి. సామ్రాజ్యవాదుల మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో కార్మిక వర్గ నాయకత్వాన రష్యాలో సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అదే కార్మికవర్గాల నాయకత్వాన అనేక ఐరోపా దేశాల్లో సోషలిస్టు రాజ్యాలు ఏర్పడ్డాయి. మరికొన్ని ఐరోపా దేశాల్లో సోషల్ డెమోక్రాట్ల నాయకత్వాన పురోగామి ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలో పెట్టుబడిదారీ శక్తులు బలహీన పడటం, సోషలిస్టు శక్తులు బలపడటం మనం చూస్తాము. ఈ పోరాటాల్లో, అంటే పని గంటలు, వేతనాల కోసం జరిగిన పోరాటాలతో పాటు జరిగిన తిరుగుబాట్లు, యుద్ధాలు, విప్లవాల్లో కష్టజీవుల రక్తం ఏరులై పారింది. రష్యాలో సోషలిస్టు వ్యవస్థను కాపాడుకోటానికి ఫాసిస్టు జర్మనీ (హిట్లర్)కి వ్యతిరేకంగా జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో ఒక్క రష్యాలోనే నాలుగు కోట్ల మంది కష్ట జీవులు ప్రాణత్యాగం చేశారు. ఇట్లా అనేక పోరాటాల్లో కోట్లాది మంది ఛిందించిన రక్తం ఫలితంగానే 18 గంటల పనిదినం క్రమ క్రమంగా తగ్గి, అది ఎనిమిది గంటలకు చేరింది. ఈ పోరాటాల ఫలితంగానే బూర్జువా ప్రభుత్వాలు కూడా సంక్షేమ పథకాలను అమలు జరపక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాంటి రాజ్యాల్నే సంక్షేమ రాజ్యాలంటున్నాము.

ఇన్ని త్యాగాలతో సాధించిన 8 గంటల పని దినాన్ని మన కష్టజీవులు అంత తేలిగ్గా వదులుకుంటారా?

ఈ సందర్భంగా మరొక విషయం కూడా ప్రస్తావించాలి. మన కార్పొరేటు దిగ్గజాలు పని గంటలు పెంచమని ఎందుకు డిమాండు చేస్తున్నాయి? తమ సంపదలు పెంచుకోటానికే, కదా! దానధర్మాలు చేయటానికి కాదు, కదా! దానధర్మాలు చేసేవాళ్లు ప్రభుత్వ ఖజానాలు కొల్లగొడతారా? కాని జరిగిందేమిటి? మన ప్రధాని నరేంద్ర మోడీ అంబానీ, అదానీల లాంటి కార్పొరేట్ దిగ్గజాల బ్యాంకు అప్పులు పదహారు లక్షల కోట్ల రూపాయలు రద్దు చేశాడు. ఇది అప్పనంగా ప్రజాధనాన్ని వాళ్లకు దోచిపెట్టటమే కదా! ఇలా ప్రభుత్వాలు ప్రజా ధనాన్ని, వనరులను పాలక వర్గాలకు దోచి పెడతాయి కాబట్టే వారి ఆస్తులు రాకెట్ స్పీడుతో మిలియన్లు, బిలియన్లు, ట్రిలియన్లకు పెరుగుతూ వుంటాయి. లక్షల కోట్లలో కార్పొరేట్లకు అప్పులు రద్దు చేసిన మోడీ రైతుల అప్పులను ఎందుకు మాఫీ చేయడు?

వాళ్ల ఆస్తులను ఒకసారి పరిశీలిద్దాము.

అంబానీ ఆస్తి 8,37,810 కోట్ల రూపాయలు, ఆదానీ ఆస్తి 7,02,960 కోట్ల రూపాయలు.సాధారణ వ్యవసాయ కార్మికుని సగటు ఆస్తి 2 లక్షల రూపాయలు వాళ్లేమో లక్షల కోట్లలో వుంటారు.వీళ్లేమో వట్టి లక్షల్లో మాత్రమే వుంటారు. ఈదిగ్గజాల ఆస్తి వ్యవసాయ కార్మికుల ఆస్తుల కంటే నాలుగు కోట్ల రెట్లు ఎక్కువ. ఆకాశానికి భూమికి వున్నంత తేడా.

వీళ్ల వ్యవహారం ఇంకా బాగా అర్థం కావాలంటే, వాళ్ల దినసరి ఆదాయాలు కూడా పరిశీలించాలి. అదానీ ఆదాయం రోజుకు 1600 కోట్ల రూపాయలు.వ్యవసాయ కార్మికుని దినసరి సగటు ఆదాయం కేవలం 33 రూపాయలు. దేశంలో ఇంత దరిద్రం వుంది కాబట్టే ఆకలి సూచీలో మనదేశం 105వ స్థానంలో వుంది. (లెక్కలు తీసిన మొత్తం దేశాలు 121). మన చుట్టూ వున్న దేశాలు-చైనా, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ మన కంటే బాగా మెరుగైన స్థానాల్లోనే వున్నాయి. మనతోపాటు, మన స్థాయిలో వున్నది ఒక్క పాకిస్థాన్ మాత్రమే. ఆకలిసూచీ మాత్రమే కాదు.

మనదేశంలో అవసరమైన పోషకాలందక పిల్లలు గిడసబారి పోతున్నారు. మనదేశంలో వున్న దరిద్రాన్ని చూసి ఈ రిపోర్టు తయారు చేసిన పరిశోధకులు ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో ఇంత దరిద్రం ఎందుకున్నట్లు? కారణం, సంపన్నుల దగ్గర మేరు పర్వతాల్లా సంపదలు పోగు పడడమే. వాళ్ల దగ్గర వున్న సంపదలను కొంతవరకు తగ్గిస్తే దానితో పేదలు కొంతవరకు తేరుకో గలుగుతారు.

సంపదలు పోగుపడటానికి కారణం, దోపిడీయేనని అందరికి తెలిసిందే. బ్రిటీష్‌వాళ్లు మనదేశాన్ని పాలిస్తున్న కాలంలో అనేక కరువులు సంభవించాయి. కోట్లాది మంది కరువువాత పడ్డారు. ఒక్క బెంగాల్ కరువులోనే 44 లక్షల మంది చనిపోయారు. బ్రిటీష్‌వాళ్ల దోపిడీయే మన కరువులకు కారణమని ఆనాటి మన మేధావులు కరెక్టుగానే చెప్పారు. బ్రిటీష్‌వాళ్లు పరోక్షంగానైనా దాన్ని అంగీకరించారు. కాబట్టే వాళ్లు మన నదులకు ఆనకట్టలు కట్టి రైతులకు సాగునీరందించారు. ఆ విధంగా ధాన్యం ఉత్పత్తిని పెంచి కరువుల తీవ్రతను తగ్గించారు.

అట్లాగే మూడవ ప్రపంచ దేశాల దారిద్ర్యానికి సామ్రాజ్యవాదులు పోగేసుకుంటున్న సంపదలు కారణం కావా? అయినప్పుడు ఈ కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదలే మనదేశంలో దరిద్రానికి కారణమవుతాయి. కదా! అట్లాగే ఇప్పుడు మనదేశంలో తాండవిస్తున్న దరిద్రానికి ఈ బడా కార్పొరేట్లే కారణం. కాబట్టి ఈ పరిస్థితికి సంబంధించి వాళ్ల స్పందన కనీసం బ్రిటీష్ పాలకుల స్థాయిలోనైనా వుండాలి, కదా? కాని వాళ్లు దానికి సిద్ధం కాకపోగా మరింతగా ఆస్తులు పోగేసుకోటానికి పని గంటలు పెంచమని నిర్లజ్జగా డిమాండు చేస్తున్నారు. ఎంత దురాశ? ఎంత అమానుషం? అయినా కోట్లాది మంది కష్టజీవుల బలిదానంతో సిద్ధించిన ఈ 8 గంటల పనిదినాన్ని నేటి కష్టజీవులు అంత తేలిగ్గా వదులు కుంటారా? కనీస మద్దతు ధర కోసం లక్షలాది రైతాంగం సంవత్సరాల తరబడి ఎండనక, వాననక, చలి అనక సాగిస్తున్న సమరశీల పోరాటాన్ని మనం చూస్తూనే వున్నాం. 8గంటల పని దినాన్ని కాపాడుకోటానికి ఇంతకుమించిన పట్టుదలతో ప్రతిఘటనను కష్టజీవులు చేపట్టాలని, అలా చేపడతారని ఆశిద్దాం. ■

ప్రయివేటు టీచర్స్ బాధ్యత ప్రభుత్వాలది కాదా?



ఏ.విజయ్ కుమార్
9573715656

టీచర్ దేశానికి పునాది. దేశ భవితకు ఫౌండింగ్ స్టోన్. ఒక దిక్సూచి. దేశ భవిష్యత్తు నిర్మాణానికి రాళ్లెత్తే కూలీల వంటివారు టీచర్స్. ఆ దేశ పురోగాభివృద్ధినీ టీచర్ నిలబెట్టిన విలువలే నిర్దేశి స్తాయి. చదువు కొలువులు ఇస్తుందనే అందరూ భావిస్తారు. కానీ దేశంలో చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగం రాక ప్రయివేటు టీచర్‌గా వెట్టికి గురవు తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో చదువుకున్న బానిసలు ఎవరైనా ఉన్నారంటే ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్స్, లెక్చరర్స్ అనే చెప్పాలి. చేస్తున్న శ్రమకు పొందుతున్న ఫలితానికి చాంతాడంత తేడా. సమయ మెక్కువ, వచ్చే రాబడి తక్కువ. సేవ ఎక్కువ, గుర్తింపు తక్కువ. తెలంగాణలో ప్రయివేటు విద్యాసంస్థలు వెలిగి పోవడానికి ప్రధాన కారణం టీచర్స్ త్యాగ ఫలితమే అన్నది కనిపించని సత్యం. స్కూల్స్ ర్యాంకులకు, ప్రకటనలకు, అద్దాల మేడల పెరుగుదలకు, బ్రాంచ్ ల సంఖ్య ఎదుగుదలకు బేస్‌గా టీచరే నిలుస్తారు.

రాష్ట్రంలో దాదాపు 11వేలకు పైగా ప్రయివేటు పాఠశాలలున్నాయి. వీటిలో టీచర్స్ దాదాపు 3.50 లక్షల మంది ఉన్నారు. 35లక్షల మంది విద్యార్థులకు వీరు బోధన చేస్తున్నారు. ఇన్ని లక్షల మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రయివేటు అధ్యాపకులకు కాసింత గుర్తింపు, పట్టిక లేదు. అభద్రత నిత్యం వెంటాడుతూనే ఉంటుంది. ప్రయివేటు విద్యాసంస్థల్లోనే నేడు ఎక్కువగా విద్యార్థులు చేరుతున్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం కాకపోవడం, పాలకులు దానిపై నమ్మకాన్ని పెంచకపోవడంతో అనివార్యంగా ప్రయివేటు విద్యాసంస్థల్లోకే పంపాల్సిన పరిస్థితి తల్లిదండ్రులది. ఇంగ్లీష్ స్టడీ కావాలంటే ప్రయివేటుకేననే వాతావరణం సమాజంలో ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకుని ప్రయివేటు విద్యాసంస్థలు విరివిగా వెలుస్తున్నాయి. విద్యార్థుల అవసరాలను నేటి డిజిటల్ కాలంలో తామే తీర్చుతామని చెబుతూ, సరికొత్త హంగులతో బిల్డింగ్స్‌ను నిర్మించి విద్యార్థులను, తల్లిదండ్రుల్ని ఆకర్షిస్తున్నాయి. ఈ పెరుగు తున్న ప్రయివేటు పాఠశాలలకు అతి ప్రధాన ఆధారం టీచర్స్‌నే. వీరు లేనిదే ఎంత గొప్ప రంగుల బిల్డింగ్ అయినా ఉత్త డొల్లనే. మంచి టీచింగ్ వల్లనే స్కూల్స్‌కి పేరు వస్తుంది. యాజమా న్యాలున్నా లేకపోయినా అందులో ఎంప్లాయిస్ అన్ని పనులు చేస్తూ ఆ సంస్థలను నడుపుతున్నారు.అడ్మిషన్స్ ప్రాసెస్‌లో ఉపాధ్యాయులే కీలకం.



వీళ్ల ప్రచారం వల్లనే ఆ సంస్థలకు అడ్మిషన్స్. వచ్చిన అడ్మిషన్స్ అలాగే కొనసాగాలంటే మళ్లీ టీచర్స్ బాధ్యత తీసుకోవడం వల్లే అవి నిలబడుతాయి. ఎంత చేసినా యాజమాన్యం టీచర్‌కు ఇచ్చే విలువ ఏమి లేదు. తన పనికి, చేసిన కృషికి ఎక్కడా రికార్డ్ లేదు. గుర్తింపు అసలే లేదు.

ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు విద్యారంగానికి సేవచేస్తున్నా ప్రభుత్వం వీరి శ్రమను పట్టించుకోవడం లేదు. అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్ది ప్రతిభావంతులుగా తయారు చేస్తున్నా ఆ కృషికి గౌరవం లేదు. ఫలితం అంతకన్నా లేదు. ఇప్పుడు ఎంత కాదన్నా వద్దనుకున్న గానీ ప్రయివేటు విద్యాసంస్థలు వ్యాప్తి చెందాయి. విద్యారంగానికి ప్రయివేటు ఎంప్లాయిస్ కూడా తమ తోడ్పాటునందిస్తున్నారు. ప్రయివేటు టీచర్స్ బోధించిన విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇచ్చి అధికారిక గుర్తింపు ఇస్తుంటే, టీచింగ్ చెప్పిన టీచర్స్‌కి అధికారిక గుర్తింపు లేదు? వీరి శ్రమను గౌరవించాల్సిన అవసరం ఉంది. అంతేకాదు గుర్తింపు కూడా ఇవ్వాలి. రికార్డ్ కూడా ఉండాలి. అందరినీ రిజిస్ట్రే షన్ చేయడంతో పాటు ఒక వెల్ఫేర్ బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు ప్రభుత్వం చేయాలి. వారికి కూడా సాధారణ కార్మికులకు దక్కినట్లుగానే బెనిఫిట్స్ దక్కాలి. ప్రభుత్వ టీచర్లకు చెల్లిస్తున్న వేతనాల విధానం అమలు చేయాలి. చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఈరోజు రాష్ట్రంలో ఇంటర్ కాలేజీల్లో ప్రభుత్వంకంటే ప్రయివేటుదే డామినేషన్. ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యావ్యవస్థనే నడుపుతున్నాయి. ఆ కార్పొరేట్ కళాశాలల్లో వాటి ఎదుగుదలలో లెక్చరర్స్ వర్క్ అంతా ఇంతా కాదు. ఇంజనీరింగ్ కాలేజీల్లో కూడా అంతే. ప్రయివేటు కళాశాలలు మనీ కేంద్రాలు అయ్యాయంటే కింద ఎంతోమంది స్టాఫ్ వర్క్ అందులో దాగి ఉంటుంది. అలాగే మెడికల్ కాలేజీలు అయినా, ఏవైనా అంతే. కానీ లెక్చరర్స్ ఆర్తనాదాలు ఎవరూ పట్టించుకోవడం లేదు. యాజమాన్యాలు ఎట్లాగూ అలానే ఉంటాయి. కానీ ప్రభుత్వాలు ఎందుకు వీరి గురించి అర్థం చేసుకోవన్నదే ఇక్కడ ప్రధానంగా వీరిని వేధిస్తున్న సమస్య.

ప్రయివేటు టీచింగ్ ఎంప్లాయిస్ శ్రమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. వారికి కూడా ఇతర ప్రయివేటు సంస్థల్లో ఉన్నట్లే అన్నీ బెనిఫిట్స్ ఉండాలి. అందాలి. హక్కులు, సౌకర్యాలు కూడా ఉండాలి. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేసే వారిని కూడా కార్మికులు గానే గుర్తించాలి. హై స్కూల్స్‌లో పని చేసే టీచర్స్‌కి మినిమం పట్టణాల్లో రూ.35వేల వేతనమివ్వాలి. కార్మికులకు ఉన్న గుర్తింపు కార్డులు, బీమా, ఈ ఎస్ ఐ, పి ఎఫ్, ఇతర గ్రాట్యుటీ లు ఇవ్వాలి. ప్రధానంగా ప్రయివేటు విద్యాసంస్థల్లో టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్‌ని రిజిస్ట్రేషన్ చేయాలి. అప్పుడే ఇవన్నీ సాధ్యమవుతాయి. అలాగే నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఇదే పరిస్థితి ఉంది. వారికి కూడా అన్నీ సౌకర్యాలు అందాలి. అలాగే ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో చేరిన టీచింగ్ లేదా నాన్ టీచింగ్ అయినా బతుకలేక బడి పంతులు అన్నట్లే ఉంటది. దాదాపు అందరూ పేదోళ్లేఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే అందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్ల లాంటి పథకాల్లో వీరికి ప్రాధాన్యతనిస్తే వారి కుటుంబాలకు భరోసానిచ్చి నట్టవుతుంది. ఈ దిశగా పాలకులు ప్రయివేటు టీచర్స్, లెక్చరర్స్ జీవితాల్ని నిలబెట్టే విధంగా కృషి చేయాలి. దీనికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా విద్యావంతులు, మేధావులు ముందుకు రావాలి. వీరి సమస్యలను పరిష్కరించే విధంగా గొంతు కలపాలి. ■

యాసంగిలోనూ వరి వైపే

- ఫిబ్రవరి నాటికి మరింత పెరిగే అవకాశం
- జొన్న, మక్కలు మినహా తగ్గుతున్న ఆహార పంటలు
- వేరుశనగ సాధారణం
- రాగి, సజ్జ, కొర్ర నామ మాత్రమే
- గోధుమలు 35శాతం




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యాసంగి సీజన్‌లో వరి పంట సింహభాగం కానుంది. మొత్తం సాగు విస్తీర్ణంలో వరి సాగు ఇప్పటివరకు 36.21 లక్షల ఎకరాలకు చేరింది. గతేడాది ఇదే సమయానికి 30 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది ఆరు లక్షల ఎకరాల్లో ఎక్కువగా పంట సాగు చేశారు. ఫిబ్రవరి 20 నాటికి మరింత పెరిగే అవకాశం ఉన్నది. గతంతో పోల్చితే ఈ సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వానలు పడ్డాయి. దీంతో చెరువులు, కుంటల్లో నీరు చేరింది. భూగర్భ జలాలు కూడా అధికమయ్యాయి. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నది. దీంతో రైతులు అధికంగా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. గతేడాది వరి సాగు 75శాతం కాగా, ప్రస్తుతానికి 77 శాతమైంది. 85శాతానికి చేరే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ వరి సాగు పెరగడంతో ఇతర ఆహార పంటలు తగ్గుముఖం పడుతున్నాయి. మొక్కజొన్న పంట సాగు గతంతో పోల్చితే ఈసారి 78వేల ఎకరాలకు పెరిగింది. ఈ పంటకు కూడా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. ఆహార పంటల్లో ముఖ్యమైన జొన్నపంట పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో జొన్న వినియోగం కూడా బాగా పెరిగింది. క్వింటా ధర కూడా రూ. 6వేలు పలుకుతుంది. దీంతో వానాకాలంతోపాటు యాసంగి పంటగా సాగు చేస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులు జొన్న పంటను వేస్తున్నారు. రాగి, కొర్ర పంటల సాగు నామమాత్రంగా ఉంటున్నది. ముఖ్యంగా రాగి గతేడాది ఈ సమయానికి 137 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి కేవలం 73 ఎకరాల్లో మాత్రమే సాగైంది. కొర్ర పంట గత యాసంగిలో 259 ఎకరాల్లో సాగైంది. కానీ ఈ ఏడాది వంద ఎకరాల్లో మాత్రం రైతులు సాగు చేస్తున్నారు. సజ్జ పంట వానాకాలంలో వర్షాధార పంటగా ఎక్కువగా సాగు చేస్తారు. యాసంగి సీజన్‌లో సజ్జ పంట 62 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. జొన్న, మొక్కజొన్న, రాగి, కొర్ర, సజ్జ వంటి ఆహార పంటల కంటే నిత్యం వినియోగించే గోధుమ పంట కూడా రైతులు సాగు చేయడం లేదు. గత యాసంగిలో ఈ సమయానికి 6,785 ఎకరాల్లో సాగు చేస్తే...ఈసారి 4,130 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గోధుమ పంటకు అనుకూలమైన నేలలు ఉన్నప్పటికీ రైతులు అధికంగా వరి సాగుపైన్నే దృష్టిసారిస్తున్నారు. పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలు సాధారణంగానే ఉన్నవి. అయితే గతేడాదితో పోల్చితే ఈసారి వేరుశనగ పంట సాగు పెరిగింది. కానీ పొద్దుతిరుగుడు పంటసాగు తగ్గింది. కందులు, ఉలవలు, శనగ, పెసర పంటల సాగు కూడా ఆశాజనకంగా లేదు. మొత్తంగా వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ఆహార, నూనె గింజల సాగు విస్తీర్ణం తగ్గుతున్నది. పండ్లు, కూరగాయల సాగు పెరగడం లేదు. యాసంగి సీజన్ ఆహార పంటలకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే పండ్లు, కూరగాయలు, ఆహార పంటలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న విషయం తెలిసిందే. భవిష్యత్తులో మరింత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లగచర్ల రైతులపై మూడు కేసులా?

- ఆ కేసుల వివరాలు, వాంగ్మూలాలివ్వండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ-హైదరాబాద్

ఫార్మసిటీ భూసేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్ ఇతర అధికారులపై రైతులు దాడి చేశారనే కేసులో పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడంపై హైకోర్టు ఆరా తీసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడికి ప్రయత్నించారని రైతులపై ఎన్ని కేసులు పెడతారని పోలీసులను ప్రశ్నించింది. ఆ కేసులు, వాటిలో సేకరించిన వాంగ్మూలాల వివరాలను అందజేయాలని పోలీసులకు ఆదేశించింది. ఎఫ్ఐఆర్ 153, 154, 155 నమోదు చేయడాన్ని రైతులు సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ గురువారం విచారించారు. ఇప్పటికే బొమ్రాస్‌పేట పోలీసులు నమోదు చేసిన 154, 155 కేసుల్లో రైతులను అరెస్ట్ చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రైతులు పవార్‌నాయక్ మరికొందరు, మందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ మరో 17 మంది వేర్వేరుగా వేసిన కేసుల్లో కూడా అరెస్టు చేయరాదని ఆదేశించారు. విచారణను ఫిబ్రవరి 28కి విచారణను వాయిదా వేశారు.

బీఆర్ఎస్ భూమిపై కౌంటర్ వేయండి

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలో బీఆర్ఎస్‌కు 11 ఎకరాలభూమిని రూ.37 కోట్లకే కేటాయించటాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను గురువారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం కౌంటర్ వేయాలని ఆదేశించింది విచారణను మార్చి 6కి వాయిదా వేసింది. కోకాపేటలో సర్వే నెం.239, 240లో బీఆర్ఎస్‌కి 11 ఎకరాల భూమిని కేటాయింపు వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వచ్చిందంటూ రెండు పిల్‌లు దాఖలయ్యాయి. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఎ.వెంకటరామిరెడ్డి వేసిన పిల్‌లను చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిలతో కూడిన బెంచ్ గురువారం విచారించింది. ఎకరం ధర రూ.50 కోట్లకుపైగా ఉండనీ, ప్రభుత్వం 3.4 కోట్లకే ఇచ్చిందని వారు ఆ పిల్‌లో పేర్కొన్నారు. కౌంటరు దాఖలు చేయడానికి 4 వారాల గడువు కావాలని ప్రభుత్వం కోరింది. జిల్లాల్లో టీఆర్ఎస్ ఆఫీసుల నిమిత్తం 2004లో వెలువడిన జీవో 966ను కొట్టేయాలంటూ మాజీ ఎమ్మెల్సీ శ్రీరాములునాయక్ వేసిన పిల్‌ను కూడా హైకోర్టు విచారించింది. టీఆర్ఎస్‌కు ఇచ్చిన భూమిలో టీన్యూస్ ఛానల్ నడుస్తోందన్నారు. ఈ పిల్‌లో కూడా ప్రభుత్వం కౌంటర్ వేయాలని ఆదేశించింది.

వీసీగా చక్రపాణి నియామకంపై పిటిషన్

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా డాక్టర్ చక్రపాణి నియామకాన్ని సవాల్ చేసిన కేసులో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌లతోపాటు వీసీ చక్రపాణిలను హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీసీ నియామక జీవో 229ను అసోసియేట్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కుమారస్వామి సవాల్ చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. విచారణను వచ్చే నెలకు వాయిదా వేశారు

ఓఆర్ఎస్ అమ్మకాలపై పిల్

ఓఆర్ఎస్ అమ్మకాలపై దాఖలైన పిల్‌ను గురువారం హైకోర్టు విచారించింది. ఫిబ్రవరి 28లోగా కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జాన్సన్ అండ్ జాన్సన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్, అమృతాంజన్ హెల్త్‌కేర్ లిమిటెడ్, స్టేఫిట్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ వరల్డ్ ప్రయివేట్ లిమిటెడ్‌లను ఆదేశించింది. విచారణను మార్చి 6కి వాయిదా వేసింది. కేంద్ర ఆహార భద్రతా మండలి గైడ్‌లైన్స్ అమలు కావడం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎం.శివరంజని వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిలతో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది.

రోడ్ల గుంతలపై యాప్ రూపొందించండి

రోడ్లపై గుంతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ప్రజలు తెచ్చేందుకు వీలుగా ఒక యాప్‌ను 4 వారాల్లోగా రూపొందించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆర్అండ్‌బీలో ఉన్నట్టుగా 'టీ-రస్తా' అనే యాప్ ఉన్నట్టుగానే ఇతర రోడ్ల విషయంలోనూ యాప్ ఉండాలంది. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలను ఆదేశించింది.లాయర్ అఖిల్ శ్రీగురుతేజ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిలతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

జెఎన్టీయూహెచ్‌లో పాస్ చేస్తామని డబ్బులు వసూలు

- నిందితులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్‌లో ఇంజినీరింగ్, ఇతర కోర్సుల్లో ఫెయిలైన విద్యార్థులు లక్ష రూపాయలు ఇస్తే పాస్ చేస్తామని డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విచారణ కమిటీ వేయాలని కోరింది. గురువారం ఈసీఐఎల్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ విలేకరులతో మాట్లాడారు. కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్‌లో ఫెయిలైన విద్యార్థులను పాస్ చేయించే విధంగా లక్షల్లో వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. జేఎన్టీయూహెచ్ క్యాంపస్‌ను దెబ్బతీయడం కోసమే ఈ విధంగా పని చేశారేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎందరో విద్యార్థులను టెక్నికల్‌గా తయారు చేసిన గొప్ప యూనివర్సిటీ అని, అలాంటి యూనివర్సిటీలో విద్యార్థుల ను పక్కదోవ పట్టించడం ఆందోళనకరమన్నారు. ఎంతమంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఎన్ని లక్షలు వసూలు చేశారనే దానిపై ప్రభుత్వం విచారణ కమిటీ వేయాలని కోరారు. అలాగే, ఏ కళాశాల విద్యార్థులు ఫెయిల్ అయితే వారి దగ్గర్నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారో ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమాలను బట్టబయలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ కాప్రా మండల ఉపాధ్యక్షులు నిఖిల్, మనీష్, ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కమిటీ నాయకులు ప్రశాంత్, కిషోర్ తదితరులు ఉన్నారు.

కొడుకు ఇంటి పన్నుకు..తల్లిదండ్రుల పింఛన్ ఆపుతారా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్

మంచిర్యాల జిల్లాలో వద్ధాప్య పింఛన్ డబ్బులను కొడుకు ఇంటి పన్నుకు జమ చేయడం పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయని తప్పుపట్టారు. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వద్ధుల బతుకు బండి నడిచేది ఎలా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ.2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఒకవైపు లబ్దిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయమని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం, నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యాదవులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలి



- సదర్‌ను రాష్ట్రపండుగగా గుర్తించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు
- అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ అధ్యక్షులు రవీంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడంలో యాదవుల పాత్ర కీలకమనీ, వారికి మంత్రి, ఎమ్మెల్సీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ అధ్యక్షులు రవీంద్రనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల జైపూర్‌లో జరిగిన అఖిల భారత యాదవ మహాసభలో ఆయన రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సీట్లిచ్చే విషయంలో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. తనకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ అధ్యక్షులు స్వపన్ కుమార్ ఘోష్, కార్యనిర్వహక అధ్యక్షులు, మాజీ ఎంపీ శ్యామ్ సింగ్ యాదవ్, జాతీయ కార్యనిర్వహక అధ్యక్షులు ఎస్ సోం ప్రకాష్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షులు సత్య ప్రకాష్ సింగ్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ భారత ఇన్‌చార్జి లక్ష్మణ్ యాదవ్, నియామక పత్రాన్ని విడుదల చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి బల్బీర్ సింగ్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి చింతల లక్ష్మణ్‌యాదవ్ సేవలను స్పూర్తిగా తీసుకుని పనిచేస్తానని చెప్పారు. దశాబ్ద కాలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తోపాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన జాతీయ సంరక్షకులు బద్దుల బాబురావు యాదవ్ వంటి అనుభవజ్ఞులతో పనిచేయడం ఎంతో ఉత్సాహాన్ని నింపిందని గుర్తుచేశారు. త్వరలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నూతన కమిటీలు వేస్తామని తెలిపారు.

బీజేపీకి రాజీనామా చేస్తా : కర్నాటక నేత శ్రీరాములు హెచ్చరిక

బెంగళూరు : కర్నాటకలో బీజేపీకి కొత్త తలనెప్పి వచ్చి పడింది. సందూర్ శాసనసభ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి ఓటమికి తానే కారణమంటూ కొందరు నిందించడాన్ని బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బి.శ్రీరాములు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీకి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి ఓటమికి శ్రీరాములే కారణమని బీజేపీ ప్రధాన కార్యదర్శి, కర్నాటక వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రాధా మోహన్ దాస్ రెండు రోజుల క్రితం జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ఆరోపించారు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీరాములు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారు. 'చివరి రోజు వరకూ పార్టీ కోసమే ప్రచారం చేశాను. అలాంటప్పుడు మీరు ఆ మాట ఎలా అంటారని ఆయన్ని ప్రశ్నించాను. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు నాకు మద్దతు ఇచ్చి ఉండాల్సిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు కూడా చెప్పాను. ఆయన అలా చేయక పోవడంతో బాధ పడుతున్నాను' అని శ్రీరాములు చెప్పారు. తన వల్ల పార్టీకి ఇబ్బందులు ఎదురైతే రాజీనామా చేసేందుకు సిద్ధ మేనని వారికి తెలిపానని అన్నారు. మైనింగ్ వ్యాపారి రెడ్డి బళ్లారిలో అడుగు పెట్టిన తర్వాత తన వంటి నాయకులను అంతం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆయన బళ్లారిలో సొంత గ్రూపును ఏర్పాటు చేసుకున్నారని, తమను రాజకీయంగా అంతమొందించేందుకు ప్రయత్ని స్తున్నారని శ్రీరాములు మండిపడ్డారు.

స్కిల్ యూనివర్సిటీలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ చమన్‌మెహతా ఒక ప్రకటనలో తెలిపారు. ఎండోస్కోపీ టెక్నీషియన్ (6నెలలు), ఈక్విప్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (4నెలలు), సప్లై చైన్ ఎస్సెన్షియల్స్ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్(2.5నెలలు), కోడింగ్ స్పెషలిస్ట్(2నెలలు), కోర్సుల్లో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్లో దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు. కోర్సులకు సంబంధించిన సమగ్ర సమాచారం యూనివర్సిటీ అధికారులను సంప్రదిం చాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయిని తెలిపారు.

లగచర్ల బాధితుల పక్షాన సీపీఐ(ఎం)

ఫార్మా విలేజ్‌పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం
గుడిసెల పోరాటంలోనూ విరోచిత పోరాటం
భూ కబ్జాదారుల నుంచి పేదల భూములు కాపాడటంలో కీలక భూమిక
పారిశ్రామిక దిగ్గజాల మెడలొంచిన ఎర్రజెండా

వాస్తవాలతో ప్రభుత్వానికి నివేదిక



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా సమస్యలపై పోరాటమే ప్రధాన ఎజెండాగా సీపీఐ(ఎం) పోరాటాలు నిర్వహిస్తూ.. ప్రజలకు అండగా నిలుస్తోంది. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరు నడుపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన లగచర్ల ఫార్మా విలేజ్ విషయంలో బాధితులకు న్యాయం జరగడంలో సీపీఐ(ఎం) కీలక భూమిక పోషించింది. గుడిసెల పోరాటంలోనూ విరోచిత పోరాటాలు నిర్వహించింది. జిల్లాలో ప్రపంచ స్థాయి పారిశ్రామిక దిగ్గజాలను సైతం మెడలొంచి, కార్మికులకు అండగా నిలిచిన చరిత్ర ఎర్రజెండాకు ఉంది. కేసులు, అరెస్టులు, జైలు, నిర్బంధాలు విధించినా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ముందు వరుసలో ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనేక విషయాలపై ఉద్యమాలు చేపట్టి.. విజయాలు సాధించిన ఘనత సీపీఐ(ఎం)కే దక్కింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పార్టీ నిర్వహించిన ఉద్యమాలు.. సాధించిన విజయాలపై కథనం.

జిల్లాలో ఓట్లు.. సీట్లు లేకపోయినా ప్రజల పక్షాన పోరాడే శక్తి ఉందని సీపీఐ(ఎం) నిరూపించింది. ఇటీవల వికారాబాద్ జిల్లా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలోని దుద్యాల మండల పరిధిలో లగచర్ల ఉదంతమే ఇందుకు ఉదాహరణ. లగచర్ల, హకీంపేట్ రెవెన్యూ పరిధిలో సుమారు 3వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీ పెట్టేందుకు ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది. దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు భూ సేకరణకు వచ్చిన ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల నుంచి ఈ భూములను ఎలాగైనా తీసుకోవాలని ప్రభుత్వం గట్టి ప్రయత్నమే చేసింది. అక్కడికి ఏ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు నాయకులు పోయినా ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసింది. కానీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో ఓ బృందం లగచర్ల వెళ్లే క్రమంలో "తమను అడ్డుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.. దాంతో ప్రభుత్వం సీపీఐ(ఎం) పర్యటనను అడ్డుకోకుండా.. అప్పటి వరకు అరెస్టు చేసిన పార్టీ నాయకులను సైతం విడుదల చేసింది. లగచర్లలో పర్యటించిన పార్టీ బృందం వాస్తవ పరిస్థితులను తెలుసుకుని.. అనంతరం ఓ నివేదకను తయారుచేసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించారు. దాంతో ఫార్మా కంపెనీ విషయంపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా ఈ ప్రాంతంలో సుమారు 5 వేల మంది ప్రజలకు న్యాయం జరిగింది.

పారిశ్రామిక దిగ్గజాలకు వణుకు

రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఇక్కడ కార్మిక రంగంలో అంతే స్థాయిలో సమస్యలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్థానికుల కంటే అంతర్రాష్ట్ర కార్మికులు ఎక్కువగా పని చేస్తుంటారు. వీరిని ఆసరాగా చేసుకుని పారిశ్రామిక వేత్తలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. తమకు అవసరం ఉన్నప్పుడు ఉపాధి కల్పించడం.. లేదంటే ఉద్యోగం నుంచి తొలగించడం చేస్తుంటారు. ఇలాంటి సమస్యలపై ఈ ప్రాంతంలో చేసిన ఉద్యమాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వం పాల్గొంది. పారిశ్రామిక వేత్తలు దిగొచ్చేలా ఉద్యమాలు నిర్వహించింది. ఆదిభట్లలోని 'టాటా ఏరోస్పేస్' దిగ్గజాలను సైతం మెడలొంచి ఆ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల అక్రమ తొలగింపును అడ్డుకుంది. కార్మికుల ఐక్యత కోసం సంఘం పెట్టుకునే అవకాశం లేదని యాజమాన్యం కార్మికులపై ఒత్తిడి పెంచినప్పటికీ.. యాజమాన్యంతో మాట్లాడి సంఘం పెట్టి తీరుతామని కార్మికులకు సీపీఐ(ఎం) అండగా నిలిచింది.

భూ కబ్జాదారుల చెర నుంచి పేదల భూములకు రక్షణ

రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ ప్రాంతంలో పేదలకు సంబంధించిన సుమారు 200 ఎకరాల భూములపై బడా వ్యాపారవేత్తలు కన్నేశారు. ఆ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పించాలని సీపీఐ(ఎం) పోరాటాలు చేసింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ భూములను కాపాడింది. కొండకల్ ప్రాంతంలో గిరిజన భూములకు సంబంధించి బడా వ్యాపారులు చేస్తున్న వ్యవహారాలపై ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు విచారణ జరిపి పేదలకు న్యాయం చేశారు. ఆ భూములను కాపాడి గిరిజన ప్రజలకు అండగా నిలబడి, వాటి పోరాటాలకు ఊతం ఇచ్చింది. ఇలా జిల్లాలో అనేక ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) ఉద్యమాలు చేపట్టి.. ప్రజా సమస్యలను వెలికి తీసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషి చేసింది.

పేదల పోరులో ఎర్రజెండా

ఎన్నో ఏండ్లుగా ఇంటి జాగాలకు నోచుకోని పేద ప్రజలకు ఇండ్ల జాగాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించింది. పేదలకు కేటాయించిన ఇండ్ల జాగాల్లో పాగా వేసిన 'రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం'ను అక్కడి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేసింది. రామోజీపై చేసిన పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయంశంగా మారింది. దాంతో దిగొచ్చిన ఫిల్మ్‌సిటీ యాజమాన్యం ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. పేదలకు సంబంధించిన భూములు తమ పరిధిలో ఉంటే ఆ భూములకు బదులు వేరే చోట ఇస్తామని రాయభారం నడిపింది. ఇక అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో పేదలు వేసిన గుడిసెల తొలగింపు విషయంలో సీపీఐ(ఎం) పోరాటం చేసింది. ఈ పోరాటంలో పాల్గొన్న రాష్ట్ర నాయకత్వాన్ని పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్లలో నిర్బంధించారు.

చిత్తశుద్ధి ఉంటే పాతబస్తీ నుంచి

కూల్చివేతలు మొదలు పెట్టండి

ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కూల్చివేతలను పాతబస్తీ నుంచి ప్రారంభించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్ ఆదర్శనగర్ ఎమ్మెల్యే కాలనీలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. అధికారులకు స్వేచ్ఛను ఇస్తే ఆ ప్రభుత్వాలకు మనుగడ ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు రాజకీయం ఇచ్చింది హైదరాబాద్.. కాబట్టి నగరంలో ఎక్కడ ప్రజలకు ఇబ్బంది వచ్చినా దానం ముందుంటాడని అన్నారు. గతంలో తాను హైడ్రా విషయంలో మాట్లాడినా.. ఇప్పుడు ఫుట్‌పాత్‌ల విషయంలో మాట్లాడుతున్నానంటే అది ప్రభుత్వానికి చెడ్డపేరు రావొద్దనేనన్నారు. మాదాపూర్‌లో ఫుట్‌పాత్‌లపై కుమారి ఆంటీ స్టాల్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి అదే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అధి కారులు చేసే పనుల వల్ల ప్రజల మధ్య తాము తిరగలేకపోతున్నామని చెప్పారు.



ఓల్డ్ సిటీలో అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా.. అక్కడి నుంచే తొలగింపులు ప్రారంభించాలన్నారు. తన దగ్గరకు రోజూ పేదలు వచ్చి కూల్చివేతలపై ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. పేదల శాపనార్థాలు ప్రభుత్వానికి మంచివి కావన్నారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ వరుసగా ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. ప్రజల పక్షాన ఆయన మాట్లా డడం సరైనదేనని కొందరు మద్దతు తెలుపుతుండగా.. ప్రభుత్వంపై ఇలా విమర్శలు చేయడం తగదని కొందరు అంటున్నారు. ఇప్పటికైనా కార్యక్రమానికి సంబంధం లేని అనవసరమైన విషయాలు మాట్లాడకుంటే బాగుంటుందని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

అక్రమ వలసదారుల బిల్లుకు సెనెట్ ఆమోదం

శరణార్థి శిబిరాలు ఏర్పాటు చేస్తున్న మెక్సికో
ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడిన పనామా

వాషింగ్టన్ : దేశం నుండి అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా ప్రతినిధి సభ ఆమోదం తెలిపింది. దొంగతనాలు, తీవ్రమైన నేరాలకు పాల్పడే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. సుమారు 30 సంవత్సరాల తర్వాత అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన అతి ముఖ్యమైన ఇమ్మిగ్రేషన్ అమలు బిల్లు ఇదేనని అలబామాకు చెందిన రిపబ్లికన్ సెనెటర్ కేటీ బ్రిట్ చెప్పారు. అయితే ఈ బిల్లు అమలుకు నిధుల కొరత ఉన్నదని ఫెడరల్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో బిల్లు అమలుకు అడ్డంకులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో మెక్సికో అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో శరణార్థి శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. మరోవైపు అమెరికాలో అక్రమ వలసదారుల నిర్బంధం ప్రారంభమైంది. దక్షిణ సరిహద్దులో నిఘా పెంచారు. ఇదిలావుండగా డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలపై పనామా మండిపడుతోంది. పనామా కాలువ తనదేనంటూ ట్రంప్ చేస్తున్న వాదనను అధ్యక్షుడు రోస్ రౌల్ ములినో తిప్పికొట్టారు. అసలు ఆ కాలువ తమకు బహుమతిగానో, రాయితీగానో వచ్చింది కాదని స్పష్టం చేశారు.

హెచ్1బీ వీసా ప్రోగ్రాంను ఆపను




మాకు నిపుణులు అవసరమే
అన్ని స్థాయిల వ్యక్తులనూ రానిస్తాం : ట్రంప్

వాషింగ్టన్ డీసీ : హెచ్1బీ వీసా కార్యక్రమానికి అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో ఆయన ఈ కార్యక్రమానికి మద్దతు తెలపడం ఇది రెండోసారి. అమెరికాకు ఎంతో సమర్థులైన గొప్ప వ్యక్తుల అవసరం ఉన్నదని, ఈ కార్యక్రమం ద్వారా అది సాధ్యపడుతుందని ట్రంప్ చెప్పారు. ఒరాకిల్ సీటీఓ లారీ ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషీ సన్, ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌తో కలిసి ట్రంప్ బుధవారం శ్వేతసౌధంలో సంయుక్తంగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. హెచ్1బీ వీసాలపై రిపబ్లికన్ పార్టీలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలపై స్పందిస్తూ 'నేను ఇరు పక్షాల వాదనలను ఇష్టపడుతున్నాను. మా దేశంలోకి అత్యంత సమర్థులైన వ్యక్తులు రావడాన్ని కూడా నేను ఇష్టపడతాను. మా దేశంలో నైపుణ్యం లేని వారికి శిక్షణ ఇచ్చి సాయం చేసేందుకు వచ్చే వారైనా సరే...ఇష్టపడతాను. నేను వారిని ఆపాలని అనుకోవడం లేదు. నేను కేవలం ఇంజినీర్లను గురించి మాత్రమే మాట్లాడడం లేదు. అన్ని స్థాయిలలోని వ్యక్తులను గురించి మాట్లాడుతున్నాను' అని ట్రంప్ అన్నారు. సమర్థులైన, నిపుణత కలిగిన వారు అమెరికా రావాలని తాము కోరుకుంటున్నామని ట్రంప్ చెప్పారు. 'హెచ్-1బీ...ఈ కార్యక్రమం గురించి నాకు బాగా తెలుసు. నేను దీనిని ఉపయోగిస్తాను. మైత్రీ డీ, వైన్ నిపుణులు, వెయిటర్లు, నిపుణులైన వెయిటర్లు...ఇలాంటి వారందరి అవసరం ఉంది. లారీ లాంటి వ్యక్తులకు ఇంజినీర్లు అవసరం. మాసాకు కూడా వారి అవసరం ఉంది. ఎవరికీ అవసరం లేని విధంగా వారికి ఇంజినీర్ల అవసరం ఉంది' అని తెలిపారు. అమెరికాకు నిపుణుల అవసరం ఎంతో ఉన్నదని, వారి ద్వారా వ్యాపారాలను విస్తరించుకుంటున్నామని, ప్రతి ఒక్కరినీ జాగ్రత్తగా చూసుకుంటామని అన్నారు. అందుకే ఇరు పక్షాల వాదనలనూ గౌరవిస్తున్నానని చెప్పారు. అయితే తమకు నిజమైన సమర్థత కలిగిన గొప్ప వ్యక్తులు కావాలని, వారిని దేశంలో ప్రవేశించేందుకు అనుమతించాలని తెలిపారు. హెచ్1బీ వీసా కార్యక్రమం ద్వారా అలాంటి వ్యక్తులను దేశంలోకి అనుమతిస్తామని ట్రంప్ అన్నారు. గత నెల చివరి వారంలో కూడా ట్రంప్ హెచ్1బీ వీసా ప్రోగ్రాంకు మద్దతు తెలిపారు.

మీ వాదనలకు ముగింపు ఉండదా ?

2020 అల్లర్ల కేసులో ప్రాసిక్యూషన్‌పై ఢిల్లీ హైకోర్ట్ ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : 2020 అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, మరో ఆరుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ ప్రాసిక్యూషన్ అదే పనిగా సుదీర్ఘ వాదనలు విన్పించడాన్ని ఢిల్లీ హైకోర్టు తప్పు పట్టింది. ముగింపు లేని వాదనలను తాను వినబోనని తేల్చి చెప్పింది. ఇమామ్ చేసినట్లుగా చెబుతున్న ప్రసంగాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ చదవడం ప్రారంభించగానే జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ షలీందర్ కౌర్‌తో కూడిన బెంచ్ అడ్డు తగిలింది. 'మీ సుదీర్ఘ వాదనలు ఇంకా ఎంత కాలం కొనసాగుతాయి?' అని ప్రశ్నించింది. 'మీ వాదనలను ఆపేయండి. అవి ఇప్పుడే ఆగిపోవాల్సిన అవసరం ఉంది. ముగింపు అనేది లేకుండా అవి కొనసాగకూడదు. మేము మీకు ఎక్కువ సమయం ఇవ్వలేము' అని హైకోర్ట్ బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కూడా ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. 'మీరు ఇప్పుడే వాదనలు ముగించాలి. అవి ముగింపు లేకుండా కొనసాగకూడదు' అని జస్టిస్ చావ్లా సూచించారు. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేశారు. నాలుగు సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడుపుతున్న ఖలీద్, ఇమామ్, మహమ్మద్ సలీం ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, షాదాబ్ అహ్మద్, అథర్ ఖాన్, ఖలీద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని సమర్థించే వారికి, వ్యతిరేకించే వారికి మధ్య 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో ఘర్షణలు చెలరేగాయి. దీనికి సంబంధించి నిందితులపై పలు చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఢిల్లీ అల్లర్లలో 53 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు.

అబద్ధాల 'అంబుజా' మాకొద్దు

డ్రైపోర్టు పేరుతో భూముల కొనుగోలు | మార్చిలో సిమెంట్ కంపెనీ నిర్మాణానికి అడుగులు

ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న రైతులు
స్థానికులకు అండగా ఎర్రజెండా
అఖిలపక్షం, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం
సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించాలి : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్





నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

డ్రైపోర్టు పేరుతో ప్రజలను నమ్మించి భూములు కొనుగోలు చేసిన అదానీ టీమ్.. రెండేండ్ల తర్వాత బాంబు పేల్చింది. డ్రైపోర్టు కాదు.. కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీ పెడతా మంటూ అడుగులు వేస్తోంది. మాయమాటలు చెప్పి మా భూములు తీసుకున్న అబద్ధాల అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దు.. మా భూముల్లో కాలు ష్యం వెదజల్లే పరిశ్రమను పెట్టొద్దు.. అంటూ రామన్నపేట మండల వాసులు ముక్తకంఠంతో వ్యతిరే కిస్తున్నారు. మరోవైపు బీడు భూములకు సాగునీరివ్వడానికి ఏర్పాట్లు చేయని ప్రభుత్వం.. ఫ్యాక్టరీ కోసం మాత్రం చెరువులు, కాలువల ద్వారా నీరిచ్చేందుకు అనుమతులు ఇస్తోంది. ఈ క్రమంలో ప్రాణాలైనా ఇస్తాం కానీ.. ఫ్యాక్టరీ వద్దు అని రైతులు పోరుబాట పట్టారు. వారికి సీపీఐ(ఎం) అండగా నిలిచింది. ప్రతిపాదిత స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించాలని డిమాండ్ చేస్తోంది.యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో రెండేండ్ల కింద అదానీ గ్రూప్ వారు డ్రైపోర్టు కంపెనీ పేరుతో 2600పైగా ఎకరాల భూమి కావాలని ప్రజలను నమ్మ బలికారు. ప్రజలకు, పంట పొలాలకు ఎలాంటి నష్టం.. కాలుష్యం ప్రమాదం లేదని డ్రైపోర్టు కంపెనీ వస్తే.. స్థానిక యువతకు ఉద్యో గావ కాశాలు వస్తాయ నినమ్మారు.అలా, కొమ్మాయి గూడెం, రామన్న పేట, సిరిపురం గ్రామ రైతులు సుమారు 360 ఎకరాలు అమ్మారు. కానీ ఇక్కడేమీ కంపెనీ పెట్టలేదు. రెండేండ్ల తర్వాత ఇప్పుడు డ్రైపోర్టు కంపెనీ కాదు.. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెడతామంటూ ముందు కొచ్చారు. తమను మోసం చేసి భూములు కొనడమే కాకుండా.. కాలుష్యం వెదజల్లే ఫ్యాక్టరీ నిర్మించతలపెట్టడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణం తలపెట్టిన భూముల్లో నిత్యం ప్రజలు, గొర్రెలు, మేకలు, పశువులు, రైతులు, గీత వృత్తిదారులు, వివిధ రకాల వృత్తులు చేసుకునే వారే అక్కడ ఉంటారు. కొమ్మాయిగూడెం, రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, బోగారం, నీర్నెముల, నిదాన్‌పల్లి, తుమ్మలగూడెం, జనంపల్లి, ఇస్కిల్ల, పెద్దకాపర్తి గ్రామాలు ఆ ప్రాంతానికి చాలా దగ్గరలో ఉన్నందున దుమ్ము, ధూళి, పొగ, కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడతారు. మండలంలో 0ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి, కాళేశ్వరం, మూసీ కాల్వలున్నా సుమారు 10 గ్రామాలకు సాగునీరు అందక నేటికీ బీడుగానే ఉన్నాయి. సాగు నీరు లేక రైతులు అల్లాడుతుంటే అధికారులు ఎన్నడూ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అవసరాల కోసం 12 గ్రామాల చెరువులు, మూసీ ద్వారా నీళ్ల అందించడానికి ఆగమేఘాలపై అనుమతులు ఇస్తున్నారు. దీనిపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు.

సిమెంట్ కంపెనీతో ఇబ్బందులు ఇలా..

అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పడితే చుట్టుపక్కల ఉన్న 30 వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అదే విధంగా, గీత కార్మికులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు నష్టపోతారు. సారవంతమైన భూములు సారం కోల్పోయి పంటలు పండక, దిగుబడులు రాక రైతులు, వివిధ వృత్తిదారులు సైతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సిమెంట్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలతో శ్వాసకోశ, ఊపిరితిత్తులు, చర్మరోగాలు, గర్భస్రావం, పిల్లల ఎదుగుదల లోపం, అంగవైకల్యం, కంటి చూప మందగించడం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

రైతులకు అండగా ఎర్రజెండా

గతేడాది అక్టోబర్ 23న ప్రజాభిప్రాయ సేకరణ ముందే సీపీఐ(ఎం) సిమెంట్ కంపెనీ నిర్మాణం తలపెట్టిన స్థలం వద్ద ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టింది. పోరుబాటలో ముందుభాగాన నిలిచి.. అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఏర్పాటు చేసి మండల వ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు, నిరసనలు తెలిపింది. అక్టోబర్ 15న పర్యావరణ సైంటిస్టులను, మేధావులను పిలిపించి మెగా సదస్సు నిర్వహించింది. అంతేకాకుండా అక్టోబర్ 23న ప్రజాభిప్రాయ సేకరణకు సుమారు 10 వేల మందిని సమీకరించి ముక్తకంఠంతో వ్యతిరేకించింది. ఆ తర్వాత ప్రభుత్వం కానీ, అధికారులు కానీ ఎలాంటి నిర్ణయమూ ప్రకటించలేదు. వెంటనే అంబుజా సిమెంట్ కంపెనీని రద్దు చేస్తున్నామని ప్రకటించి, ప్రజలకు ఉపయోగపడే డ్రైపోర్టు కంపెనీ ఏర్పాటు చేసి స్థాని కులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి 3వ జిల్లా మహాసభలో తీర్మానం చేశారు. ఆ తర్వాత అంబుజా ప్రతిపాదిత స్థలాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వందలాది ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లి పరిశీలించారు.

విధ్వంసకర సిమెంట్ ఫ్యాక్టరీని జనా వాసాల మధ్య పెట్టొద్దని, వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించాలి



అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించాలి. జనావాసాల మధ్య సిమెంట్ ఇండస్ట్రీ పెట్టొచ్చా..? ప్రతిపాదిత స్థలానికి 500 మీటర్ల దూరంలో కాలనీలు ఉన్నాయి. రామన్నపేట గ్రామం ఉంది. పరిశ్రమ ప్రతిపాదిత స్థలానికి అర కిలోమీటర్ దూరంలో కొమ్మాయిగూడెం గ్రామంలో 2000 మంది జీవనం సాగిస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో సిరిపురం, బోగారం గ్రామాల్లో 7000 మంది నివాసం ఉంటున్నారు. పరిశ్రమ వల్ల పశుపక్ష్యాదులు, ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుంది. చేపల పరిశ్రమ, పంటలు దెబ్బతింటాయి. చెరువులు, ధర్మారెడ్డి కాలువ, బావుల్లో నీరు పూర్తిస్థాయిలో కలుషితమై ధ్వంసమవుతాయి.

- ఎండి జహంగీర్, సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాల్సిందే..



రామన్నపేట ప్రజానీకానికి, పర్యావరణానికి హాని కలిగించే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేసుకోవాల్సిందేనని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోంది. సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రతిపాదిత స్థలంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వందకు వంద శాతం రాజకీయ పక్షాలు, ప్రజలు గోబ్యాక్ అంబుజా అనే వాణిని వినిపించారు. సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, బహుజన పార్టీలు వ్యతిరేకించాయి. అదానీ అంబుజా మోసపూరిత కుట్రలకు వ్యతిరేకంగా.. ఈ ప్రాంత ప్రజలకు అండగా ఎర్రజెండా నిలుస్తుంది. ప్రభుత్వం వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేస్తూ ప్రకటన చేసి డ్రైపోర్టు ఏర్పాటు కోసం సన్నాహాలు చేయాలి.

- జల్లెల్ల పెంటయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు..

గ్రామీణాభివృద్ధికి రూ.2773 కోట్లు మంజూరు

- పీఎం జన్‌మన్ రాష్ట్ర వాటా రూ.66 కోట్లు విడుదల
- క్షేత్రస్థాయిలో పర్యటించే పంచాయతీరాజ్ ఇంజినీర్లకు వాహన సౌకర్యం : ఆర్థిక మంత్రి భట్టిని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క

అందులో సీఆర్ఆర్ రోడ్లకు రూ.1419 కోట్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర సర్కారు పెద్దపీట వేస్తున్నది. గతంలో రూ.2682.95 కోట్లను మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గురువారం మరో రూ.2773 కోట్లను మంజూరు చేసింది. అదే సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటించే పంచాయతీరాజ్ ఇంజినీర్లకు వాహన సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. అందుకుగానూ ఒక్కో వాహనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 వేలు చెల్లించనున్నది. గ్రామీణాభివృద్ధికి రూ.2773 కోట్లను కేటాయించినందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) స్వయంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తాజాగా విడుదల చేసిన నిధుల్లో సీఆర్ఆర్ రోడ్ల కోసం రూ. 1419 కోట్లు వెచ్చించనున్నారు. ఎంఆర్ఆర్ నిధులకు రూ.1288 కోట్లు ఇవ్వనున్నారు. పీఎం జన్‌మన్ పథకం కింద రాష్ట్ర వాటాగా రూ.66 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులతో 25 ఆదివాసీ గూడాల్లో బీటీ రోడ్లను వేయనున్నది. తాజాగా మంజూరు చేసిన నిధులతో పల్లెల్లో మౌళిక సదుపాయాలు, బీటీ రోడ్లు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణం, తండాలు, గూడేల్లో బీటీ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు : మంత్రి సీతక్క

గ్రామీణాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను గురువారం ప్రజా భవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) పూలమొక్క అందజేసి ధన్యవాదాలు చెప్పారు. పల్లెల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మొదటి విడతలో రూ. 2682 కోట్లు, తాజాగా రూ.2773 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద కూడా రూ.197 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రాబోయే కాలంలో పల్లెల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయి పంచాయతీ రాజ్ రూరల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఎస్ ఈ లకు వాహనాల సమకూర్చుతున్నామని ప్రకటించారు. 237 మంది ఇంజినీరింగ్ అధికారులకు రూ. 5 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఒక్కో వాహన అద్దె చెల్లింపున కోసం నెలకు రూ.33 వేలు చెల్లిస్తామని తెలిపారు. మారు మూల ప్రాంతాల్లో జరిగే పనుల పర్యవేక్షణకు వెళ్లేందుకు ఇంజినీర్లు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వాహన సదుపాయం కల్పించిన ప్రభుత్వానికి రుణ పడి ఉంటామని పంచాయతీ రాజ్ విభాగ ఈఎన్సీ కనకరత్నం చెప్పారు. గతంలో వాహన అలవెన్స్ లేకపోవడంతో ఇంజినీర్లు అవస్థలు పడ్డారన్నారు. వాహన కష్టాలు తీర్చిన ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నేడు గ్రీవెన్స్‌డే (బాక్సు ఐటమ్)

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నూతన విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతున్నది. ఉద్యోగుల సమయం వృథా, ప్రయాణ భారం లేకుండా సర్వీసు, ఇతర సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 10 గంటలకు సచివాలయం కేంద్రంగా ఆన్‌లైన్ గ్రీవెన్స్‌డేను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రారంభించనున్నారు. ఆ కార్యక్రమంలో ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ సృజన, ఇతర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఇక నుంచి ప్రతి నెలా రెండు, నాలుగో శుక్రవారాలలో ఆన్‌లైన్ గ్రీవెన్స్‌డేను నిర్వహించనున్నారు.

జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి

- పెద్ద ధన్వాడలో రైతుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



నవతెలంగాణ- జోగులాంబ గద్వాల

జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలంటూ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వారికి వివిధ గ్రామాల ప్రజలు, రైతులు తరలివచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాటంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విషపూరితమైన జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతిచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు భూములను బలవంతంగా తీసుకోవడానికి ప్రభుత్వం రైతులను భయభ్రాంతుల గురిచేస్తూ.. అక్రమ కేసులు నమోదు చేస్తోందని చెప్పారు. ప్రజా ఉద్యమాలను అణచివేయాలని అధికారి యంత్రాంగం ద్వారా ఒత్తిడి చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీల నిర్మాణానికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ.. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులపై అక్రమ కేసులను నమోదు చేయడం దుర్మార్గమన్నారు. రైతులపై ప్రభుత్వం కక్షపూరితమైన విధానాలు అవలంబిస్తే జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉద్యమం తీవ్రం చేస్తామని, సామాజిక, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దుర్మార్గ విధానాలపై ప్రచారం చేస్తామని అన్నారు. ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలను కలుపుకుని పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషపూరితమైన కార్పొరేట్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం చేస్తున్న కుట్రలను వెంటనే విరమించుకుని, నడిగడ్డ రైతుల సాగు భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

రూ.3లక్షలు ఇచ్చా.. కేసు ఎందుకు పెట్టావ్

- జమ్మికుంట సీఐతో ఓవ్యక్తి వాగ్వాదం.. ఆడియో వైరల్

నవతెలంగాణ - జమ్మికుంట

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలో కేసు పెట్టొద్దని పట్టణ సీఐకి డబ్బులు ఇచ్చినా కేసు ఎందుకు పెట్టావని ఓ వ్యక్తి ప్రశ్నిస్తున్న ఆడియో వైరల్ అవుతోంది. ఆఫీసు బాత్రూంలో మూడు లక్షల రూపాయలు పెట్టానని మున్సిపల్ పరిధిలోని కొత్తపెల్లి గ్రామవాసి, సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ మాట్లాడినట్టు ఉన్న ఆడియో వైరల్ అవుతోంది. డబ్బులు ఇచ్చిన వ్యక్తిపైనే అట్రాసిటీ కేసు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. మండలంలో కోరపల్లిలోని ఎస్ఆర్‌కే మిల్క్ డెయిరీలో పనిచేస్తున్న వ్యక్తికి, యాజమాన్యానికి గల వివాదం ఏర్పడింది. దాంతో పని మానేసిన వ్యక్తి, యాజమాన్యంతో భాగస్వామిగా ఉన్న కృష్ణారావు, గోవిందరెడ్డి, మధుపై పెట్టిన విషయంలో మధ్యవర్తిగా వెళ్లిన సాబీర్‌తో.. కేసు పెట్టకూడదు అంటే మూడు లక్షలు రూపాయలు ఇవ్వాలని సీఐ డిమాండ్ చేశారని ఆడియోలో ఉంది. దీంతో వారి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి అక్టోబర్ 28 నుంచి 30 వరకు సీఐతో చర్చించి, డబ్బులు ఇవ్వడానికి ఒప్పందం జరిగిందని, ఆ ప్రకారం బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్ బయటకు వెళ్లగానే, సీఐ తనతో డబ్బులు వాష్ రూమ్‌లో పెట్టి వెళ్లాలని చెప్పారని ఆడియోలో ఉంది. తాను సీఐ రూములో ఉన్న బాత్రూంలోకి వెళ్లి బకెట్లో మూడు లక్షలు పెట్టినట్టు మాట్లాడాడు. ఈ విషయం అంతా తన జేబుకు గల స్పై కెమెరాలో చిత్రీకరించినట్టు ఆడియోలో చెప్పాడు. కాగా, సీఐకి, సాబీర్‌కు మధ్య జరిగిన సంభాషణ రూపంలో ఆడియో లీక్ కావడం జమ్మికుంటలో చర్చనీయాంశంగా మారింది. ఆడియోపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

లాస్ ఏంజిలిస్‌లో ఆరని మంటలు

(మొదటిపేజీ తరువాయి)

ఏరియా అయిన కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో దాదాపు 41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు, పొదలు పూర్తిగా మాడి మసైపోయాయి. గత మూడు వారాలుగా కార్చిచ్చు చెలరేగుతున్న ఈటన్, పాలిసాడ్స్ ఏరియాలకు ఈ ప్రాంతం 64కిలోమీటర్ల దూరంలో వుంది. మరోవైపు పెద్ద ఎత్తున దాదాపు 4వేల మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు హోరాహోరీ శ్రమిస్తున్నారు. ఇంత చేస్తే 14శాతం మేరా మంటలను అదుపు చేయగలిగారు. ఈ పరిస్థితుల్లో లాస్‌ఏంజెల్స్, వెంటురా కౌంటీల్లో శుక్రవారం ఉదయం 10గంటల వరకు రెడ్ ఫ్లాగ్ హెచ్చరికలు జారీ చేశారు. 5వ నెంబరు అంతర్రాష్ట్ర రహదారిలో కొన్ని భాగాలను మూసివేశారు. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత తెరుస్తామని లాస్‌ఏంజెల్స్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా చెప్పారు. ఇదిలావుండగా ఇప్పటికే విమానాల ద్వారా వాటర్ బాంబులను జార విడుస్తూ మంటల ఉధృతి తగ్గించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఖోఖో ఆడుతూ కుప్పకూలిన విద్యార్థి

- ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి



నవతెలంగాణ-నార్నూర్

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం భీంపూర్ గ్రామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ఖోఖో ఆడుతూ 9వ తరగతి విద్యార్థి రాథోడ్ రవి (బన్నీ) కుప్పకూలాడు. ఎంఈఓ అనిత తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థి మూడు నెలల కిందట పాఠశాలలో చేరాడు. చిన్న తనంలోనే గుండెకు చికిత్స జరిగింది. గణతంత్ర దినోత్సవ క్రీడాపోటీల్లో భాగంగా గురువారం తోటి విద్యార్థులతో కలిసి పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల్లో పాల్గొన్నాడు. ఖోఖో ఆడుతూ ఒక్కసారిగా పడిపోయాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ దారావత్ ప్రవీణ్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా కల్పించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య

నవతెలంగాణ-మధిర



(ఫైల్)

ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిదానపురం గ్రామానికి చెందిన షేక్ బాజీ అనే యువకుడు ఎనిమిది సంవత్సరాల కిందట షేక్ ప్రేజా (చిలివేరు మౌనిక-పద్మశాలి, ఈమె తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు) అనే యువతిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెండ్లి చేసుకున్నాడు. ప్రేజా తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా అతనిని వివాహం చేసుకుంది.వారి దాంపత్య జీవితం కొంతకాలం సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు మెహక్(4), మెనురూల్(3) ఉన్నారు. షేక్ బాజీని గతంలో ఓ దొంగతనం కేసులో విజయవాడ పోలీసులు విచారించారు. షేక్ ప్రేజాను కూడా పోలీసులు పిలిచి విషయం చెప్పారు. అప్పుడు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఇటువంటి వాటికి పాల్పడవద్దని ఆమె హెచ్చరించింది. ఈ క్రమంలో వారు ఖమ్మంకు తమ మకాం మార్చారు. ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్నట్టు ఆమెను నమ్మించాడు. కొద్ది రోజుల తర్వాత తిరిగి నిదానపురం వచ్చారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఖమ్మం పోలీసులు ఒక దొంగతనం విషయంలో బోనకల్లు మండలం మోటమర్రి గ్రామంలో షేక్ బాజీని పట్టుకొని ఖమ్మం తీసుకువెళ్లారు. ఆ విషయాన్ని మరుసటి రోజు(గురువారం) షేక్ ఫైజాకు పోలీసులు చెప్పటంతో ఆమె మనస్తాపానికి గురై తన భర్త జీవితంలో ఇక మారడేమో అనుకొని తన ఇద్దరు పిల్లలతో సహా తాను కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-ఆదిభట్ల

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో కొంగరకలాన్ చౌరస్తా నుంచి మంగళపల్లి వరకు రూ.25 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ చైర్మెన్ మర్రి నిరంజన్‌రెడ్డిలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిభట్ల నుంచి కొంగరకలాన్ చౌరస్తా, మంగళపల్లి వరకు రోడ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అదే విధంగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల కరెంటు బిల్లు, రూ.500లకే సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మెన్ మర్రి నిరంజన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో పట్టుబట్టి అధిక నిధులు తీసుకొచ్చారని వివరించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న చైర్మెన్ మర్రి నిరంజన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో మరిన్ని నిధులు వెచ్చించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్లు, మున్సిపాలిటీల చైర్మెన్లు, కాంగ్రెస్ మున్సిపాలిటీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్ర



వాషింగ్టన్ : క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలోకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ చేర్చారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే పరిస్థితి తారుమారైంది. ఒక వారం క్రితం క్యూబాను ఈ జాబితా నుండి తొలగిస్తూ ఎన్నాళ్ళగానో అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న నిర్ణయాన్ని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్నారు. కానీ ట్రంప్ పగ్గాలు చేపట్టగానే మళ్లీ ఆ నిర్ణయాన్ని రద్దు చేశారు. క్యూబాపై పలు రకాలుగా ఏకపక్ష ఆంక్షలు విధించడంతో ఒక రకంగా అంతర్జాతీయ వాణిజ్య పరిధి నుండి ఆ దేశం బయటకు వచ్చేసింది. ఈ కారణంగా ఇంధనం వంటి కీలక ఉత్పత్తుల కొరత చాలా తీవ్రంగా వుంటోంది. ఆంక్షలు సహా ఇటువంటి చర్యలతో క్యూబా అనేక మానవతా సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ట్రంప్ తీసుకున్న చర్యను క్యూబా అధ్యక్షుడ మిగ్వెల్ డియాజ్ కానెల్ తీవ్రంగా విమర్శించారు. అహంకారపూరితమైన చర్యగా అభివర్ణించారు. వాస్తవంతో ఏ మాత్రం సంబంధం లేకుండా తీసుకున్న చర్యని వ్యాఖ్యానించారు. తన ఆధిపత్యం కోసం క్యూబాపై చాలా క్రూరమైన రీతిలో ఆర్థిక యుద్ధం జరపాలని, దాన్ని ఇంకా బలోపేతం చేయాలన్నది ట్రంప్ లక్ష్యమని క్యూబా అధ్యక్షుడు పేర్కొన్నారు. నిండా అహంకారంలో మునిగిపోయారని ట్రంప్‌పై క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా విమర్శించారు. క్యూబన్ల కుటుంబాలను శిక్షించాలన్నది ఆయన అభిమతంగా వుందన్నారు. అయితే ఇలాంటి చర్యల వల్ల క్యూబన్ల కృత నిశ్చయాలను నీరు గార్చలేరని, అంతిమంగా విజయం తమదేనని రొడ్రిగజ్ స్పష్టం చేశారు. లాటిన్ అమెరికా, కరేబియా వ్యాప్తంగా సామాజిక, రాజకీయ సంఘాల వేదిక అల్బా మూవ్‌మెంట్స్ కూడా ఈ చర్యలను తీవ్రంగా ఖండించింది. సాంప్రదాయేతర యుద్ధ విధానాలకు పాల్పడుతూ ఊచకోత విధానంలో భాగంగా ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఆ వేదిక విమర్శించింది. అల్బా-టిసిపి కూడా ట్రంప్ చర్యను తీవ్రంగా వ్యతిరేకించింది.

పటాన్‌చెరు కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విభేదాలు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దిష్టి బొమ్మ దహనానికి యత్నం
- క్యాంపు కార్యాలయంలోకి దూసుకెళ్లిన వైనం
- శిఖండి రాజకీయాలు మానుకో అంటూ 'కాట'పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దాడులకు తావులేదు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జాతీయ రహదారిపై బైటాయించిన 'కాట' వర్గీయులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా సొంత పార్టీ శ్రేణులే ఆందోళన చేపట్టారు. ఇటీవల బొల్లారం మున్సిపాల్టీలో జరిగిన సంఘటనను నిరసిస్తూ, నిఖార్సైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల పట్ల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం నిరసనకు దిగారు. దాంతో మరోమారు పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీలో ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులతో కార్యకర్తలు బైటాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి డౌన్ డౌన్.. సేవ్ కాంగ్రెస్.. అంటూ నినాదాలు చేశారు. ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలోకి దూసుకెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ పలువురు కార్యకర్తలు లోపలికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో పెట్టారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాగా ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని, అన్నింటిలో బీఆర్ఎస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యకర్తలు ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటో ఎందుకు పెట్టలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. పనులు పూర్తికాకముందే హడావుడి చేసి ప్రారంభోత్సవాలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటూ పార్టీ అసలైన నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యేని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దాడులకు తావులేదు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రజలు రెండుసార్లు ఛీ కొట్టినా బుద్ధి మారకుండా తిరిగి నియోజకవర్గంలో శిఖండి రాజకీయాలు చేస్తూ వ్యక్తిగత దాడులకు పాల్పడటం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్‌కు సూచించారు. క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఎమ్మెల్యే నివాసం ఉండే క్యాంపు కార్యాలయంపైకి కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం లాంటిదన్నారు. తాను పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజల హృదయాలను గెలుచుకున్నానని తెలిపారు. కాట శ్రీనివాస్ గౌడ్‌కి అమీన్‌పూర్ సర్పంచ్‌గా ప్రజలు అవకాశం అందిస్తే నిధులు పక్కదారి పట్టించి జైలు పాలు కావడంతోపాటు రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి దారుణ ఓటమికి గురయ్యారని అన్నారు. తన 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నీచ రాజకీయాలను చూడలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం మాత్రమే ఆహ్వానాలు అందజేశారు తప్ప.. పార్టీలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందా అని ప్రశ్నించారు. ఇలాంటి దాడుల సంస్కృతి పటాన్ చెరు ప్రాంతంలో ఇప్పటివరకు లేదని, తమ ఓపికను పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోనంటూ తీవ్రంగా స్పందించారు. క్యాంపు ఆఫీసుపై దాడి చేసిన దుండగులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఘటన పై ఇప్పటికే ఐజీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లానని, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరింత ముదిరిన కృష్ణాజలాల వివాదం

- 'సుప్రీం'లో ఏపీ పిటిషన్
- ఫిబ్రవరి 13న విచారణ
- ట్రిబ్యునల్ తాజా ఆదేశాలపై ప్రస్తావన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా జలాల వివాదం మరింత ముదిరింది. తాజాగా కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టులో ఏపీ సర్కారు రిట్ పిటిషన్ వేసింది. దీంతో ఫిబ్రవరి 14న పిటిషన్‌పై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యాకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబర్‌లో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తెలంగాణ భూభాగంలోనే కృష్ణానది ఎక్కువగా ప్రవహిస్తున్నదనీ, ఈ నేపథ్యంలో తెలంగాణకు కృష్ణా జలాల్లో 50 శాతం వాటా ఇవ్వాలని ట్రిబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు చేయాలని ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ వేసింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ సర్కారు సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ దాఖలు చేసింది. దానిపై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ సర్కారు ప్రస్తావించింది. జస్టిస్ సుర్యాకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విషయాన్ని తెలియజేసింది. ఫిబ్రవరి 19న కృష్ణా ట్రిబ్యునల్ విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని ఏపీ కోరింది. అందుకు అనుగుణంగా స్పందించిన ధర్మాసనం, ఫిబ్రవరి 13న మధ్యాహ్నం రెండు గంటలకు వాదనలు వింటామని తెలిపింది. ఆ మేరకు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. కృష్ణాజలాలపై ఇరురాష్ట్రాల ముఖ్య మంత్రులు ఇటీవల సమీక్షలు సైతం నిర్వహించారు. జలాలకు సంబంధించిన కేటాయింపులపై రాజీపడొద్దని ఇరువురు సీఎంలూ తమ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. తెలంగాణకు సంబంధించి సీఎం రేవంత్ దావోస్ పర్యటనకు వెళ్లక ముందే కృష్ణాజలాల విషయంలో ఒక్క నీటి బొట్టును వదులుకోకుండా ఇటు ట్రిబ్యునల్‌తోపాటు అటు సుప్రీంకోర్టులోనూ వాదనలను వినిపించాలని ఆదేశించారు. సుప్రీంలో ఏపీ వేసిన రిట్ పిటిషన్ నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ అప్రమత్తమైంది. ఏపీ వేసిన పిటిషన్‌పై న్యాయ సలహాలను తీసుకునే పనిలో పడింది. ట్రిబ్యునల్‌తోపాటు సుప్రీంలోనూ సమాంతరంగా వాదనలు జరిగే అవకాశం ఉండటంతో అడ్వకేట్ జనరల్‌తో సంప్రదింపులు చేయాలని జలసౌధలోని అధికారులు భావిస్తున్నారు. దావోస్ నుంచి సీఎం రేవంత్ రాగానే మరోసారి సమీక్ష నిర్వహించే అవకాశముంది. ఇదిలావుండగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం కేటాయింపులు చేయాలనే డిమాండ్‌ను తెలంగాణ ఎప్పటి నుంచో చేస్తున్నది. ఇటీవల ఢిల్లీలో జరిగిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్-2 వాదనలకు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం హాజరయ్యారు. అడ్వకేట్ ఆన్ రికార్డుతోనూ చర్చిం చారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో బలమైన వాదనలు వినిపించాలని కోరారు.

అవయవదాతల అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించాలి

- మంత్రి దామోదరకు అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవయవదాతల అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం కోరింది. ఈ మేరకు సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రైర్ పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నేతత్వంలో అవయవదాతల సంఘం పక్షానా ఆయన 10 డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. అవయవ దాత అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించటానికి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఇటువంటి ఉత్తర్వులు ఇచ్చాయనీ, అవయవ దానాలను ప్రోత్సహించటంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటం ద్వారా ప్రజల్లో చాలా ప్రభావాన్ని కలిగిస్తున్న అనేక ఉదంతాలున్నాయని మంత్రికి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇటువంటి మానవీయ విలువలు కలిగిన జీవో విడుదల చేస్తుందని మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అవయవదాన ఉద్యమం తరపున మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఇంకెంత కాలం?

- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆమె సీఎంకు బహిరంగ లేఖ రాశారు. అధికారంలోకొచ్చిన ఆర్నెల్లలోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ హామీ ఇచ్చిందనీ, కానీ ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యిందనీ, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగిసిందనీ, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోందని వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయి లేనట్టు అర్థమవుతోందని తెలిపారు.

విశ్వవిద్యాలయాలు వెలవెల

ఆచార్యుల పోస్టుల్లో 73 శాతం ఖాళీ / కుంటుపడుతున్న విద్యాప్రమాణాలు

- ఏటా రిటైర్మెంట్లే తప్ప నియామకాల్లేవు
- తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇదే పద్ధతి
- ఖాళీల భర్తీకి విధానం ప్రకటించని ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు వెలవెలబోతున్నాయి. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఏకంగా 73 శాతం ఖాళీలున్నాయి. 12 విశ్వవిద్యాలయాల పరిధిలో మొత్తం 2,817 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 757 (26.87 శాతం) మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 (73.13 శాతం) ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో 1,267 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుంటే, వాటిలో 331 (26.12 శాతం) మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఏకంగా 936 (73.87 శాతం) ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో 409 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుంటే, 79 (19.32 శాతం) మంది మాత్రమే ఉన్నారు. ఏకంగా 330 (80.68 శాతం) ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పరిస్థితి ఈ రెండు విశ్వవిద్యాలయాలకే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉన్నది. ప్రతినెలా ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. 12 ఏండ్లుగా నియామకాల ప్రక్రియ మాత్రం ప్రభుత్వాలు చేపట్టడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2013లో విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టుల నియామకాల ప్రక్రియ సాగింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత కూడా వర్సిటీల్లో నియామకాల ప్రక్రియను గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టకపోవడం గమనార్హం. తెలంగాణ వచ్చినా వర్సిటీల్లో ఆచార్యుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో దీనావస్థలో ఉన్నాయి.



ఆచార్యుల పోస్టుల భర్తీకి విధానమేదీ?

విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీకి ఎలాంటి విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తుందో ఇప్పటి వరకు వెల్లడించలేదు. గతంలో విశ్వవిద్యాలయం యూనిట్‌గా ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ సాగింది. వర్సిటీలే నోటిఫికేషన్లను విడుదల చేసి నియామకాల ప్రక్రియను చేపట్టే విధానం ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును రూపొందించింది. అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించింది. ఆ బిల్లు ద్వారా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని ప్రొఫెసర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించారు. ఇప్పటి వరకు ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదించలేదు, తిరస్కరించలేదు. దీంతో తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు ప్రశ్నార్థకంగా ఉన్నది. రాష్ట్రపతి వద్ద పరిశీలనలో ఉన్న కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కొందరు ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. పాత పద్ధతిలోనే విశ్వవిద్యాలయం యూనిట్‌గా ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని విద్యావేత్తలు, నిపుణులు సూచిస్తున్నారు.

ఇందుకోసం ఎలాంటి విధానం అనుసరించాలనే దానిపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ ఘంటా చక్రపాణి నేతృత్వంలో ఉన్నత విద్యామండలి త్రిసభ్య కమిటీని నియమించింది. త్వరలోనే ఆ కమిటీ నివేదికను సమర్పిస్తుంది. దాన్ని ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి పంపిస్తుంది. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

పరిశోధనల్లో నాణ్యత అంతంతే..

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పేద విద్యార్థులే చదువుకుంటున్నారు. వారిలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే ఉన్నారు. ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో వారికి నాణ్యమైన విద్య అందడం లేదు. పరిశోధనల్లో నాణ్యత కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నది. ఇంకోవైపు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సరిపోయినన్ని నిధులను కూడా కేటాయించడం లేదు. దీంతో మౌలిక వసతుల సమస్యలు కూడా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీని కాంగ్రెస్ స్థాపిస్తున్నది. ఇప్పటికే శంకుస్థాపన చేసింది. కానీ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అన్ని వర్సిటీల్లోనూ కొన్ని హాస్టల్ గదులు, తరగతి గదుల్లో పై కప్పు పెచ్చులూడుతున్నాయి. నాణ్యమైన మెస్ కూడా విద్యార్థులకు అందడం లేదు. ఇలా అనేక సమస్యలతో విశ్వవిద్యాలయాలు సతమతమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆచార్యుల పోస్టుల భర్తీతోపాటు మౌలిక వసతుల కల్పనపైనా దృష్టిసారించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రొఫెసర్ల వయోపరిమితిని 60 నుంచి 65 ఏండ్లకు పెంచాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి పంపించింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. ఈ నిర్ణయం వల్ల కొంత ఉపశమనం కలగనుంది.

సవాల్‌గా మీర్‌పేట్ మర్డర్ కేసు విచారణ

సంచలన విషయాలు వెలుగులోకి..!

- యాక్సా బ్లేడ్‌తో భార్య శరీరాన్ని ముక్కలు చేసిన నిందితుడు
- ఆనవాళ్లు లేకుండా మాయం
- మరో మహిళతో వివాహేతర సంబంధమే హత్యకు కారణమా..?
- ఇప్పటి వరకు లభించని మృతదేహం ఆనవాళ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు రాష్ట్రాలో సంచలనం సృష్టించిన మీర్‌పేట్ హత్యకేసులో పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. భర్త గురుమూర్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేయడంతో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిసింది. నిందితుడు చెప్పే విషయాలకు పోలీసులే షాక్ అవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గురుమూర్తి భార్య వెంకట మాధవి సంక్రాంతికి ఊరెళ్తానని చెప్పింది. అందుకు ఒప్పుకోని గురుమూర్తి 14వ తేదీన భార్య మాధవి, పిల్లలను సినిమాకు తీసుకెళ్లాడు. తర్వాత పిల్లలను అమ్మమ్మ ఇంటి వద్ద వదిలేసి భార్యాభర్తలు ఇంటికొచ్చారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవ జరగడంతో కోపంతో ఆమెను కొట్టినట్టు నిందితుడు పోలీసుల ఎదుట వాపోయాడు. స్పృహ తప్పి పడిపోయిందని భావించానని, అయితే తన భార్య మృతిచెందినట్టు తర్వాత గుర్తించినట్టు తెలిపాడు. దాంతో ఏం చేయాలో తెలియక.. పోలీసులకు చిక్కకుండా మృతదేహాన్ని మాయం చేయాలని పథకం వేశానని, ఇంట్లో ఉన్న రెండు కత్తులు, యాక్సా బ్లేడ్‌తో శరీరంలోని మాంసాన్ని(మెత్తటి భాగాలు) ముక్కలు ముక్కలుగా కోశానని చెప్పాడు. ముక్కలను బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌ను ఆన్ చేసి ఉడికించినట్టు విచారణలో నిందితుడు అంగీకరించినట్టు సమాచారం. దాదాపు 8-9 గంటలపాటు ఉడికించిన తర్వాత వాటిని ఎండబెట్టి పొడి చేసినట్టు తెలిపాడు. ఎముకలను సైతం బూడిదయ్యే వరకు కాల్చి రోట్లో వేసి దంచిన తర్వాత కొంత డ్రయినేజీలో పడేసి నీళ్లు కొట్టి, మిగిలిన పొడిని రెండు బకెట్లలో తీసుకెళ్లి చెరువులో పడేశానని, ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లో ఫినాయిల్, యాసిడ్‌తో క్లీన్ చేశానని తెలిపాడు. తన భార్య గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని అత్తామామను నమ్మించానని నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్టు తెలిసింది. నిందితుడు చెప్పిన వివరాలతో గాలించినా ఇప్పటికీ మృతదేహానికి సంబంధించిన ఆనవాళ్లు చిక్కకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. సంఘటనా స్థలంలో ఆనవాళ్ల కోసం పరిశీలించిన ఫోరెన్సిక్ బృందాలు నిందితుడు ఉపయోగించిన సెల్‌ఫోన్, రెండు కత్తులు, కుక్కర్, బకెట్‌ను స్వాధీనం చేసుకున్నాయి.

మరో మహిళతో వివాహేతర సంబంధమే కారణమా?

గురుమూర్తి తన భార్య వెంకటమాధవిని అత్యంత కిరాతకంగా హత్యచేయడం, పోలీసులకు దొరక్కుండా ఆధారాలను మాయం చేయడంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు వేగవంతం చేశారు. చిన్న గొడవకే భార్యను దారుణంగా హత్యచేయడం ఏంటని ఆలోచించిన పోలీసులు నిందితుడి సెల్‌ఫోన్ కాల్ లిస్ట్‌ను పరిశీలించారు. అయితే, అందులో ఓ మహిళతో ఎక్కువ సార్లు ఫోన్‌లో మాట్లాడినట్టు ఉండటం, ఆమెతో క్లోజ్‌గా తీసుకున్న ఫొటోలను గుర్తించారు. ఆ మహిళతో సన్నిహితంగా ఉండటంతో ఇంట్లో గొడవలు జరగడం, భార్యను అడ్డు తొలగించుకోవాలనే హత్య చేశాడా అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఏదేమైనా హత్య కేసులో నిందితుడు స్వయంగా తానే చంపినట్టు చెబుతున్నా.. ఎలాంటి ఆధారాలూ దొరక్కపోవడం పెద్ద సవాల్‌గా మారింది.

భార్యని కిరాతకంగా హత్య చేసిన గురుమూర్తిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన గురుమూర్తిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పరిధిలో వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న గురుమూర్తి అతని భార్య వెంకటమాధవిపై అనుమానంతో అతికిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేసి ,ఆమెను ముక్కలు ముక్కలుగా చేయడాన్ని ఖండించారు. అంతేగాక కుక్కర్‌లో వేసి ఉడికించి చెరువులో పడేసిన ఘటన అత్యంత హేయమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గురుమూర్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా తూ్రపాన్‌కు చెందిన గురుమూర్తి, వెంకట మాధవి దంపతులు హైదరాబాదులోని మీర్‌పేట్ వెంకటేశ్వర నగర్‌కాలనీలో నివసిస్తున్నారని తెలిపారు . వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. గురుమూర్తి మిలటరీ ఉద్యోగిగా పనిచేసి రిటైరయ్యారనీ, ప్రస్తుతం సెక్యూరిటీగా పనిచేస్తున్నాడని తెలిపారు. ప్రతిరోజు క్రైమ్‌స్టోరీలు చూస్తూ భార్యపై మరింత అనుమానం పెంచుకున్నారని అభిప్రాయపడ్డారు. నేర ప్రవత్తిని పెంచే క్రైమ్ స్టోరీలను యూట్యూబ్, టీవీల్లో నిలిపేయడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వెంకట మాధవిని హత్య చేసిన గురుమూర్తిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఐటీ ఉద్యోగులను అవమానిస్తారా ?

- యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐటీ ఉద్యోగుల అర్హతలు, నిబద్ధతకు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. తనను ఒక ఐటీ ఉద్యోగి అంటూ తక్కువ చేసి మాట్లాడొచ్చని అనుకునేవాళ్ళకి ఒకటే చెప్పదలుచు కున్నానంటూ గురువారం ఆయన ట్వీట్ చేశారు. " ఐటీ పరిశ్రమల్లో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి చాలా అవసరమనీ, అయితే సంచుల కొద్ది డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకి డబ్బులు పంపడానికి ఇవేమీ అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు. ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల్లో ఉన్న నా అక్కాచెల్లెళ్ళకు, అన్నాదమ్ముళ్ళకు సలాం.. వారి మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. వారు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. వారి విద్యార్హతలకు, నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వారు ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం. నా విద్యార్హతలు, నా ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం, ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం..." అని ఆయన పేర్కొన్నారు.

నీలి చిత్రాలను షేర్ చేస్తున్న నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నీలి చిత్రాలను డౌన్‌లోడ్ చేస్తూ వెబ్‌సైట్‌లో, ఇతరులకు షేర్ చేస్తున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు నిందితులు అశ్లీల వెబ్‌సైట్‌లో నీలి చిత్రాలను చూస్తున్నారు. వాటిని డౌన్‌లోడ్ చేస్తూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌లో షేర్ చేస్తున్నారు. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ పోర్టల్ (ఎన్‌సీఎంఇసీ) అధికారులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు నగరంలోని సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ముందుగా నిందితుల ఐపీ అడ్రస్‌ను పరిశీలించారు. సెల్ నెంబర్, ఈ మెయిల్ అడ్రస్ తనిఖీ చేయడంతోపాటు నిందితులు సంచరిస్తున్న లోకేషన్స్‌పై ప్రత్యేక నిఘా వేశారు. అన్ని కోణాల్లో విచారించి నిందితులను అరెస్టు చేశారు.

85.96 శాతం గ్రామ, వార్డు సభలు పూర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 13,861 గ్రామాలు, వార్డు గ్రామసభలు (85.96 శాతం) పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామసభలు ప్రారంభమైన మూడో రోజైన గురువారం 3,986 గ్రామ సభలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ గ్రామ, వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించి తమ దరఖాస్తులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు 3130, వార్డు సభలు 856 పూర్తయ్యాయి. గ్రామ సభల్లో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆ మందులపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రుమాటిజం, యురినరీ స్టోన్స్‌కు చికిత్స అంటూ తప్పుడు ప్రకటనలున్న రెండు మందులను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్స్) యాక్ట్, 1954 ప్రకారం ఇలాంటి ప్రకటనలో లేబుళ్ల ద్వారా ప్రచారం చేయడం చట్టవిరుద్ధం. ఆసిఫాబాద్ జిల్లాల్లో తనిఖీలు చేయగా ఉత్తరాఖండ్‌కు చెందిన మహేశ్వరి ఫార్మాస్యూ టికల్స్ (ఐ) లిమిటెడ్ తయారు చేసిన రుమ్ లినిమెంట్ (ఆయుర్వేదిక్ మెడిసిన్) రుమాటిజం చికిత్సకు ఉపయోగపడుతు ందని పేర్కొన్నట్టు గుర్తించారు. మేడ్చల్‌లో తనిఖీల్లో ఛండీగఢ్‌కు చెందిన ట్రిగూస్ ఫార్మా తయారు చేసిన స్టోలిస్ట్ క్యాప్సుల్స్ (ఆయుర్వేదిక్ మెడిసిన్) యురినరీ స్టోన్స్ చికిత్సకు పని చేస్తాయంటూ తప్పుదోవ పట్టించేలా ప్రకటనలుం డటంతో వాటిని సీజ్ చేశారు. కేసులు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ పరిధిలో

ఇందిరమ్మ ఇండ్ల కోసం 10.71 లక్షల దరఖాస్తులు

- 7.50 లక్షల దరఖాస్తుల పరిశీలన
- వారం రోజుల్లో మిగిలిన 3.21 లక్షల దరఖాస్తుల తనిఖీ : తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాపాలనలో జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ పరిధిలో ఇందిరమ్మ ఇడ్ల కోసం 10.71 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 7.50 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగా, మిగిలిన 3.21 లక్షల దరఖాస్తుల తనిఖీ వారం రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దనీ, దరఖాస్తులో పొందుపరిచిన ఆధార్ నెంబర్ లేదా మొబైల్ నెంబర్ తో indirammaindlu.telangana.gov.in/applicantSearchలో వారి దరఖాస్తును పరిశీలించే అధికారి పేరు, మొబైల్ నెంబర్ ఉంటుందని పేర్కొన్నారు. వారిని సంప్రదించి సర్వే పూర్తి చేసుకోవచ్చని సూచించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇదివరకే దరఖాస్తు చేసుకుని ఇందిరమ్మ యాప్ లో పేరు నమోదు కాని వారు వార్డు సభల్లో తమ వివరాలను అధికారులు అందజేయాలని పేర్కొన్నారు. ఇంకా ఏవైనా అనుమానులుంటే దగ్గరలో ఉన్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు


'టెలీమానస్' కౌన్సిలింగ్

ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడి, భయాందోళనలకు లోనుకాకుండా వాటిని తగ్గించేందుకు టెలీమానస్ సేవలు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాది మొత్తం ఈ సేవలుంటాయని తెలిపారు. ముఖ్యంగా ఇంటర్ వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, ఫలితాల విడుదల సమయంలో విద్యార్థులకు ఎక్కువ అవసరముంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురైతే సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు టెలీమానస్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తారని వివరించారు. ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలతోపాటు అధ్యాపకులు, తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలుంటే టెలీమానస్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తామని వివరించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 14416 లేదా 1800-914416 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానసిక వైద్యాలయాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఉచితంగానే సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి : బి వెంకట్



న్యూఢిల్లీ : పేదలకు భూ పంపిణీ చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. భూమి లేని ప్రతి నిరుపేద కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండెకరాల చొప్పున సాగుభూమి ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల కొనుగులు శక్తి పెరగకుండా అభివృద్ధి సాధ్యపడదని ఆయన అన్నారు. పేదలకు భూ పంపిణీ చేయకుండా బడా కంపెనీలు పెట్టుబడులతో ఒరిగేదేమీ ఉండదన్నారు. పెట్టుబడుల ముసుగులో సాగు భూములను, అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం సరైంది కాదని, వనరుల కబ్జా చేయడం కోసమే పెట్టుబడిదారులు ఈ నాటకాలు ఆడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి నేతృత్వ కూటమి ప్రభుత్వం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకులంగా పాలన సాగిస్తోన్నాయని విమర్శించారు. పోటాపోటీగా కార్పొరేటర్లకు లక్షలాది ఎకరాల భూములు ఇచ్చేందుకు సిద్ధపడటం సిగ్గుచేటున్నారు. దావోస్‌లో దేశానికి ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాలకు లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ప్రకటిస్తున్నారని, అయితే గతంలో దావోస్‌కి వెళ్లి ఎన్ని పెట్టుబడులు, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రశ్నించారు.

బిజినెస్

ఉబర్, ఓలా అడ్డగోలు దోపిడీ

- ఫోన్ ధరను బట్టి చార్జీలు
- ఇరు సంస్థలకు కేంద్రం నోటీసులు



న్యూఢిల్లీ : హెచ్చు కమిషన్లతో డ్రైవర్ల పొట్టకొడుతూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఉబర్, ఓలా కంపెనీలు ప్రయాణికులను దోచేస్తున్నాయి. క్యాబ్ సేవలందించే ఈ సంస్థలు వినియోగదారుల ఫోన్ల ధరలను బట్టి చార్జీలను పెంచి వసూలు చేస్తున్నాయి. దీనిపై ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకే దూరం, గమ్యస్థానానికి వివిధ రకాల చార్జీలను వసూలు చేయడంపై ఇటీవల భారీగా ఫిర్యాదులు అందాయి. ఈ అడ్డగోలు చార్జీలపై ఓలా, ఉబర్ కంపెనీలకు గురువారం కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఆండ్రాయిడ్, ఐఒఎస్ మాత్రమే కాకుండా స్మార్ట్‌ఫోన్ ఖరీదును బట్టి కూడా చార్జీల్లో తేడా ఉంటుందని ఫిర్యాదులు అందాయి. క్యాబ్ సర్వీసులను బుక్ చేసుకునేందుకు ఉపయోగించే మొబైల్ మోడల్‌ని బట్టి రైడింగ్ ఛార్జీలను విధించడంపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకే దూరానికి ఇరు కంపెనీలు వేర్వేరు మొత్తాల్లో ఛార్జీలు విధిస్తున్నట్టు కూడా ఫిర్యాదులు వచ్చాయని వినియోగదారుల మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) సైతం చర్యలకు ఉపక్రమించింది. ఒకే రకమైన సర్వీసుకు రెండు రకాల ధరలను ఎలా నిర్ణయించారనే దానిపై వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఛార్జీల్లో పారదర్శకత తీసుకునేందుకు సమగ్రమైన వివరణతో కూడిన రిపోర్ట్ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. రైడ్ బుకింగ్ సమయంలో ఒక ధర.. గమ్యస్థానానికి చేరాక మరో ధరను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉబర్ కంపెనీ ఫోన్ మోడల్‌ని బట్టి కాకుండా అందులోని బ్యాటరీ పర్సంటేజీ ఆధారంగా కూడా ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటుందని ఇటీవల ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేశారు. పలు ఆండ్రాయిడ్, ఐఒఎస్ ఫోన్‌ల ద్వారా పరిశీలించిన తర్వాత కూడా దీన్ని నిర్ధారించినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి దోపిడిని ప్రభుత్వం ఏమాత్రం సహించదని వినినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని సిసిపిఎను ఆదేశించామన్నారు.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 విడుదల



బెంగళూరు : సామ్‌సంగ్ తన గెలాక్సీ సిరీస్‌లో ఎస్25ని మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో గెలాక్సీ ఎస్25, ఎస్25 ప్లస్, ఎస్25 అల్ట్రా వేరియంట్లను ఆవిష్కరించింది. ఎఐ పవర్, 12జిబి ర్యామ్, వివిధ మెమెరీలతో వస్తోన్న వీటి ధరల శ్రేణీ రూ.80,999 నుంచి రూ.1,65,000గా నిర్ణయించింది. జనవరి 23 నుంచి ప్రీ ఆర్డర్‌లో రూ.21,000 రాయితీలను కల్పిస్తోన్నట్లు ఆ కంపెనీ తెలిపింది. 50 ఎంపి ప్రైమరీ కెమెరా, 12 ఎంపి అల్ట్రావైడ్ కెమెరా, 10 ఎంపి టెలిఫొటో కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం 12 ఎంపి కెమెరా ఉంటుంది. ఏడేళ్ల వరకూ సెక్యూరిటీ అప్‌డేట్‌లు ఇచ్చింది.

మారుతి సుజుకి కార్లు ప్రియం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి కారు మోడల్ ఆధారంగా అత్యధికంగా రూ.32,500 వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో వాహన ధరలు పెంచాల్సి వస్తుందని తెలిపింది. ఈ భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఆల్టో కె10 నుంచి ఇన్విక్టో వరకు రూ.3.99 లక్షల నుంచి రూ.28.92 లక్షల ధరల శ్రేణీలో పలు మోడళ్లను విక్రయిస్తోంది.

ఎల్ఐసీ ఎంఎఫ్ నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

న్యూఢిల్లీ : ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎల్ఐసి ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను విడుదల చేసింది. ఈ ఓపెన్ ఎండెడ్ స్కీమ్‌లోని నిధులను ఈక్విటీ, డెట్, పసిడి విభాగాల్లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఈ ఎన్ఎఫ్ఒ జనవరి 24న తెరుబడుతుందని.. ఫిబ్రవరి 7న మూసివేసి.. తిరిగి ఫిబ్రవరి 18న తెరువనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించింది. సిప్‌ల్లో అయితే కనీస పెట్టుబడి రూ.200 నుంచి ప్రారంభం అవుతుందని తెలిపింది.

ఎల్‌జీ గణతంత్ర దినోత్సవ ఆఫర్లు

న్యూఢిల్లీ : ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ 'ది నేషన్ కాల్స్ ఫర్ సెలబ్రేషన్' పేరుతో ప్రత్యేక గణతంత్ర దినోత్సవ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. అర్హులైన వారు రూ.26 చెల్లించి.. మిగితా మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించవచ్చని పేర్కొంది. పలు మోడళ్లపై 32.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చని పేర్కొంది. పలు ఉచిత బహుమతులు అందుకోవచ్చని తెలిపింది. ఈ ఆఫర్ జనవరి 31 వరకు తమ స్టోర్లు, ఎల్‌జి ఆన్‌లైన్ వేదికలో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్‌లో 76 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌నకు చెందిన ప్రముఖ బి 2 బి ఓమ్నిచానెల్ ప్లాట్ఫామ్ ఫ్లిప్‌కార్ట్ హోల్ సేల్ ప్రత్యేకంగా 'రిపబ్లిక్ డే సేల్'ను ప్రకటించింది. కిరాణా వ్యాపారులకు లాభదాయకతను పెంచడానికి రూపొందించిన ఇది జనవరి 26 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. సాధారణ సరుకులు, స్టేపుల్స్, వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ, ఆహారం, పానీయాలు ఇంకా మరెన్నో విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 76 శాతం వరకు డిస్కౌంట్ ఉంటుందని తెలిపింది.

సైయంట్‌కు రూ.122 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఐటి కంపెనీ సైయంట్ 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 31.7 శాతం తగ్గుదలతో రూ.122.3 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం త్రైమాసికంలో రూ.179 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 4.2 శాతం పెరిగి రూ.1,926.4 కోట్లుగా నమోదయ్యింది. ఇది సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.1,849 కోట్లుగా ఉంది.

తగ్గిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లాభాలు

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బి) 64 శాతం తగ్గుదలతో రూ.109 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. అధిక మొండి బాకీలు లాభాల తగ్గుదలకు ప్రధాన కారణమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.300 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.1,655 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ3లో రూ.1,763 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.68 శాతానికి పెరగాయి. 2023 డిసెంబర్ త్రైమాసికంలో 2.18 శాతంగా జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.17 శాతం నుంచి 0.56 శాతానికి పెరిగాయి

'భేటీ బచావో భేటి పడావో' ర్యాలీ



నవతెలంగాణ - చంపాపేట్

బాలికల నిష్పత్తి తగ్గటం, భ్రూణ హత్యలకు నిరసనగా 'బేటి బచావో' నినాదంతో ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ పరిధిలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయం సతీష్, ఆర్.ఐ. రవీందర్ రెడ్డి, ఆకాడమిక్ కో ఆర్డినేటర్ రఘువంశీ, ప్రిన్సిపాల్ ఫణి మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్ సింగ్, డీన్ వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి'



నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు జల్‌పల్లి మున్సిపాలిటీలో పదిహేను వార్డు సభలు ఆమోదం తెలిపాయి. ఈ కార్యక్రమంలో చైర్మెన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మెన్ ఫర్హానా నాజ్ యూసుఫ్ పటేల్ , కౌన్సిలర్లు ప్రశాంతి శ్రీధర్ గౌడ్, షేక్ ఫమీద ఆఫ్జల్, శంషాద్దీన్, సౌద్ అవల్గి, నాయకులు షైక్ జహంగీర్, నవీన్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గం వివర్స్ సెల్ అధ్యక్షులు మస్నా రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులు, స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్ మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు, విస్తరిస్తున్న కొత్త కాలనీల్లో తగిన సిబ్బంది లేరు అనే కారణం చేత గత రెండు సంవత్సరాలుగా హరితహారం పేరుతో అదేవిధంగా ప్రైవేట్ కాంట్రాక్ట్ పేరుతో సుమారు 40 నుండి 50 మంది కార్మికులను తీసుకొని.. వారితో స్వీపర్లుగా కామాటీలుగా, డ్రైవర్లుగా, వాటర్ మెన్స్‌గా, ఎలక్ట్రీషియన్లుగా పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతనాలు మాత్రం రెగ్యులర్ కార్మికులకు ఇస్తున్న మాదిరిగా ఇవ్వడం లేదని, అదేవిధంగా చట్టబద్ధంగా కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కనుక నేడు తుర్కయంజాల్ మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కమిషనర్ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రత్యేక రూపొందించి.. వీరిని రెగ్యులర్ కార్మికుల కోవలోకి తీసుకోవాలని, వీరికి తగిన న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. అదేవిధంగా అనేక సంవత్సరాలుగా తుర్కయంజాల్ ప్రాంతంలో స్వచ్ఛ ఆటోలు నడుపుతున్న కార్మికులు ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరిస్తూ మున్సిపల్ అభివృద్ధికి ప్రజల ఆరోగ్యానికి తోడ్పడుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రతి ఇంటి నుండి నెలకు 150 రూపాయలు చేసే విధంగా కౌన్సిల్లో తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ నేడు జరిగే కౌన్సిల్లో ఈ ఎజెండాపై చర్చించి.. సభ్యుల ఆమోదం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వినతి అందజేసిన వారిలో సీఐటీయూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ నాయకులు మండల సత్యనారాయణ, నక్కమల్ల యాదగిరి, స్వచ్ఛ ఆటో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, సిద్ధు, జహంగీర్, సీతారాములు, సతీష్, లలిత, రాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాట్ పరిక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

చైర్మెన్ శ్రీధర్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం నిర్వహించిన క్యాట్ పరిక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చారని చైర్మెన్ శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెకండ్ లేవల్ 66 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరిలో 7మంది నగదు బహుమతి, 27మంది మెడల్స్, 32 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం ఖాసీం అలీ, కో ఆర్డినేటర్ రమేష్, డీన్ మల్లికార్జున్, సి బ్యాచ్ ఇంచార్జి శ్రీనివాస్, ప్రైమరీ ఇంచార్జి మయూరి, శ్వేత, ఏఓ ఉపేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ది కోసమే వార్డు సభలు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-మీర్‌పేట్

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా లబ్ది పొందడానికే గ్రామ, వార్డు సభల పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో రూ.4కోట్ల 42లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం రూ.50కోట్లు కేటాయిస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి అభివృద్ధిపై ఎలాంటి నిబద్ధత లేదనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ప్రజలను మభ్యపెట్టాడానికే గ్రామ, వార్డు సభలు, ప్రజాపాలన అంటూ సమావేశాలు పెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా తదితర పథకాల పేరుతో ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకున్నారు తప్ప.. ప్రజలకు ఒక్క సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు ఎన్ని సార్లు పెట్టినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రజలందరికీ రేషన్ కార్డులు, ఇండ్లు, పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

చీమలను స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణను అలవర్చుకోవాలి



నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీవో కే అమర్నాథ్

నవతెలంగాణ -నాగోల్

వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ చీమలను స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణ అలవర్చుకోవాలని నాగోల్ ఇంచార్జ్ ఆర్టీవో కె. అమర్నాథ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుండి జరుగుతున్న రోడ్డు భద్రత మాస ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా నాగోల్ ఆర్టీవో కార్యాలయం అధికారుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్ల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలు ఎంతో క్రమశిక్షణతో ఒక దాని వెంట మరొకటి వెలుతాయని, వాటిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి వాహనదారులు రహదారులపై క్రమశిక్షణతో వెళ్లగలిగినట్లయితే సమాజంలో ప్రమాదాలు నివారించుకోవచ్చునని అన్నారు. వాహనం నడిపేటప్పుడు ఏం మాత్రం అశ్రద్ధ వహించకుండా హెల్మెట్ ను ధరించడం, సీట్ బెల్ట్ ని పెట్టుకోవడం మర్చిపోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ ఆర్టీవో ఎల్.కిష్టయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జ్ఞానేశ్వర్, కమలకాంత్, అనిత, శీతల్ చౌహన్, శ్రీధర్, విష్ణు, దీపక్, సాయి ప్రసాద్, కార్తీక్, అభిలాష్, వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-చంపాపేట్

పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయకుంటే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి హెచ్చరించారు. యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్, (సంజీవరెడ్డి నగర్) డీఎస్ నగర్‌లో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న నాలా పనులను ఎవరూ పట్టించకపోవడంతో కాలనీవాసులు కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి ఇంజనీర్ డిపార్ట్మెంట్ వారు, కాంట్రాక్టర్లుతో డీఎస్ నగర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత తొందరగా పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. లేదంటే ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఈఈ ఏకాంబరం, ఏఈ అన్సారి, శిరీష, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, బస్తీ వాసులు రమేష్, సాయి, జగన్, ధనరాజ్, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రాంతి హిల్స్ కాలనీలో ఈటల పర్యటన



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రాంతి హిల్స్ కాలనీలో గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు బద్దం రాంరెడ్డి.. కాలనీ సమస్యలను ఎంపీ ఈటలకు వివరించారు. కాలనీలోని లింక్ రోడ్, పార్క్ అభివృద్ధి, పార్క్ ముందు రోడ్లు, ఇంకా సీసీ కెమెరాలను, హెరాల్డ్ స్కూల్ ముందు ఉన్న పార్క్ కాంపౌండ్ వాల్ నిర్మాణం ఏర్పాటు చేసి, పార్క్ ను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరారు. అదేవిధంగా సీనియర్ సిటిజెన్స్ కోసం బిల్డింగ్ నిర్మించాలన్నారు. క్రాంతి హిల్స్ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్దం రాంరెడ్డి, యాదిరెడ్డి, కాలనీ వాసులు, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

'31న బీసీ హక్కుల సాధన సమితి సమావేశాలు'



నవతెలంగాణ-హయత్ నగర్

ఈ నెల 31వ తేదీన వరంగల్‌లో జరిగే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని తద్వారా ఏ ఏ కులాలకు సంబంధించిన స్పష్టమైన సంఖ్య ప్రభుత్వం దగ్గరకు వస్తుందని, తద్వారా ఆయా కులాల జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ రిజర్వేషన్‌తో పాటు బడ్జెట్‌లో నిధులను అలాగే విద్య, వైద్య ఉద్యోగాలలో రిజర్వేషన్‌తో పాటు ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా అంతే నిష్పత్తి ప్రకారం న్యాయం చేయాలని కోరారు. దేశ జనాభాలో 56% ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ఆయా జిల్లాల కన్వీనర్లు వరంగల్‌లోని శివనగర్ లో ఉన్న సీపీఐ కార్యాలయం తమ్మెర భవన్‌కు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

మహేశ్వరం అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- దిల్ సుఖ్ నగర్

మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి రూ.12కోట్ల 28లక్షల నిధులు మంజూరు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌తో గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని గ్రేటర్ పరిధిలో అభివృద్ధి పనులు కోసం నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని ఆర్కేపురం, సరూర్ నగర్ డివిజన్లలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కమిషనర్‌కు వివరించినట్టు తెలిపారు. మౌలిక సదుపాయాలు తాగునీరు, రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయని వివరించారు. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి సుమారు రూ.12కోట్ల 28 లక్షల రూపాయల నిధులు అవసరం పడుతుందని వివరించారు. పన్నులు రూపంలో కోట్ల రూపాయలను గ్రేటర్‌కు చెల్లిస్తున్నారని, ఆ స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



నవతెలంగాణ-హయత్ నగర్

సమర్థనం ట్రస్ట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని సమర్థనం పాన్ ఇండియా ప్లేస్మెంట్ కో ఆర్డినేటర్ వీరభద్రం, కళాశాల ప్రధానాచార్యులు డా .పి.సురేష్ బాబు అన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జాబ్ మేళాలో 19 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. ఈ జాబ్ మేళాకు 110 మంది అభ్యర్థులు హాజరైనట్టు తెలిపారు. 35 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, కళాశాల విద్యార్థులు, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరెడ్డి, ఇందిర, సమర్థనం ట్రస్ట్ సమన్వయకర్త నల్లపు శ్రావణ్ కుమార్, కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. నరసింహ, కెరీర్ గైడెన్స్ ప్లేసెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గా ప్రసాద్, కో ఆర్డినేటర్ మక్తా, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్



నవతెలంగాణ- హయత్ నగర్

ప్రణాళిక బద్ధంగా డివిజన్‌లోని సమస్యలను పరిష్క రిస్తా నని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మన్సూ రాబాద్ డివిజన్ ఆగమయ్య నగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి గురువారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు వనస్థలిపురం నుండి 50 కాలనీలపైన నుండి వచ్చే వర్షపు నీరు డివిజన్ పరిధిలోని ఆగమ య్య నగర్ కాలనీ నుండి పెద్ద చెరువులోకి వెళ్లే ట్రంక్ లైన్ ఉండడం వలన ప్రతిసారి వర్షాకాలంలో చిన్న వరద వచ్చిన నీట మునిగి ప్రతిక్షణం సమస్యగా ఉండే ఎన్నో సంవత్సరాల సమస్యను నూతన సీసీ రోడ్డు నిర్మించడంతో పరిష్కరించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మిడిదొడ్డి ఆంజనేయులు, సెక్రటరి సతీష రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వసుధ, సుజాత, వసంతి, కుదీరంబోస్, వెంకటాచారి, శ్రీరాములు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్ఐ సత్యనారాయణ



నవతెలంగాణ-చంపాపేట్

డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ.. ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని ఎస్ఐ సత్యనారాయణ కోరారు. హైదరాబాద్ సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని, యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో పాటు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. మీపై మీ కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారనే విషయాన్ని డ్రైవర్లు అనునిత్యం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నియంత్రించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి



ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్ నగర్‌లో అనుమతి లేని నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం హయత్‌నగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో ఇటీవల ఓ విద్యార్థి చనిపోవడంతో విద్యా శాఖ ఆ పాఠశాలను సీజ్ చేయగా.. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దానిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ హయాత్ నగర్ నారాయణ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేకుండా నడిపించడంతో విద్యాశాఖ అధికారులు సీజ్ చేయగా.. ఆ సీజ్ తీసేసి యథేచ్ఛగా పాఠశాలను నడుపుతున్నారని విద్యాశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాల సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, ప్రణయ్, శ్రీశైలం, సాయి, వేణు, వంశీ పాల్గొన్నారు.

రామిడి కళావతి వర్ధంతి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి తల్లి రామిడి కళావతి వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ గ్రామంలోని తన స్వగృహంలో రామిడి కళావతి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత స్మశాన వాటికలో సొంత నిధులతో షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం నాదర్ గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలోని 150 మందికి 3 క్వింటాల బియ్యం పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం చేశారు.



ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంరెడ్డి వెంకట్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, రామిడి మాధురి వీరకర్ణా రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఔదార్యం



నవతెలంగాణ-హస్తినాపురం

ఆపదలో ఉన్న పేదవారికి అండగా నిలబడుతూ తమ వంతు సాయంగా ఆర్థిక సహాయాన్ని అందించడమే హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని బీజేపీ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అసెంబ్లీ కౌన్సిల్ మెంబర్ బొమ్మిడి కిరణ్ కుమార్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం డివిజన్ రోషన్ దౌలా కాలనీలో నివాసముంటున్న బీజేపీ కార్యకర్త నరేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు.. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతు సాయంగా ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి మానవతా దృక్పథంతో తమ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ భరోసాగా నిలుస్తుందని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు అరుణ మన్యోటియా, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షులు పి. శిరీష రెడ్డి, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

లార్డ్స్ ఒలంపియాడ్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప



నవతెలంగాణ- బడంగ్‌పేట్

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లార్డ్స్ ఒలంపియాడ్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ లోని లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్‌లోని విద్యార్థులకు దస్తూరి (చేతిరాత) పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దాల బీరప్ప మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో రాణించాలంటే చేతిరాత ఆవశ్యకత గురించి, మన అందమైన చేతిరాత మన వ్యక్తిత్వాన్ని, మంచి ప్రవర్తనను తెలియజేస్తుందని వివరించారు. లార్డ్స్ వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే మంచి చేతిరాతలో శిక్షణ ఇవ్వడంలో విద్యార్థులలో మంచి మార్కులతో పాటు, ఓపిక, సహనం అలవడుతుందని, అందు కోసమే చేతిరాతలో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ రెడ్డి చేతిరాతలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, దస్తూరి శిక్షకుడు వెంకట్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం ఎలాంటి ఆందోళన చెందవద్దు..

● నాంపల్లి సర్కిల్ పౌరసరఫరాల సహాయ అధికారి పుష్పలత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రేషన్ కార్డుల సర్వే వెరిఫికేషన్ దాదాపుగా పూర్తికావచ్చిందని నాంపల్లి సర్కిల్ సహాయ పౌరసర ఫరాల అధికారి పుష్పలత తెలిపారు. గురువారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆహార భద్రత కార్డులో పిల్లల పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ప్రజలు కొత్తగా రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం తమ కార్యాలయానికి రావనవసరం లేదన్నారు. త్వరలో వార్డు కార్యాలయాల్లో నిర్వహించే వార్డ్ సభల్లో నేరుగా అక్కడే దరఖాస్తు తీసుకొని పేర్లను నమోదు చేసి అక్కడే ఇవ్వవచ్చని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ సూపర్డెంట్ నరేష్, ఇన్‌స్పెక్టర్ లు జగదీష్, సుజాత, శ్రీనివాస్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ జమ్ జమ్ మస్జీద్ మెయిన్ రోడ్డు, దయారా కమాన్, పఠాన్ బస్తీ ఆటో స్టాండ్ ప్రాంతాల్లో గుంతల మయంగా ఉన్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు గురువారం పూర్తి చేశారు. ఈ పనులను ముషీరాబాద్ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్ రెడ్డి, మైనారిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ సర్వర్, బసపాక శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడు తూ.. బాపూజీనగర్ జమ్ జమ్ మస్జీద్ మెయిన్ రోడ్డు, దయారా కమాన్, పఠాన్ బస్తీ ఆటో స్టాండ్ ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను స్థానికుల తరఫున తాము ఎమ్మెల్యే ముఠాగోపాల్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని శ్రీధర్ రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు గురువారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేశారన్నారు.

సదరన్ ట్రావెల్స్ 'హాలిడే మార్ట్' ప్రారంభం

● మరో 13 కొత్త నగరాల్లో హాలిడే మార్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సదరన్ ట్రావెల్స్, 45 లక్షల కంటే ఎక్కువ మంది ప్రయాణికులకు మరపురాని ప్రయాణ అనుభవాన్ని అందించడంలో 55 సంవత్సరాల వారసత్వంతో ప్రయాణం, పర్యాటక పరిశ్రమలో అగ్రగామి సదరన్ ట్రావెల్స్ నిలిచింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తన అన్ని శాఖలలో హాలిడే మార్టును నిర్వహిస్తోంది. కంపెనీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకతోపాటు తమిళనాడులోని 13 కొత్త నగరాలలో హాలిడే మార్ట్‌ను నిర్వహిచాలని తద్వారా భారీ నగదు డిస్కౌంట్ అండ్ ఆఫర్లను కస్టమర్లకు అందించాలని నిర్ణయించింది. ఈ కొత్త 'హాలిడే మార్ట్' విస్తరించడం ద్వారా మరింత మంది ప్రయాణికులకు ప్రయోజనం పొందే అవకాశముంది. ఇందులో భాగంగా దేశీయ అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలను 60,000 వరకు ప్రత్యేక డిస్కౌంట్ లను అందిస్తోంది. ఈ సందర్భంగా లక్డీకాపూల్‌లోని సదరన్ ట్రావెల్స్ సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.వీ.ప్రవీణ్‌కుమార్, శ్రీచరణా కమ్యూనికేషన్స్ సీఎండీ బీ.శ్రీనివాస్ గుప్తా తదితరులు ప్యాకేజ్‌కి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ మాట్లాడారు. మా వార్షిక 'హాలిడే మార్ట్'ని కొత్త నగరాలకు పొడిగించడం ఉత్తమ ప్రయాణ ఒప్పందాలు, అనుభవాలతో దేశవ్యాప్తంగా కస్టమర్లకు సేవలందించడంలో మా అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. హాలిడే మార్ట్ సేల్ సమయంలో, ప్రజలు తమకు నచ్చిన ఏదైనా టూర్ ప్యాకేజీని గణనీయమైన తగ్గింపుతో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ధర, ప్యాకేజీ మొత్తం చెల్లించకుండా కేవలం 5000/- టోకెన్ మొత్తాన్ని బుకింగ్ చేసుకోవచ్చున్నారు సదరన్ ట్రావెల్స్ మహా కుంభ్ కోసం ప్రత్యేకంగా క్యూరేటెడ్ ప్యాకేజీలను కలిగి ఉందన్నారు.

హాలిడే మార్ట్ నిర్వహించే ప్రదేశాలు

- జనవరి 24 నుండి 26వ తేదీ వరకు కాకినాడ, భీమవరం, చీరాల, తిరుపతి, హిందూపురం, కర్నూలు, కడప,
- ఖమ్మం, సూర్యాపేట, హుబ్లీ అండ్ కోయంబత్తూరు ఫిబ్రవరి 1వ తేదీ నుండి 2వ తేదీ వరకు పార్వతీపురం, ఆంధ్రప్రదేశ్
- ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు మహబూబాబాద్‌లో తెలంగాణ

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

● ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగింపు.. ● ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు పరిసరాలు, బాగ్‌లింగంపల్లి ప్రధాన రోడ్డు, అంబేద్కర్ కళాశాల పరిసరాల్లో ఫుట్‌పాత్ ఆక్రమించి, రోడ్డు మీదకు వచ్చి చిన్నచిన్న నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్న వారి ఆక్రమణలు భారీ బందోబస్తు నడుమ జేసీబీ సహాయంతో కూలగొట్టారు. ప్రజలకు ఇబ్బందులు కల్గుతున్నాయని ఎన్నిసార్లు హెచ్చరించిన సదరు వ్యాపారస్తులు పట్టించుకోకపోవడంతో అన్ని శాఖల అధికారులు కలిసి ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని చేపట్టి భారీ ఎత్తున పోలీసు బలగాలతో అక్రమ స్టాల్స్‌ను తొలగించారు. ఉదయం సమయంలో అకస్మాత్తుగా తొలగింపు చర్యలు చేపట్టడంతో బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా అధికారులు వారి మాటలు వినిపించుకోకుండా పనులు ముగించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆపరేషన్ కొనసాగింది. వారం క్రితం కొన్నింటిని నేలమట్టం చేశారు. ఇక్కడి పరిసరాల్లో అందరికీ హెచ్చరికలు జారీ చేసినా వినించుకోకపోవడంతో రెండోసారి పూర్తిగా కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆక్రమించి వ్యాపారాలు చేయడం కారణంగా ఇక్కడకు వచ్చే వినియోగదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, ఇతర వాహనదారుల రాకపోకలకు అనేక ఇబ్బందులు కల్గుతున్నాయని పేర్కొన్నారు. మళ్లీ ఇలాగే ఏర్పాటు చేస్తే అప్పుడు చర్యలు తీవ్రంగా ఉంటాయని అధికారుల హెచ్చరించారు. ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, అదనపు డీసీపీ రాందాసు తేజోవత్, ఏసీపీ ఎర్న వీరేశం, టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు బీజేపీ పాలిత రాష్ట్రాలలో రక్షణ లేదు



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవ రిజర్వేషన్లను పట్టించుకోవడంలేదని బీజేపీ పాలిత రాష్ట్రాలలో క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్ అధ్యక్షులు సి.ఏ డేనియల్ ఆడమ్స్ తెలిపారు. గురువారం మణిపూర్‌లో చెలరేగుతున్న హింసను తక్షణమే ఆపాలని ఎన్‌సీఐసీ ఆధ్వర్యంలో ఇందిర పార్క్ ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జస్టిస్ చంద్రకుమార్, ఎన్‌సీఐసీ అధ్యక్షులు డేనియల్ ఆడమ్స్ కోనే సాల్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 600 రోజులుగా మణిపూర్ లో చెలరేగుతున్న హింసకాండను ఆపడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రతిరోజు క్రైస్తవులపై భారత దేశంలో 20 దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవ రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా క్రైస్తవులకు బీజేపీ పాలిత రాష్ట్రాలలో రక్షణ లేదని తెలిపారు. మణిపూర్‌లో చెలరేగుతున్న హింసకాండను తక్షణమే ఆపాలని దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు తేవాలని బిజెపి పాలిత రాష్ట్రాలలో పాస్టర్లకు చర్చిలకు క్రైస్తవస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రత్యేక క్రైస్తవ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ధర్నాలో క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చ్ వద్ద హై టెన్షన్

● చర్చి లోనికి వెళ్లి తాళం వేసుకున్న ట్రస్ట్ సభ్యుడు
● గేటు వద్ద ఆందోళనకు దిగిన సొసైటీ సభ్యులు..
● భారీగా మోహరించిన పోలీసులు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చి వద్ద ఉద్రిక్తత నెలకొంది. చర్చిపై ఆధిపత్యం కోసం సొసైటీ సభ్యులు, ట్రస్టు వర్గాల మధ్య ఎప్పటి నుంచో పోరు కొనసాగుతోంది. వీరాచారి అనే ట్రస్ట్ సభ్యుడు గురువారం సాయంత్రం తన అనుచరులతో కలిసి చర్చిలోకి వెళ్లేందుకు యత్నించాడు. దీనిని గమనించిన మరో వర్గం వారు అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువురు గల మధ్యలో తోపులాట జరిగింది. ఈ క్రమంలో వీరాచారి తన అనుచరులతో కలిసి తాళం వేసుకొని లోపలే ఉండిపోయాడు. దాంతో మరో వర్గానికి చెందినవారు గేటు బయట ఆందోళనకు దిగారు. దాంతో హెబ్రోన్ చర్చి వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు రాజు నాయక్, రాంబాబు, రాజులతో కలిసి చర్చి వద్దకు చేరుకున్నారు. లోపల ఉన్న వీరాచారిని గేటు తాళం తీయాలని వారు సముదాయించారు. అయినప్పటికీ వీరాచారి మాత్రం గేట్ తీయనని మొండికేశాడు. తనకు కోర్టు నుంచి ఆర్డర్ ఉందని.. ఎట్టి పరిస్థితుల్లో గేటు తాళం తీయని వీరాచారి స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘటన స్థలానికి చేరుకొని ఏసీపీ రమేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

హిందువైనా వీరాచారికి హెబ్రోన్ చర్చికి సంబంధం లేదు

ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. హెబ్రోన్ చర్చి కార్యదర్శిగా చెప్పుకునే రాగి వీరాచారి తన అనుచర వర్గంతో చర్చి లోపలికి వచ్చి... అక్కడున్న వారిని దౌర్జన్యంగా బయటికి వెళ్లగొట్టి చర్చి గేటుకు తాళం వేశారని తెలిపారు. వీరాచారి ఒక హిందువు అని అతనికి హెబ్రోన్ చర్చికి సంబంధం లేదన్నారు. వీరాచారిని వెంటనే అరెస్ట్ చేయాలని, అతని మీద 33 కేసులు ఉన్నాయని ఆరోపించారు. గురువారం రాత్రి అయినప్పటికీ చర్చి లోపల ఉన్న వీరాచారి గేటు తెరవకపోవడంతో మరో వర్గం గేటు బయట ఉండడంతో పోలీసులు బందోబస్తును కొనసాగించారు.

సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహా సభలను అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్ పిలుపునిచ్చారు. పార్టీ సౌత్ జిల్లా గోషామహల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రమహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల, కర్షకుల, ప్రజా సమస్యల పోరాటం చేస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలిచేది సీపీఐ(ఎం) పార్టీయే అన్నారు. ఈ నెల 25, 26వ తేదీలలో సంగారెడ్డిలో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలను అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు కే.జంగయ్య, ఎస్.శ్రీ రాములు, పి.చెన్నయ్య, నెమ్మది గోపాల్, జి.నరసింహ, పి.కురుమయ్య, ఎండీ అయూబ్ ఖాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఈటలను తప్పుదోవ పట్టించిన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు'



● 'శ్రీహర్ష' భాగస్వాములు ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయభాస్కర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల శ్రీహర్ష కన్స్ ట్రక్షన్స్‌కు సంబంధించిన భూమి విషయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కావాలనే కొంత మంది మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తప్పుదోవ పట్టించారని, ఈటల అసలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, సమయమిస్తే ఆయనకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని శ్రీహర్ష భాగస్వాములు, రైతులు ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయ భాస్కర్, చెరుకు నరసింహ గౌడ్, ఎన్.వెంకట్ నారాయణలు కోరారు. గురువారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ ఈటల రాజేందర్ అనుచరులతో కలిసి తమ భూమిలోకి వచ్చి అక్కడున్న వారిపై దాడి చేయడం సరైంది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన పరిశీలించాలని కోరారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా (పోచారం మున్సిపాలిటీ) పరిధి కొర్రెముల గ్రామంలోని సర్వే నెంబర్లు 739, 740, 741, 742లో తమకు 47.25 ఎకరాల భూమి ఉందని చెప్పారు.పక్క సర్వే నెంబర్లు 743, 744, 745, 746, 747, 748, 749లకు చెందిన వారిలో కొంత మంది తమ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 2005లో తాము ఈ 47.25 ఎకరాల భూమి కొన్నామని, దీనిపై కొంత మంది కోర్టులకు వెళ్లిన ఏళ్ల తరబడి పోరాటం తర్వాత తమకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని తెలిపారు.ఇప్పటి వరకు ఆ భూమిని ప్లాట్లుగా చేయలేదని, ఇక్కడ రెండు వేల ప్లాట్లు ఉన్నాయని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని చెప్పారు.సర్వే నెంబర్లు 743, 744, 745, 747లో వేసిన అక్రమ లే అవుట్లను హైకోర్టు ఆదేశాలతో అధికారులు రద్దు చేశారని తెలిపారు. తమను రౌడీలు, గుండాలుగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని, తమ భూమికి రక్షణ కల్పించడంతో పాటు తమపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రియల్ ఎస్టేట్ గుండాల నుంచి తమకు ప్రాణ భయం ఉందని, తమకు రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ రక్షణ కల్పించాలని వారు కోరారు. ఆ సర్వే నెంబర్లపై సమగ్ర సర్వే నిర్వహించి, సీబీఐ చేత విచారణ జరిపించాలని కోరారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని యువకుడు ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని యువకుడు పడి ఉన్న సం ఘటన మంగళ హాట్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసు కుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అస్లం తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ హాట్ సీతారామ్ పేట్, మహా రాన ప్రతాప్ పార్క్ సమీపంలో అపస్మారక స్థితిలో యువ కుడు పడి ఉన్నాడు. స్థానిక ప్రజల సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30 ఏండ్ల వయస్సు ఉం టుంది. ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'25న దక్కన్ బ్రహ్మ సమాజ్ మందిరం శతాబ్ది ఉత్సవాలు'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దక్కన్ బ్రహ్మ సమాజ్ మందిరం శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 25న హైదరాబాద్, హనుమాన్ టేకిడి బ్రహ్మ సమాజ్ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు కేశవ చంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ న్యాయవాది డా.యార్లగడ్డ పద్మావతి, బ్రాహ్మణ సమాజ్ సీనియర్ సభ్యులు సి.మదన్ మోహన్, శ్రావ్య వేమ, ఆత్మీయ అతిథిగా రెవరెండ్ అభి ప్రకాష్, బ్రాహ్మణ సమాజ్ ఆచార్యులు బందా రవిశంకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం బ్రహ్మ సమాజ్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హాజరైన ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దక్కన్ బ్రహ్మ సమాజ్ కార్యదర్శి అజయ్ గౌతమ్ వందన సమర్పణ చేస్తారని ఆయన వెల్లడించారు.

సుప్రీంకోర్టు తీర్పు వెంటనే అమలు చేయాలి

మాదిగ మేధావుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

సుప్రీంకోర్టు తీర్పు వెంటనే అమలు చేయాలని, సామాజిక న్యాయం కోసం కోటి మంది మాదిగలు చేస్తున్న పోరాటం ఎస్సీ వర్గీకరణ పోరాటమని మాదిగ మేధావుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వెంటనే అమలుకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంఘీభావంగా కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం జరిగింది. మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఫోరం గౌరవ అధ్యక్షుడు, ఓయూ ప్రొఫెసర్ కాశీం, ఫోరం ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ నతానియల్, కోశాధికారి బెజ్జంకి రాంబాబు, సలహాదారులు పల్లెల వీరస్వామి, ఉపాధ్యక్షుడు సాయి బాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ అమల అయ్యేంతవరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయరాదని సీఎంను కోరమన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు మోచి చమరుల కులవృత్తి అయిన లిడ్ క్యాప్ ప్రస్తుత టీజీ ఎల్ఐసి తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ రాష్ట్రంలో ప్రకటించిన రెండు మెగా పార్కులను వెంటనే ప్రారంభించి పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఫిబ్రవరి 7న మాదిగ మేధావుల ఫోరం లక్ష డప్పులు - వేల గొంతులు కార్యక్రమానికి సంఘీభావంగా వంద డప్పులను అందజేస్తూ తమ మద్దతు తెలుపుతామన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మాదిగ కళాకారులు మేధావులు లక్ష తప్పులు వెయ్యి గొంతుకలై పాటలు పాడుతూ డప్పు సంగీతాన్ని అందిస్తారన్నారు. డప్పు నుంచి అనేక సంగీత వాయిద్యాలు వెలువడ్డాయని డప్పు చప్పుడులో 36 రకాల వాయిద్యాలను వాయించవచ్చన్నారు. అటువంటి డబ్బులతో సామాజిక న్యాయం కోసం కోటి మంది మాదిగలు చేస్తున్న పోరాటమే ఎస్సీ వర్గీకరణ అని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ మేధావుల ఫోరం నాయకులు నర్సింగ్ రావు, నరసయ్య, ఆంజనేయులు, దర్శనం జాన్, శీను, నరసింహ, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ సీటీఓజీ వినోద్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బి.వినోద్ బాబు, సీనియర్ సైకాలజిస్టు జాన్ హేమంత్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ షాజహాన్ అంటోనీలు పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలను ఏ విధంగా అరికట్టాలి వారి పట్ల, ఎలా జాగ్రత్తలు, తీసుకోవాలి పలు అంశాల పైన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్ బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొందరు సైబర్ నేరగాళ్ల అమాయక విద్యార్థులను టార్గెట్ చేసి, వారిని మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. తల్లిదం డ్రులు, తమ పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వవద్దని, అదేవిధంగా తమ పర్సనల్ అకౌంట్లను కూడా వారికి చెప్పవద్దని ఆయన సూచించారు. బ్రదర్ షాజాన్ ఆంటోనీ మాట్లాడుతూ తమ పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

టీడీపీ సెంట్రల్ జనరల్ సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ ఐటి మినిస్టర్ నారా లోకేష్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య శాఖ రాష్ట్ర సెక్రెటరీ, కేడి దినేష్, నర్సింలు, బాలాజీ, గోస్వామి, సోమశేఖర్ కుర్మా తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గుడిమల్కాపూర్ ఏఎంసీ మార్కెట్ యాడ్ చైర్మెన్ మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మెన్ చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించిన రిటైల్ ఫ్లవర్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు సయ్యద్ ఉమర్, జనరల్ సెక్రెటరీ కేడి దినేష్, వైస్ ప్రెసిడెంట్ ఖదీర్ అలీ, అశోక్‌ఉద్దిన్, ట్రెజరర్ కమాల్ ఖాన్, సయ్యద్ ముక్తార్ ఈ సందర్భంగా కేడి దినేష్ మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కమిటీకి వివరించారు.

ప్రఖ్యాత జాతీయ సమైక్యత శిబిరాలలో సిటీ కళాశాల విద్యార్థులు

● ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం మరో ఘనతను సాధించింది. ఐదు క్రియాశీలక యూనిట్లతో ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ వస్తోంది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కృషితో ప్రతి ఏడాది వివిధ రాష్ట్రాలలో నిర్వహించే ప్రఖ్యాత జాతీయ సమైక్యత శిబిరాలలో పాల్గొనడమే కాక తమ ప్రతిభకు ఉత్తమ వాలంటీర్ల బహుమతులు అందుకుంటున్నారు. ఈ ఏడాది కళాశాల నుండి నలుగురు విద్యార్థులు వివిధ జాతీయ సమైక్యతా శిబిరాలకు ఎంపికై పాల్గొన్నారు. ఇప్పుడు మరొక అరుదైన అవకాశాన్ని సాధించారు. బీకాం విద్యార్థి వినయ్, బీఏ విద్యార్థిని సుస్మితలు న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్ కోసం ఎంపికయ్యారు. 30 రోజుల శిక్షణా కార్యక్రమం అనంతరం జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఎర్ర కోట వద్ద జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. జనవరి 27న భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవడమే కాక, లంచ్‌లో కూడా పాల్గొనబోతున్నారు. దేశ వ్యాప్తంగా లక్షమందికి పైగా ఎంపికైన వాలంటీర్లలో తమ కళాశాల విద్యార్థులుండటం సిటీ కళాశాల విద్యార్థుల నిబద్ధతకు, అద్భుత ప్రతిభకు సాక్ష్యంగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్ అన్నారు. విద్యార్థి వలంటీర్లను తీర్చిదిద్దటంలో విశేష కృషి చేస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ల సమన్వయకర్త డాక్టర్.డి. నాగరాజు, యూనిట్ ఆఫీసర్లను అభినందిం చారు. వినయ్, సుస్మితకు అభినందనలు తెలియజేస్తూ అధ్యాపకులు, విద్యార్థులు తమ శుభాకాంక్షలు అందించారు.

మెడికల్ మాఫియా దందాను అరికట్టాలి

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ మెడికల్ మాఫియా దందాను అరికట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తుందని వాపోయారు. రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ ఆగడాలను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందారని ధ్వజమెత్తారు. ఇదే అదునుగా ప్రయివేట్ ఆసుపత్రులు తమ వికృత వ్యాపార మెడికల్ దందాకు తెరలేపిందని, ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో కిడ్నీ అక్రమ మార్పిడిలు, చర్మ సంబంధిత సర్జరీలు, బ్లడ్ అక్రమ దందాలు, నకిలీ డాక్టర్ల సేవలు, ప్రయివేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల విచ్చలవిడి దోపిడీలు తారాస్థాయికి చేరాయని ఆరోపించారు. ప్రయివేట్ కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. అన్ని రకాల డయాగ్నోస్టిక్ సేవలను పేషెంట్ లకు అందుబాటులో ఉంచుతూ పరీక్షల రిపోర్టులు ఇవ్వాలని కోరారు. ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్ని ఆసుపత్రులలో అన్ని రకాల మందుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, పి.శివ కుమార్, మజీద్ అలీఖాన్, మధు, కళ్యాణ్, అనీల్ కుమార్, శేఖర్, వీరేశ్, భాను, సంజయ్, నగేష్, శివ కుమార్, జెట్టి శ్రీనివాస్, వంశీ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

26న నిరాహార దీక్షకు మద్దతు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పొట్టి శ్రీరాముల విశ్వవిద్యాలయం పేరు మార్చవద్దని ఈనెల 26న ప్రజాఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ చేస్తున్న నిరాహార దీక్షకు ఫోన్‌లో కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాది శేషు మద్దతు తెలిపారని గురువారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయం పేరు మార్చితే, తెలుగు భాషాభిమానుల మనోభావాలు దెబ్బతింటాయని ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

కొలన్‌ను కలిసిన చల్లా మాధవి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా చల్లా మాదవి గోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా.. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాధవి గోపాల్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూతనందించడం అభినందనీయం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత నందించడం అభినందనీయమని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐడీబీఐ బ్యాంక్ వారి సౌజన్యంతో విద్యార్థులకు చైర్లు, కంప్యూటర్ టేబుల్స్, అంప్లిఫైర్, స్పీకర్ సెట్, అల్మరాలు, వంట సామానుల పంపిణీ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ ఆర్ హెచ్ సందీప్ పట్నాయక్, కూకట్‌పల్లి డీజీఎం మురళీధర్‌లతో కలసి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు డి.నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ఉద్యోగికి సేవా పురస్కారం



నవతెలంగాణ-సీటీబ్యూరో

తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ (ఎడ్యుకేషనల్, సోషల్, కల్చరల్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం చేతుల మీదుగా అంతరాం రాంబాబు (లైసనింగ్ ఆఫీసర్. నిమ్స్) అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ప్రతి ఏడాది వైద్య, ఆరోగ్య రంగాలో అందిస్తున్న విశేష సేవలను గుర్తించి వారికి ఈ పురస్కారన్ని అందచేస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం, జస్టిస్ (Retd) పిఎస్‌నారాయణ, డా.బాల చారి సెక్రటరీ తెలంగాణ సాహిత్య అకాడమీ, డా.లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, లయన్ ప్రేంచంద్ మునోట్ జైన్ డైరెక్టర్ లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సంప్రపాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు పాటుపడిన గొప్ప వ్యక్తి రాణి కుముదిని దేవి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వంద ఏండ్ల క్రితమే మహిళా సాధికారిత కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి రాణి కుముదిని దేవి అని రాందేవ్ రావు ఆస్పత్రి డైరెక్టర్ విక్రమ్ దేవ్ రావు కొనియాడారు. గురువారం రాణి కుముదిని దేవి 114వ జయంతిని పురస్కరించుకొని రాందేవ్ ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో రాణి కుముదిని దేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భ ంగా విక్రమ్ దేవ్ రావు మాట్లాడుతూ ఆమె స్ఫూర్తితోనే రాందేవ్ రావ్ ఆస్పత్రి లో వైద్య సేవలని పేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ పబ్బిశెట్టి వెంకటేష్, ఎండీ డాక్టర్ కమలాకర్, ఆస్పత్రి డైరెక్టర్‌లు రన్తి దేవ్, మీరా రావు, జ్యోతి రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు, ఆస్పత్రిసి ఈ ఓ యోబు, డాక్టర్ అనంత రెడ్డి , డాక్టర్ ఛాయదేవి, ఇతర డాక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం అభివృద్దే లక్ష్యం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేని కలిసి పలు ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారు. అనంతరం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సేవ కార్యక్రమాల నిర్వహణతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తుటే విజయ్ కుమార్ కు అభినందనలు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి పదిమందికి సహాయం చేసే విధంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ బాలాజీ నాయక్, 126 డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ సాజిత్, హార్ట్ టూ హెల్ప్ రవి నాయక్, సామాజిక వేత్త మధుబాబు చికిలే, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మూసాపేట్ శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ నూతన కమిటీ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూసాపేట్ మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రవణ్ కుమార్‌లు హాజరై నూతన ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, సప్పిడీ శ్రీనివాస్, భాస్కర్ రావు, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో ప్రమోషన్స్ నిలిపివేయండి



- రవాణా కమిషనర్‌కు టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖలో పరిపాలన అధికారుల నుంచి ఆర్టీవో ప్రమోషన్‌కు సంబంధించిన డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీని(డీపీసీ) కోర్టు కేసులు పరిష్కరమయ్యేంతవరకు నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాక్ చైర్మెన్, టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) గురువారం రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఐఏఎస్‌ను ఖైరతాబాద్ రవాణాశాఖ కేంద్ర కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే జీవో 7, 8ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహన్, సారథి సాఫ్ట్‌వేర్‌లో ఆర్టీవో, ఎంవీఐ నుంచి క్లరికల్ పాత్రను కొనసాగించాలనీ, సెకండ్ వెహికల్ కేసులతో పాటు పెండింగ్ కేసుల విచారణలను త్వరతగతిన పరిష్కరించాలన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ ప్రచార కార్యదర్శి, ఆర్టీఏ యూనిట్ అధ్యక్షులు అరుణేందర్ ప్రసాద్, కార్యదర్శి పవన్ కుమార్, మేడ్చల్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సామ్యూల్ పాల్, టీఎన్జీవోస్ ఆర్టీఏ నాయకులు పర్వేజ్, అభిలాష్ గౌడ్, ఉదయ్ రాజ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శివరాత్రి యాదగిరి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఇటీవల ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా జగద్గిరిగుట్ట చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి నియమితులయ్యారు. గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని కలిశారు. అనం తరం వారిని శాలువాతో సత్కరించారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి నిర్వహించనున్న మండల స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేని ఆహ్వాని స్తూ ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. అనంతరం ట్రస్మా నూతన అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా కోశాధికారి పరశురాం గౌడ్, కుత్బుల్లాపూర్ ట్రస్మా అధ్యక్షులు శ్రీనివాస్, సెక్రటరీ తిరుపతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు నర్సిరెడ్డి, వనజ, అశోక్, ఛాయా, ప్రవీణ్, కుమార్, బలవంత్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో పరీక్షల ఒత్తిడిని అధిగమించే మార్గాలపై చర్చ..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం "ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్" లో బుధవారం విద్యార్థుల మానసిక ఆరోగ్యం, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే మార్గాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ మనోవైద్యుడు శ్రీ చేతన్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైల్డ్ సైకలాజీ, ప్రసిద్ధిగాంచిన మానసిక ఆరోగ్యం విశ్లేషకుడు చైతన్య వర్మ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఎదుగుదలలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనది వివరించారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడి అధిగమించేందుకు తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు వ్యాయామం, మంచి పౌష్టికాహారం, సమయ నిర్వహణ వంటి అంశాలపై తగు సూచనలు అందించారు. విద్యార్థుల అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రిన్సిపల్ శ్రీమతి తులసి కుమారి నంద మాట్లాడుతూ... విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఒత్తిడిని జయించాలని అన్నారు. పరీక్షల కాలం మొదలైనప్పటి నుంచి ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి జయించాలంటే సకాలంలో నిద్రపోవాలని, వ్యాయామం, యోగా చేయడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే మంచి స్థాయికి చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్మెన్ శిరీష్ తుర్లపాటి, డైరెక్టర్ రాధిక తుర్లపాటి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా..



నవతెలంగాణ-దుండిగల్

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్దే ధేయ్యంగా పనిచేస్తా అని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సి పల్ కార్పొరేషన్14,12వ డివిజన్‌ల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి గురువారం ప్రజాప్రతి నిధులతో కలిసి మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి ప్రారం భించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రధానంగా నిజాంపేట్ మంజీర వాటర్ ట్యాంక్ ఎదురుగా కేఎఫ్‌సి వద్ద అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్, వెంకటరాయ నగర్ కాలనీ నుంచి ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1 వరకు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3 లో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్, సాయి నాథ్ నగర్ కాలనీ శివాలయం వద్ద బాక్స్ డ్రెయిన్, టాయిలెట్స్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, రాజేశ్వరి చౌదరీ, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, ఎన్ఎంసి పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, సీనియర్ నాయకులు శ్రీ కోలన్ గోపాల్ రెడ్డి, ఆయా కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్‌తో చర్చలు ఫలవంతం

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఫలవంతంగా హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్‌తో చర్చలు జరిగాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు, పరికిచెరువు అంశం పైన బుధవారం సాయంత్రం 10 గంటల వరకు స్థానిక నాయకులు ప్రభుత్వ అధికారులతో పాటు హైడ్రా కమిషనర్‌తో సమస్యల పైన చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ దేవాలయ భూములు ప్రభుత్వానికి సంబంధించినవి కానీ, ఏ వ్యక్తికో ఏ సంఘానికి చెందనివని కావున ఏర్పాటు చేసినటువం టి దేవాలయాలు కట్టుకున్న గోడల వల్ల కొంతమంది ఆ భూములు తమకి చెందినవని భావించుచున్నరన్నారు. కమర్షియల్‌గా ఉపయోగించుకుంటూ లబ్ధి పొందుతున్నారని అలా లబ్ధి పొందడం అనేది చట్టరీత్యా నేరమని తెలిపారు. వెంటనే అక్కడ ఏర్పాటు చేసుకున్నటువంటి హద్దులు గోడలను తీసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పరికిచెరువు సంబంధించి అక్కడ కబ్జాదారులు పూడ్చి నటువంటి ఫోటోలను వీడియోలను చూసి అసలు ఆ స్థలము ప్రభుత్వానిదా లేక ప్రయివేటుదా? అని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు? ఆ భూములు ప్రభుత్వానివే అని గతంలో కూడా అక్కడ కూల్చి వేతలు చేశామని చెప్పడం, ఆ భూములు మాకు సంబంధించినయని కాగితాలను తీసుకొని పరిశీలిం చాలని వివరించారు. చెరువును ఎట్టి పరిస్థితుల్లో పరిర క్షించుకోవాలని అక్కడ కొత్తగా ఎటువంటి నిర్మాణాలను చేపట్టకూడదని చేపడితే వెంటనే కూల్చివేయాలని అధి కారులను తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. హైడ్రా ఆదే శాల ప్రకారం జూన్ 2024 తర్వాత నిర్మించి నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తారని అంతకు ముందు నిర్మాణా లను కాబట్టి ఎవరైనా ప్రజలు నేరుగా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

సీపీఐ(ఎం) మహాసభలు జయప్రదం చేయండి



నవతెలంగాణ-దుండిగల్

సీపీఐ(ఎం) రాష్ట్ర 4 మహాసభలను 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్నాయని బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు బి వెంకట రామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురు వారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో గత మూడేండ్లలో ప్రజా సమస్యలపై పార్టీ చేసిన పోరాటాలను సాధించిన విజయాలను చర్చిస్తారని తెలిపారు. భవిష్యత్తులో చేయవలసిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో రైతులు, మహిళలు, కార్మికులు, విద్యార్థి, యువజనులు, సామాజిక తరగతుల సమస్యలను చర్చించి.. వాటి పరిష్కార మార్గాలను ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. ఈ మహాసభకు సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్ బృందాకరత్, బీవీ రాఘవులు, విజయ రాఘవతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) బాచుపల్లి మండల నాయకులు బాల వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఎన్.బాలపీరు పాల్గొన్నారు.

వేలం పేరుతో ప్రజలను మోసం చేయొద్దు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ప్లాట్ల వేలం పేరుతో ప్రజలను మోసం చేయొద్దని ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు హౌసింగ్ బోర్డు అధికారులకు సూచించారు. వేలం పేరుతో ప్రజలను హౌసింగ్ బోర్డు అధికారులు మోసం చేస్తున్నారు. రోడ్ల విస్తరణలో ప్లాట్లు పోయే ప్రమాదం ఉంది కాబట్టి కొనుగోలుదారులు జాగ్రత్త అంటూ.. ఎమ్మెల్యే సూచనలు చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో, ప్లాట్ల వేలం పేరుతో ప్రజలను మోసం చేయొద్దని ఏమ్మెల్యే హౌసింగ్ బోర్డు అధికారులకు సూచించారు. హౌసింగ్ బోర్డు అధికారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టాలను, మాస్టర్ ప్లాన్‌లను పరిగణనలోకి తీసుకోకుండా.. ప్లాట్లను అమ్ముకుని సొమ్ముచేసుకోవడమే ధ్యేయంగా, పనిచేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధానంగా హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ ప్రకారం కేపిహెచ్‌బీ కాలనీ, ఏడవ ఫేస్ నుంచి గోపాల్ నగర్ వైపు 200 ఫీట్లుగా నిర్ణయించిన, రోడ్డుకు పక్కన ఉన్న 146 గజాలు, 78 (50) గజాల రెండు ప్లాట్‌లకు 80 ఫీట్ల రోడ్డును చూపుతూ..అమ్మకానికి పెట్టడం ద్వారా మోసం చేస్తున్నారని విమర్శించారు. అ రెండు ప్లాట్లను కొనుగోలు చేసేవారు రేపటి రోజున రోడ్డు విస్తరణలో ప్లాట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అధికారులు మాత్రం రోడ్డులో ప్లాట్లు పోతే జీహెచ్‌ఎంసీ నష్ట పరిహారం కింద టీడీఆర్ ఇస్తారని చెపుతున్నారని తెలిపారు. అలా చూసినా సరే ప్లాట్ కొన్న ధరకు టీడీఆర్ ధరను పోల్చితే పావు వంతు కూడా రాదని తెలిపారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాఫిక్‌పై అవగాహన



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ట్రాఫిక్ వ్యవస్థపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్వాల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్ఐ.నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలును పాటించాలని సూచించారు. వాటి ఉల్లంఘన చట్టరీత్యా నేరమని అందుకు తగ్గ శిక్షలు ఉంటాయని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పక శిరస్త్రాణం ధరించాలని అది మన ప్రాణాలను కాపాడే కవచం అని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడుపరాదని, అది చట్టరీత్య నేరమని పేర్కొన్నారు. అంతే కాక, నడుపుతున్న వ్యక్తికే కాక, ఎదురు వచ్చే వారి ప్రాణాలకు కూడా ముప్పని తెలిపారు. తప్పుదోవన వెళ్లటం, ముగ్గురు కలిసి ఒకే వాహనం పై ప్రయానించడం ప్రమాదకరమని తెలిపారు. అందుకు ట్రాఫిక్ యాక్ట్ కింది వాటికి పడే శిక్షలను కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మెన్ జె.నర్సింహా రెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా.ఎ.మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాథం, ఎస్ఏసి కన్వీనర్ కె.పురుషోత్తం ప్రసాద్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

పరిష్కారానికి నోచుకోలేని సమస్యలపై వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలంటూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో.. డివిజన్ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గ కార్పొరేటర్లు, శానిటేషన్, వీధి దీపాలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూడా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను, కొంతమేర పూర్తి చేసిన పనులను కూడా ఈ ప్రభుత్వ హయాంలో చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అభివృద్ధి పనులు శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడంపై పిర్యాదు చేశారు. ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిందుకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా, కమిషనర్ స్పందించలేదని పలువురు మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల అర్హుల జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమాలకు తావు లేకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించి వారికి అందజేయాలని కోరారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనులపై ఇప్పటికే పలుమార్లు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదనీ వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా కార్పొరేటర్లు వినతి పత్రాలు అందజేశారు.

దోమలను నివారించాలని నిరసన ర్యాలీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో, కలుషిత డ్రయినేజీ నీరు చేరి, గుర్రపు డెక్కవల్ల దోమల బెడద తట్టుకోలేక.. పరిసర 9 కాలనీల సొసైటీ సభ్యులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఆల్విన్ కాలని డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, పలువురు కాలనీ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలనీలలో ఉంటున్న ప్రజలు, దోమల వల్ల అనారోగ్య పాలై రోగాల భారిన పడుతున్నప్పటికి.. స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని సతీష్ రావు అన్నారు. ఎల్లమ్మ చెరువులో నామ మాత్రంగా వచ్చి దోమల మందు కొట్టడం వల్ల పరిష్కారం జరుగదని, చెరువులో ఉన్న గుర్రపుడెక్క తొలగించి, మురికి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా దోమల మందు కొట్టాలని అధికారులను డిమాండ్ చేసారు. స్థానిక తులసి వనం, నవోదయ, రామ్కీ పర్ల్, శిల్ప బృందావన్, విజయనగర్ కాలనీ, హెచ్ఎంటి కాలనీ, జయ నగర్, శుభోదయ కాలనీ, మాధవి నగర్ కాలనీల ప్రజలు స్థానిక నాయకులకు, అధికారులకు సమస్యని పరిష్కరించి దోమల బారి నుంచి కాపాడాలని, ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టిం చుకునే నాథుడే లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు కండ్లు తెరచి ఎల్లమ్మ చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి దోమల సమస్యని పరిష్కరించాలని సతీష్ రావు డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యేను పరామర్శించిన వల్లారపు శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

బుధవారం డెహారాడూన్‌లో హార్ట్ స్ట్రోక్‌కి గుర్రై స్టంట్స్ వేయించున్న మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను టీడీపీ సికింద్రాబాద్ నియోజక వర్గం ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ గురువారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మారావుగౌడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్‌తో పాటు తెదేపా సీతాఫలమండీ డివిజన్ అధ్యక్షుడు జీవి క్రిష్ణ, తెదేపా సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, చిరంజీవి రాజు, తెదేపా రాష్ట్ర నాయకురాలు శశిరేఖ, బుపిన్ ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



నవతెలంగాణ-కంటోన్మెంట్

రోడ్డు భద్రత మాసోత్స వాల్లో భాగంగా మారేడుపల్లి ట్రాఫిక్ సీఐ భాస్కర్ ఆర్టీసీ డ్రైవర్లకు గురువారం బలంరాయి చౌరస్తాలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి ట్రాఫిక్ ఎస్సై హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



- పెండింగ్‌లో ఉన్న పనుల చేయాలని కోరిన కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న హిందూ స్మశాన వాటికలు, ముస్లిం స్మశాన వాటికలకు కావలసిన నిధులు మంజూరు చేయాలని, వర్షం నీరు వలన పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సెంట్ ఆండ్రోస్ స్కూల్ నుంచి ముస్లిం మైనార్టీ స్కూల్ వరకు బాక్స్ నాలా నిర్మించడానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇంకా పలు కాలనీలలో, బస్తీలలో కొత్త సీసీ రోడ్లు మంజూరు చేయాలని, డివిజన్‌లో ప్రధాన మెయిన్ రోడ్డు దుబాయ్ గేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, అస్మత్ పెట్, ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రియదర్శిని హోటల్ చెక్‌పోస్ట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.

పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని
- మహీంద్రహిల్స్ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం సందర్శన
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని అన్నారు. గురువారం మహీంద్రహిల్స్ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తరగతి ఉత్తీర్ణత జీవితంలో స్థిరపడడానికి తొలిమెట్టు అని, ప్రతి విద్యార్థి పభుత్వం కల్పిస్తున్న ఉపకార వేతనాలు, సౌకర్యాలను, సద్వినియోగం చేసుకొని ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తీర్ణత సాధించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్, కంపాస్ బాక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్, బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్టు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదనీ, భయం వల్ల చదివింది మర్చిపోతారన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే పరీక్షల్లో ఫలితాలు సాధిస్తారన్నారు. పదవ తరగతి పరీక్షలకు ఇంకా 60 రోజులు ఉన్నందున ప్రణాళిక బద్ధంగా, ఏకాగ్రతతో చదవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్, ఉపసం చాలకులు జి ఆశన్న, సహాయ వెనుకబడిన సంక్షేమ అధికారులు నరసింహులు, సంజీవులు, కృష్ణమూర్తి, నీరజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా జరగాల్సిన చెక్కుల పంపిణీ నాలుగు గోడల నడుమ ఎందుకు?



- కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-బేగంపేట్

కులాలు, మతాలు, జాతి, పార్టీలకి అతీతంగా అర్హులైన ప్రతీ పేదవారి మొహంలో చిరునవ్వులు నింపే ఉద్దేశ్యంతో కొనసాగిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుంటే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కేవలం తమ వారికి లబ్ది సమకూరేలా వ్యవహరిస్తున్నారని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. బహిరంగంగా జరగాల్సిన చెక్కుల పంపిణీ కార్యక్రమం నాలుగు గోడల నడుమ ఎందుకు చేపట్టారో తలసాని ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో భాగం పంచుకునే అర్హతలేదా, ఇది ప్రజల కార్యక్రమమా లేక పర్సనల్ కార్యక్రమమా అని మండిపడ్డారు. ఈ ప్రెస్ మీట్‌లో సనత్ నియోజకవర్గంలోని డివిజన్ నాయకులు ఎస్‌ఎస్‌రావ్, గంటా సుధీర్, త్రికాల మనోజ్, ప్రతాప్ నాయక్, మధు గౌడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోండి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా మీరు మీ వ్యాపారాలు నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుట్‌పాత్ వ్యాపారులను కోరారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులను అధికారులు తొలగిస్తున్నారని రెండు రోజుల క్రితం ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యేనును కలిసి తమ బాధలను విన్నవించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం నార్త్ జోన్ జీహెచ్‌ఎంసీ కమిషనర్, ట్రాఫిక్ ఏసీపీ, ఇతర అధికారులతో సమావేశమై ఫుట్‌పాత్ వ్యాపారులలో అధికశాతం మంది నిరుపేదలని, వారి ఉపాధిని దూరం చేసి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేయొద్దని వివరించారు. మానవతా దృక్పదంతో వ్యవహరించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకునే విధంగా క్షేత్రస్థాయిలోకి వాళ్లకి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. దీంతో గురువారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఇతర అధికారులతో కలిసి మోండా డివిజన్ పాలికా బజార్ చౌరస్తా, మోండా మార్కెట్, రాంగోపాల్ పేట డివిజన్‌లోని అంజలి టాకీస్ దర్గా, పీజీ రోడ్, మినిస్టర్ రోడ్, బేగంపేట డివిజన్‌లోని జవహర్ జనతా, ఓల్డ్ కస్టమ్ బస్తీ ప్రాంతాలలో పర్యటించి ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఉద్దేశపూర్వకంగా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయరని, కొందరు రోడ్లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేసుకుంటూ వాహనదారులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కల్పించకుండా తమ వ్యాపారాలను చేసుకుంటే ఎవరికి ఎలాంటి అభ్యంతరం ఉండదని అన్నారు. అధికారులకు సహకరించాలని చెప్పారు. ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి కొందరు రోజువారి అద్దెలు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఎవరికి అద్దెలు చెల్లించవద్దని పేర్కొన్నారు. త్వరలోనే ఫుట్‌పాత్ వ్యాపారులకు ఫోటోతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, కిషోర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు

- ప్రస్తుతం రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే
- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్
- లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయంల పరిధిలోని 17 మంది లబ్దిదారులకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ గురువారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారఖ్ తహశీల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, ముఖ్యంగా ప్రస్తుతం రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే అవుతుందన్నారు. ఈ సర్వే విషయంలో ప్రజలు అవగాహన లేక ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రజాపాలనలో, ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు అర్హులేనా కాదా అని నిర్ధారించటం కోసం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి పర్యవేక్షణలో సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికి కేవలం 25 శాతం మాత్రమే సర్వే పూర్తయిందని, ఇంకా 75 శాతం సర్వే పూర్తి అవ్వల్సి ఉందని ఇందుకోసం ఇంకా 10 నుంచి 15 రోజుల సమయం పడుతుందని ఆయన తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత అర్హులైన వారిని లబ్ది దారులుగా ప్రకటిస్తారని వెల్లడించారు. ఇప్పుడు జాబితాలో పేరు లేని వాళ్లు, దరఖాస్తు చేసుకోని వాళ్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్రూం ఇండ్లు కేటాయింపు నిరంతర ప్రక్రియ అని, ఇప్పుడు లిస్ట్‌లో పేరు లేని వారికి తరువాతైన పథకం అందుతుందన్నారు. అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడటం తన బాధ్యత అని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాటు తహశీల్దార్ భీమయ్య గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

- కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చారి కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు సభ్యత్వం తీసుకోడానికి సుముఖత చూపించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా.కోట నీలిమ సంతోషం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కు సోనియా గాంధీ ఒక మహిళ. తెలంగాణా ఇచ్చింది కాంగ్రెస్, తెలంగాణ తెచ్చింది సోనియమ్మ, కేంద్రంలోని బీజేపీకి ఘట్టిపోటీనిస్తూ ప్రజల హక్కులకోసం పోరాడే ఒకేఒక పార్టీ కాంగ్రెస్, మహిళలకి పెద్ద పీటవేస్తూ మహిళా శక్తిని చాటిచెప్పాలనేదే కాంగ్రెస్ సంకల్పం. అని కోటా నీలిమా అన్నారు. మహిళలకి మర్యాదనిచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ అందుకే ఈరోజు పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకొచ్చి బేషరతుగా కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారనేది గురువారం జరిగిన కార్యక్రమమే ఓ ఉదాహరణ అని ఈ సందర్భంగా అమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న పుకారు జోరుగా ఉందని మీడియా ప్రశ్నకు స్పందనగా, పుకార్లని మీతో సహా ప్రజలందరికీ తెలుసుననీ, అధికారంలో లేక, సమైఖ్య కాంగ్రెస్‌ని ఇటువంటి పుకార్లతో విడదీయాలన్న నీచమైన దుర్బుద్ధి తప్ప మరొకటికాదని అన్నారు. ఈ పుకారుతో పురపాలక సంఘం అధికారులని, ఇతర ప్రభుత్వాధికారులని భయపెడుతూ తమ పబ్బంగడుపుకుంటున్నారనీ, ప్రజలెవరూ వీటిని నమ్మవద్దని డా.నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మహిళా ప్రెసిడెంట్ కవిత, డివిజన్ మహిళా నాయకులు, సీనియర్ లీడర్‌లు పాల్గొన్నారు.

బైబిల్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డే



- ముఖ్య అతిథిగా పాల్గొన్న హబీబా సుల్తానా

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ ఎన్‌ఆర్‌ఆర్ పురం సైట్ నాలుగు, ఐదులో గల పీజేఆర్ గ్రౌండ్‌లో ఎల్-షధయ్ బైబిల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ సతిమని హబీబా సుల్తానా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ మ్యాథుస్, స్వామీ దాస్, చెన్నయ్య అలియాస్ ప్రభుదాస్ ప్రముఖ పాస్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ భవిష్యత్ నారా లోకేష్



- తలారి.శ్రీనివాసరావు
- నారా లోకేష్ బర్త్ డే సందర్భంగా దుప్పట్ల పంపిణీ, మొక్కలు నాటి రోగులకు బ్రేడ్స్ పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

టీడీపీ భవిష్యత్ నారా లోకేష్ అని అఖిల భారత సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి. శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి, జాతీయ టీడీపీ ప్రధాన కార్యదర్శి అయన నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ బుధవారం రాత్రి బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, నిమ్స్, గాంధీ ఆస్పత్రి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట బాణసంచ కాల్చి, మిఠాయిలు పంచుకొని కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. గురువారం ఉదయం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మొక్కలు నాటి, తార్నాకలో ఉన్న ఆర్టీసీ ఆస్పత్రిలో రోగులకు బ్రేడ్స్, పండ్లు పంపిణీ చేశారు. నారా లోకేష్‌కి వెంకటేశ్వర స్వామి, కుటుంబ సభ్యుల, ఆశీర్వాదం ఉండాలని ప్రజా జీవితంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అయిన యువగళంతో విమర్శిస్తున్న నోళ్లు మూయించిన ఫైటర్ అని, సభ్యత్వ నమోదు కోటి దాటి రికార్డ్స్ సృష్టించడం వెనుక లోకేష్ కృషి శ్రమ దాగి ఉన్నట్టు తలారి. శ్రీనివాసరావు అన్నారు. సభ్యత్వం కలిగి ఉన్న కార్యకర్తలకు భీమా ఇవ్వడం హర్షణీయం అన్నారు. రానున్న రోజుల్లో లోకేష్ నాయకత్వంలో ముందుకు పోతాం అన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఎన్ ఫ్యాన్స్, ఓయూ విద్యార్థులు వేమూరి. నరేష్, రాము, వినయ్, ప్రశాంత్, ప్రణీత్, తాన్వేష్, విష్ణు, గోపి, సందీప్, గోపీ, గణేష్, టి.నాగరాజు, సంజయ్, రాము పాల్గొన్నారు.

బోరబండలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ బంజార నగర్‌లో కొమరం భీమ్ కమ్యూనిటీ హాల్ లైటు హౌజ్, ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రయినింగ్ కార్యక్రమాన్ని బోరబండ కార్పొరేటర్ సతిమని హబీబా సుల్తానా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ యూసఫ్ గూడా సర్కిల్ - 19 డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, లైట్ హౌజ్ క్లస్టర్ హెడ్ ఆర్తి, స్పందన, కౌన్సిలర్ శ్రీనివాస్, సిద్ధు, బోరబండ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.సర్దర్ జమాల్, బండారి ఆశోక్ డివిజన్ అధ్యక్షులు, బస్తీ అధ్యక్షులు అనంద్, చెట్టి దేవెందర్, వెంకటేష్, కాసుల మహేష్, బాలరాజ్ గౌడ్, శంకర్, జీవన్, సుధాకర్ రెడ్డి, లక్ష్మి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత పాటించని వారిపై కఠిన చర్యలు

- ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా గురువారం మైత్రివనం, పరిసర ప్రాంతాలలో ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేసి, జాతీయ రహదారి భద్రత పాటించని వారిని గుర్తించి వారి వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ..ప్రాణాపాయం (హెల్మెట్ లేకుండా, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రవ్, అధిక వేగం, నిర్లక్ష్యంగా నడపడం వంటి ఉల్లంఘనలు) కలిగే విధంగా వాహనాలను నడిపే వారిని గుర్తించి, వారి వాహనాలను తాత్కాలికంగా జప్తు చేశారు. వారు చేసే తప్పిదం వల్ల కలిగే నష్టాలను వివరించిన అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి తర్వాత చలాన్లు వేసారు. 'నిండు జీవితానికి సురక్షిత ప్రయాణం' అనే అంశంతో ఉల్లంఘన దారులకు గతంలో జరిగిన వివిధ రోడ్ ప్రమాదాలు, వాటి పర్యవసానంగా ప్రస్తుతం కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న భాదలను తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకండి. వారు చేసే ప్రమాదాలకు భాద్యులుగా మిగలకండి అని తల్లిదండ్రులను హెచ్చరించారు.

నిజమైన గౌరవం ఆత్మ గౌరవంతోనే మొదలు

- హెరిటేజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు కేఆర్ గంగాధరన్
- ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుక



నవతెలంగాణ-బేగంపేట్

నిజమైన గౌరవం ఆత్మగౌరవంతోనే మొదలవుతుందని హెరిటేజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు కేఆర్ గంగాధరన్ తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాంతీయ వనరుల శిక్షణా కేంద్రం (హైదరాబాద్)తో కలిసి గురువారం 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' వేడుకలను సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ హరి హర కళా భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే వీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్ గౌరవం చుట్టూ కేంద్రీకృతమై ఉందన్నారు. మనల్ని మనం గౌరవించుకున్నప్పుడు.. సహజంగానే ఇతరుల నుంచి గౌరవాన్ని ప్రేరేపించగలమని చెప్పారు. వయోవృద్ధులు జాతీయ సంపద అని, సమాజానికి అమూల్యమైన వనరు అని, సీనియర్ సిటిజన్లపై వయోవృద్ధుల జాతీయ విధానం (1999) హైలైట్ చేసిందని తెలిపారు. ఐక్యరాజ్య సమితి కూడా యువతతో సమానంగా వయోవృద్ధులు సమాజ ప్రగతికి సమానంగా తోడ్పడతారని పేర్కొందన్నారు. మన వయస్సును, మన ప్రయాణం, దానితో వచ్చే అమూల్యమైన జ్ఞానాన్ని గర్వించాలన్నారు. వయస్సు అంటే కేవలం పెద్దవారిగా మారడం కాదని, అనుభవాలు, జ్ఞాపకాలు, శ్రేయస్సుతో సమృద్ధిగా పెరగడమని గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద వయస్సులో ఉన్న వ్యక్తులను కలవడంలో ఒక ప్రత్యేకమైన ఆనందం ఉంటుందన్నారు. ప్రత్యేకించి మనం పెద్ద సంఖ్యలో కలిసినప్పుడు ఆ వాతావరణం ఉత్సాహపూరితమైన వేడుకగా మారుతుందన్నారు. ఆత్మీయతతో, ఉత్సాహంతో నిండిన వేడుకగా కనిపిస్తుందన్నారు. ఈ సందర్భాలు మన ఆనందాలను పంచుకోవడానికి, జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి, మన శ్రమలను తేలిక చేసుకోవడానికి అవకాశాలను కల్పిస్తాయన్నారు. జీవితం మన ప్రయాణాన్ని పంచుకునే వారితో కలిసి ఉన్నప్పుడు ఎక్కువగా ఆనందించగలమనే సత్యానికి ఈ సమావేశాలు గుర్తింపు ఇస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఆసరా సెంట్రల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి


- జాజుల శ్రీనివాస్ గౌడ్
- జనవరి 30న బీసీ విద్యార్థుల సమర శంఖారావం



నవతెలంగాణ-ఓయూ

పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు ప్రయివేటు యూనివర్సిటీలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీన ఇందిరాపార్క్ వద్ద నిర్వహించలని తలపెట్టిన బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సభ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ గత ఐదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా అలసత్వం వహిస్తుందని మండిపడ్డారు. ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమై మళ్ళీ వాళ్ళ కులవృత్తులు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. మరికొంత మంది తమరక్తాన్ని అమ్ముకొని ఫీజులు చెల్లిస్తున్న దుస్థితి అంటూ అయిన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. బడుగు బలహీన వర్గాలకు చెందిన బట్టి విక్రమార్క ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ బహుజనులకు న్యాయం జరగడం లేదు. వేల కోట్ల బడ్జెట్‌ను కొంతమంది కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారే తప్ప పేద విద్యార్థులను విద్యకు మాత్రం కేటాయించడం లేదన్నారు. 30న జరిగే సమర శంఖారావం వరకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంలో సరైన నిర్ణయం తీసుకొని ఎడల విద్యార్థులచే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, నరసింహ నాయక్, నాగరాజు గౌడ్, మహేష్, హరి, వెంకటేష్, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.





మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, సీఎఫ్ఐ చైర్మెన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో 47 ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ అండర్-19, 20 20 లీగ్ క్రికెట్ మ్యాచ్ టోర్నమెంట్ కొనసాగుతోంది. గురువారం క్వాటర్ ఫైనల్ మ్యాచ్ శ్రీలంక వర్సెస్ తమిళనాడు మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా హైదరాబాద్ పీసీ సీ.వీ. ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ కొద్ది సేపు బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. సీపీ చేసిన బ్యాటింగ్, బౌలింగ్ ప్రతొక్కరిని ఆకట్టుకున్నాయి. ప్రతి ఒక్కరు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, సీఎఫ్ఐ ప్రెసిడెంట్ సయ్యద్ సాదిక్ పాషా, సీఎఫ్ఐ సెక్రటరీ జనరల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామ సభల్లో గందరగోళం

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం, నూతన్ కల్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. గ్రామసభ ప్రారంభం కాగానే వివిధ శాఖల అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, కొత్తరేషన్ కార్డులు, రైతు భరోసాకు సంబంధించిన పేర్లు చదవగానే ప్రజలు మూకుమ్మడిగా వేదిక వద్దకు వెళ్లి అధికారులను నిలదీస్తూ పేర్లు ఎవరు ఫైనల్ చేశారని నిలదీశారు. అర్హులైన వారికి కాకుండా అనర్హులకు వచ్చాయని ఇందిరమ్మ కమిటీ సభ్యుల ముందే అరుపులు కేకలతో రసాభసా చేశారు. లిస్టులో పేర్లు రానివారు మళ్ళీ తిరిగి దరఖాస్తు చేసుకోవాలని చెప్పూ వెళ్లిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా దరఖాస్తులు తీసుకొంటూ జిరాక్స్ వాళ్ళని బ్రతికిస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామ కార్యదర్శి కొత్తగా అప్లికేషన్లు ఇవ్వాలని బ్రతిమిలాడుతూ చెప్పడంతో కొంతవరకు గొడవ సద్దు మణిగింది. ఆ తర్వాత మళ్ళీ కొంతమంది కొత్తగా దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. గ్రామంలోని పశువులకు ఎలాంటి దారిలేకుండా దారిని మూసివేసి దాదాపు 40 ఎకరాల వ్యవసాయ భూమిని ఫార్మ్ లే అవుట్ పేరుతో ప్రభుత్వానికి ఎలాంటి టాక్స్‌లు చెల్లించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినా వారి భూములను వ్యవసాయ భూములుగానే చూపించడం శోచనీయమన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ కాలనీలో స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంద జయన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఎం.ఆర్.పి, నాయకులున్నారు.

'ఐహెచ్ఆర్ఓ రాష్ట్ర అధ్యక్షుడిగా మహమ్మద్ అఫ్జల్'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్ఓ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్గొండకు చెందిన మహమ్మద్ అఫ్జల్ ను నియమించినట్లు ఆ సంస్థ వరల్డ్ చైర్మెన్ డాక్టర్ నేమ్ సింగ్ ప్రేమి తెలిపారు.ఆదివారం హైదరాబాద్ ఐహెచ్ఆర్ఓ సౌత్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో 45 మంది సభ్యుల రాష్ట్ర ప్యానల్ ను ఏర్పాటు చేశారు.అనంతరం చైర్మన్ నేమ్ సింగ్ ప్రేమి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ అవగాహన పెంపొందించడం, శాసనసభ, న్యాయ వ్యవస్థ రంగాల్లో హక్కుల కోసం వాదించడంపై కృషి చేయాలని, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహమ్మద్ అఫ్జల్ కు సూచించారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అఫ్జల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి పెద్ద బాధ్యత అప్పజెప్పి నందుకు నీతి, నిజాయితీతో బాధ్యతతో తన వంతు కర్తవ్యాన్ని, ప్రశ్నించే తత్వాన్ని ప్రజల్లో అవగాహన తీసుకొస్తానని, ఇంతటి పదవి బాధ్యతలు అప్పగించిన ఐహెచ్ఆర్ఓకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఎస్‌హెచ్ ఆర్సీ చైర్మెన్, డాక్టర్ చంద్రయ్య, సౌత్ చైర్మెన్ సయ్యద్ కాజీమ్ అలీ, హష్మీ, నల్గొండ అధ్యక్షులు సయ్యద్ సల్మాన్ ఖాద్రి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని మాజీ మంత్రి ,మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు.గురువారం గోధుమకుంట గ్రామానికి చెందిన సామల అంజిరెడ్డికి రూ. 10 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గోధుమకుంట గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తిని కఠినంగా శిక్షించాలి

- మహిళలకు, భద్రత కరువైంది : ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద



నవతెలంగాణ-ఉప్పల్/కాప్రా

దేశంలో, రాష్ట్రంలో, మహిళలకు భద్రత, కరువైందని, రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం వినోద అన్నారు. గురువారం ఉప్పల్‌లో ఐద్వా ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడ మీర్ పేట్‌లో భార్యను అతి ఘోరంగా చంపిన భర్త గురుమూర్తిని ఉరితియ్యాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా హత్యలు లైంగికదాడులతో అనేకమంది మహిళలు చనిపోతున్నారని.. వీటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళల మరణాలు ఆగడం లేదు వీటిని అరికట్టాలని కోరారు. ఈ మరణాలకు కారణం మద్యం, డ్రగ్స్, గంజాయి, అని వీటిని సేవించి సైకోలవుతున్నారన్నారు. వీటిపై సీరియస్‌గా చర్యలు తీసుకొని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఏకశిల నగర్
పేదల ప్లాట్లకు రక్షణ కల్పించాలి

- పేదలను మోసగిస్తున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చింతల యాదయ్య
- కొర్రెముల బాధితులను పరామర్శించిన పార్టీ నేతలు



వి శ్రీనివాస్ అనే బాధితుడు సీపీఐ(ఎం) బృందం ముందు బోరున విలపిస్తూ తన ఆవేదనను తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వి శ్రీనివాస్ సర్వే నెంబర్ 809, 200 గజాల ప్లాటును 2008లో తీసుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ పర్మిషన్, ఎల్‌ఆర్‌ఎస్ బోర్ పర్మిషన్, కరెంటు పర్మిషన్ తీసుకున్నాడు. కరెంట్ కోసం రూ.36వేల డీడీ కట్టి పర్మిషన్ తీసుకున్న తర్వాత వేసిన స్తంభాలను ఉడదీశారు. బ్యాంకు లోను రూ.30 లక్షలు శాంక్షన్ అయ్యింది. రూ. 12 లక్షలు బ్యాంకు నుంచి రిలీజ్ అయ్యింది. అయితే ఇల్లు పూర్తి అయిన తర్వాత జేసీబీతో గ్రామపంచాయతీ వారు కూల్చారు. దీనిపై అధికారులను అడగగా పర్మిషన్ ఉన్నది తిరిగి నిర్మాణం చేసుకోవాలని చెప్పడంతో అతను మళ్లీ నిర్మించుకున్నాడు. అయితే బిల్డర్ వెంకటేష్ గుండాలను రప్పించి అతని ఇల్లుని కూల్చివేశాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నవతెలంగాణ-ఘట్‌కేసర్

పోచారం మున్సిపాలిటీ పరిధిలో కొర్రెముల ప్రాంతంలో పేదల భూములను కబ్జా చేస్తూ మోసగిస్తున్న బిల్డర్ వెంకటేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్కడి పేదలకు రక్షణ కల్పించాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చింతల యాదయ్య, పార్టీ మం డల కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన భూ కుంభకోణం పై పార్టీ నాయకుల బందం పోచారం మున్సిపల్ కొర్రెముల గ్రామ పరిధిలోని ఏకశీలనగర వెంచర్ ప్లాట్ల బాధితులను గురువారం కలిసి అండగా ఉంటా మని ప్రకటించారు పేదల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1985లో, 149 ఎకరాలలో 2187 ప్లాట్లు చేసి అమ్మారని తెలి పారు. వెంచర్ చేసి సామాన్య ప్రజలకు అమ్మి అధికారులు , బిల్డర్ వెంకటేష్ ఏకమై దొంగ పాసుబుక్కులు సష్టించారని.. బ్యాంకులో రూ. 40 కోట్ల అప్పు తీసుకున్న వెంకటేశ్‌పై ల్యాండ్ గ్రాఫింగ్, చీటింగ్ కేసు నమోదు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. 2187 మంది కొనుగోలు చేసిన ప్లాట్లను దొంగ పాసుబుక్కులు సష్టించి రౌడీలను గుండాలను పెట్టి ప్లాట్ల యజమానులను భయభ్రాం తులకు గురి చేసి ప్లాట్లను కాజేయాలని చూస్తున్నారని తెలిపారు.

సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ పర్మిషన్ ఇచ్చిన అప్పటి కొర్రెముల గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత యాదవ్‌ను ఉద్యోగంలో నుండి తొలగించాలని, పాస్ బుక్కులను జారీచేసిన ఎమ్మార్వోను సస్పెండ్ చేయాలని, ప్లాట్ల యజమానులకు భరోసా కల్పించి వీధి రౌడీలు రాకుండ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు చల్లగుండ అరుణ, కే అలివేల, జి నాగమణి, బి సునీత, ప్లాట్ల బాధితులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, కమిషనర్ డాకు నాయక్
- జవహర్‌నగర్‌లో ప్రజాపాలన సభలు



నవతెలంగాణ - జవహర్ నగర్

ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తా మని జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్ అన్నారు. గురువారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమలలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు చేరుతాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు, అర్హత కలిగిన వారికి తప్పకుండా అందుతాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎడ్ల శ్రీనివాసరెడ్డి , చింతల ప్రేమల శ్రీనివాస్, కుతాడి సాయి, బింగి లావణ్య సతీష్ గౌడ్ ,గొడుగు వేణు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన సభ రసాభాస

- ప్రోటో కాల్ పాటించలేదని కార్పొరేటర్ అభ్యంతరం
- కమిషనర్, పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ 19వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ లో నిర్వహించిన ప్రజా పాలనా సభ ప్రోటో కాల్ రగడతో రసాభాస అయ్యింది. చివరికి కమిషనర్, పోలీసుల జోక్యం తో సద్దుమణిగింది. వివరాల్లోకెళ్తే.. ప్రజా పాలనా సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లో ప్రోటో కాల్ పాటించలేదని కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అభ్యంతరం తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన అధికారిక సభలలో గతంలో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఫోటో పెట్టి ప్రోటో కాల్ పాటించామని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ రాజేందర్ ఫోటోలు లేవని తెలిపారు. అయితే స్థానిక కాంగ్రెస్ మహిళ నాయకురాళ్లు ఆమెను అడ్డుకోవడంతో ఒక్కసారిగా సమావేశం రసాభాసగా మారింది. ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంతో అక్కడే ఉన్నా కమిషనర్ డాకు నాయక్, పోలీసుల సహకారంతో సమస్యను సద్దుమణిగేలా చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో మల్లారెడ్డి ప్రత్యేక చొరవతో డ్రయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, అభివద్ధి పనులు జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడిచినా ఒక్క పని కూడా చేయలేదని ఆరోపించారు. ప్రజా పాలనా సభలు అధికారిక సభలా ? లేకా కాంగ్రెస్ పార్టీ సభలా??? అని ప్రశ్నించారు. పక్కనే ఉన్నా నాగారం మున్సిపాలిటీలో ప్రోటో కాల్ పాటించారని, మరి జవహర్‌నగర్‌లో ఎందుకు పాటించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకున్నాం : కమిషనర్ డాకు నాయక్.

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన డిజైన్ తోనే జవహర్‌నగర్‌లోని అన్ని వార్డులలో ప్రజా పాలనా సమావేశాలు నిర్వహిస్తున్నామనికమిషనర్ డాకు నాయక్ తెలిపారు. అందులో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయలేదన్నారు.

పథకాల కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేయాలి



- మాజీ మేయర్ మేకల కావ్య.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎన్ని సార్లు దరఖాస్తు చేయాలంటూ జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య ప్రశ్నించారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ 15వ వార్డులో నిర్వహించిన ప్రాజాపాలన వార్డు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలని, ప్రజాపాలనలో ఒక అప్లికేషన్, మీ సేవలో ఇంకో అప్లికేషన్ పెట్టామని, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నారని, కానీ పథకాలు ఎప్పుడు అమలువుతాయో తెలియని అయోమయ పరిస్థితిలో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ చేయకపోవడం, కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని తెలిపారు. ఇకనైనా తొందరగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరారు.

మల్కాజిగిరిలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురి ఎక్స్ టెన్షన్ లో రూ. ఒక కోటి అయిదు లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్ త్వరలోనే ఏర్పాటు కానున్న సందర్భంగా అధికారులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సర కాలం గా నియోజకవర్గం పరిధిలో జరగవలసిన అభివద్ధి పనులక ప నిధులు మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, దాని ఫలితంగానే ఇప్పుడు రూ. కోటి అయిదు లక్షల బాక్స్ డ్రైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇక పై అన్ని పనులను ప్రారంభించుకునే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతా మని, ప్రభుత్వంలో నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరిగిందని చెప్పారు. ఈ.ఈ మహేష్, మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, వాసగోని శ్రీనివాస్ గౌడ్, మురుగేష్, సతీష్, రాములు, రవీందర్, వేణు యాదవ్, శ్రీకాంత్, సురేష్ యాదవ్, శ్రీనివాస్ యాద వ్, నాగరాజు, వి.వి.ఎస్.ఎన్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో బోడుప్పల్ అగ్రగామి



- మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- రూ.9.28 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధిలో అగ్రగామిగా పరుగులు పెడుతుందని కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధి లోని 1,2,3,4,6,7,9,25,26 డివిజన్లలో రూ.9.28. కోట్ల నిధులతో పలు రకాల అభివృద్ధి పనులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మేయర్‌గా తనకు వచ్చిన తక్కువ సమయంలోనే అనుకున్న దానికంటే ఎక్కువ అభివృద్ధి చేసేందుకు కృషి చేశానని, దానికి సహచర కార్పొరేటర్ల సహకారం, అధికారుల తోడ్పాటు మరువలేనిదని అన్నారు. బోడుప్పల్‌ను అన్ని రంగాల్లో అభివద్ధి చేసేందుకు బహత్తర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త లక్ష్మి రవి గౌడ్, కొత్త చందర్ గౌడ్,కాటేపల్లి లత రాంచందర్ రెడ్డి,మోదుగు లావణ్య శేఖర్ రెడ్డి,జక్కా పద్మ రాములు, పొద్దుటూరి శోభరాణి వెంకటేష్ గుప్త, మున్సిపల్ కమిషనర్ జీ.రామలింగం, కాంగ్రెస్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్లు కుర్రి శివ శంకర్, కొత్త ప్రభాకర్ గౌడ్, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కాలనీ అధ్యక్షులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి..
మేయర్‌కు కార్పొరేటర్ పన్నాల వినతి



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్ పరధిలోని ఓల్డ్ మల్లాపూర్‌లోని పలు కాలనీలల్లోని అంతర్గత రోడ్లు చాలా దారుణంగా మారినవని, చాలా సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయని.. సమస్య పరిష్కారంగా సుమారు రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేసి పరిష్కారానికి చొరవ చూపగలరాని స్థానిక కార్పొరేటర్ పరిణాల దేవేందర్ రెడ్డి మేయర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

- పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేసిన చింతల నరేష్ ముదిరాజ్..





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

టీడీపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ 42వ జన్మదినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ సఫిల్ గూడ చౌరస్తా లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత రాష్ట్ర నాయకులు చింతల నరేష్ ముది రాజ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు డాక్టర్ పొగాకు జైరాం చందర్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 500 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైరాం చందర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేత అని, ఆయన ఆశయాలను నారా లోకేష్ నేటి తరానికి అందిస్తూ, అభివద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. నారా లోకేష్ యువతకు ఆదర్శంగా నిలుస్తూ, అభివద్ధి, ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నారని, ఆయన నాయకత్వం కేవలం రాష్ట్రానికి మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా తెలుగు ప్రజలకు గర్వకారణంగా మారిందని, యువతకు ఉద్యోగ అవకాశాల ను పెంచేందుకు ఆయన చేపడుతున్న చర్యలు అభినందనీయమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మల్కాజిగిరి పార్లమెంటరీ అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్, నాయకులు బత్తిని నరసింహ గౌడ్, ప్రణయ చంద్ర పలకల, పితాని సత్యనారాయణ, శివానంద్, హరి, వెంకటేష్, టీజీకే మూర్తి, రాంబాబు, రాములు యాదవ్, సాంబమూర్తి గౌడ్, సతీష్, నిర్మల గౌడ్, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు చేసిన ప్లాట్లా.. అయితే మరిచిపోండి'

- తమ ప్లాట్ పై దౌర్జన్యం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు శోభ,ధనుంజయ బాయ్‌ల ఆవేదన



నవతెలంగాణ-బోడుప్పల్

పైసా పైసా కూడబెట్టి పిల్లల భవిష్యత్ కోసం కొనుగోలు చేసిన ప్లాట్ (ఇంటి స్థలం) జోలికి వస్తే అంతుచూస్తామని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు జోక్యం చేసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు శోభ, ధనుంజయ బాయ్ లు కోరారు. వివారాల్లోకి వెళితే బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 76/6,76/7,76/8 లో 1978 లో భూ పట్టా దారులు లే అవుట్ చేశారు. అందులో నుంచి దయానంద్ అనే వ్యక్తి జీపీఏ చేసుకుని ప్లాట్ నెంబరు 180 శోభకు, 109 ధనుంజయ బాయ్‌లకు విక్రయించాడు. అయితే పిల్లలు చదువుల కోసం భవిష్యత స్తలో వారి పెండ్లిల ఖర్చుల కోసం పెట్టుబడిగా కొనుగోలు చేసిన వీళ్ళు వారి పిల్లలు విదేశాలలో ఉంటుండంతో అక్కడే పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో స్వదేశానికి వచ్చిన సందర్భంలో వారి ఇంటి స్థలాలు ఎలా ఉన్నాయో చూసుకునేందుకు గాను అక్కడికి వెళ్ళి చూడగా కాలనీకి అక్కడ తాత్కాలిక షెడ్ వేసి ఉంది. అది చూసి ఇరుగు, పొరుగు వారిని అడగ్గా కాలనీకి చెందిన స్థలమని..మీరు ఇక్కడ నుండి వెళ్ళి పోవాలని లేనిపక్షంలో మీ అంతు చూస్తామని కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు బెదిరిం పులకు పాల్పడ్డారు. దీంతో చేసేదేమీ లేక సదరు వద్ద మహిళలు భూమి పట్టదారుల వారసులైన కొత్త నవీన్ యాదవ్‌ను ఆశ్రయించి అతనికే ఏజీపీఏ చేశారు. దాంతో అతను సదరు స్థలం వద్దకు వెళ్ళగా అతన్ని కూడా కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు భయభ్రాంతులకు గురి చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చేసేదేమీ లేక జరిగిన విషయంపై మేడిపల్లి పోలీసులను ఆశ్రయించి బెదిరింపులకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జనవరి 26 నుండి ప్రారంభించే సంక్షేమ పథకాల లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులపై 13,14,15,16,17, 18వ వార్డులో వార్డు సభలు నిర్వహిం చారు. 14 ,17వ వార్డుల్లో జరిగిన వార్డుసభలో ముఖ్య అతిథిగా చైర్మెన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ వార్డుల వారీగా అర్హుల జాబితాపై అభ్యంతరాలు గురించి వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేరు రాని వారు వార్డు సభలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ సమావేశాలలో ,కమిషనర్ భాస్కర్ రెడ్డి,మేనేజర్ చంద్ర శేఖర్, డి.ఈ రఘు, వార్డు కౌన్సిలర్స్ వార్డు అధికారులు,పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలి : కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

ఇంటింటి సర్వేలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. గురువారం చిల్కానగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో, బస్తీల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డ్ ఇంటింటి సర్వేను జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే చేసే సిబ్బంది లిస్టులో ఉన్న ప్రతి ఒక్కరి ఇంటిని సందర్శించాలని, సర్వేను పారదర్శకంగా జరపాలని సూచించారు. సర్వేలో ఎటువంటి అవకతవకులు జరగకుండా చూడాలని ఆదేశించారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ సంస్మరణ సభ



నవతెలంగాణ-కాప్రా

సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సంస్మర ణ సభ జరిగింది. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. భారతదేశ దాస్య సుంకణాలను తెంచడానికి విప్లవ సైన్యం నిర్మించి ఆజాద్ హింద్ ఫౌజ్ ఆధ్వర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చంద్రబోస్ పోరాడారని అధ్యక్షులుగుర్తు చేశారు. ప్రారంభ సూచికగా విద్యార్థి నాయకులు సంతోష్ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంతోష్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరా టానికి అనేక మంది విప్లవకారులు కృషి చేశారని, అందులో అగ్రభాగాన నేతాజీ ఉంటారని చెప్పారు. నేడు పాలకులు మనువాదాన్ని ముందుకు తీసుకొచ్చి ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారని అన్నారు. అందరం కలిసికట్టుగా మతోన్మాద శక్తులను ఎండగట్టాలని చెప్పారు. ట్రేడ్ యూనియన్ నాయకులు జె చంద్రశేఖర్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ తో కలిసి కెప్టెన్ లక్ష్మీ సెహగల్ యుద్ధభూమిలో నిలిచారని చెప్పారు. స్వాతంత్రానంతరం కెప్టెన్ సెహగల్ తో పాటు అనేకమంది సీపీఐ(ఎం) పనిచేశారని, వారి కుమార్తె సుభాషిని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్నారన్నారు. సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, ఉన్ని కృష్ణ, ఎస్ శ్రీనివాస్, శ్రీనివాసరావు, గణేష్, సంతోష్, శోభ, గౌసియా, కష్ణమ్మ మంగమ్మ సుమిత్ర, రవి, యాదగిరి, గోపి, నర్సింగరావు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ - మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఘనపూర్‌లో ఇటీవల గ్రామ సభ నిర్వహించారు. అయితే గ్రామ సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన ఎంపీడీవో,ఆర్‌ఐ,ప్రత్యేక అధికారి,పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గ్రామస్తులు గురువారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.అయితే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితా తప్పుల తడకగా ఉండడంతో ప్రజలు అధికారులను సభలో ప్రజలు నిలదీశారు. దీంతో సభ మధ్యలో నుండి ఎంపీడీవో, ఆర్‌ఐ,ప్రత్యేక అధికారి,గ్రామ కార్యదర్శి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోనప్పుడు గ్రామ సభలను ఎందుకు పెట్టారని, మధ్యలో వెళ్లిపోయిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు గులయ్యగారి రాజు, సురేష్, లావణ్య, శైలజ, సంతుష, బాలమణి, లలిత, అనితరాణి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తాం

- కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 7వ వార్డులో అభివద్ధి పనులకు పెద్ద పీట వేస్తామని కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం 7 వార్డు ఈశ్వరి పూరీ కాలనీలో రూ. 7 లక్షల వ్యయం తో సీసీ రోడ్ పనులకు కౌన్సిలర్ శంకుస్థాపన చేశారు.అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కషి చేస్తున్నట్టు తెలిపారు. ఉద్దామర్రి మాజి ఉపసర్పంచ్ నల్ల క్రిష్ణ రెడ్డి, గుండు శైలజ మధు గౌడ్,జైపాల్ రెడ్డి సురేందర్ రెడ్డి రమేష్ యాదగిరి కాలనీ వాసులు వెంకటేశ్వర్ రెడ్డి, చిన్నస్వామి విక్రమ్ బాలకష్ణ కుమార్ శ్రీరామ్ శర్మ మురళీ కృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌టెక్ ఉద్యోగి శ్రీనివాస్‌కు అండగా ఏపీరాక్ ఎంప్లాయిస్ యూనియన్

- కార్మికుడిని కష్టకాలంలో ఆదుకోవడం సీఐటీయూ బాధ్యత : సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ - చర్లపల్లి

కార్మికుల హక్కుల కోసం పోరాటంతో పాటు, కార్మికుల కష్ట కాలంలో ఆదుకోవడంలో సీఐటీయూ బాధ్యత తీసుకుంటుందని మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్‌ఆర్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న శ్రీనివాస్ ప్రమాదవశాత్తు కాలు విరిగి చికిత్స పొందు తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ పిలుపుమేరకు ఏపీరాక్ కార్మికులు ముందుకు వచ్చి సహకారాన్ని అందించారు రూ. 16,228 నిత్యావసర సరుకులు ,రూ.27,622 ఆర్థిక సాయం సీఐటీయూ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీరాక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికల నుంచి మొత్తం రూ.43,850 ఆర్థిక సహాయం అందజేశారన్నారు. వీరికి సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అభినందనలు తెలిపారు. సీఐటీయూ కార్మికులకు ఉద్యోగ భద్రత మంచి వేతన సౌకర్యాలు కల్పించడమే కాకుండా, కష్టకాలంలో తోటి కార్మికులకు అండగా ఉండే విధంగా వారిని రాజకీయ చైతన్యంతో సమాజంలో తమ వంతు సహాయం చేసే విధంగా సీఐటీయూ తీర్చిదిద్దుతుందని జె.చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీరాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.మణికంఠ, ఆఫీస్ బేరర్స్ జి.ఎస్. దుర్గాప్రసాదు, మల్లికార్జున్ రెడ్డి, సిహెచ్ ప్రసాద్, చంద్రశేఖర్, జి.రాంబాబు, నాయకులు భాస్కరు, ఎస్.శివ, ఎన్‌ఆర్ టెక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మోయిన్ పాషా తదితరులు పాల్గొన్నారు.



కామ్రేడ్ ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ... ఓ ఉత్సాహం. పార్టీ పట్ల, మహిళా ఉద్యమం పట్ల అచంచల విశ్వాసం. నమ్మిన ఆశయం, లక్ష్యం కోసం కడవరకు నిలిచిన ఆదర్శమూర్తి. కష్టంలో ఉన్న వారిని ఆదుకోవాలని తపించే సేవా మూర్తి. వ్యక్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరిగా కీలకపాత్ర పోషించారు. ఏ వయసు వారితో అయినా ఇట్టే కలిసిపోయే ఆధునిక అమ్మమ్మ. మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ ఉద్యమంలోనూ తన వంతు కృషి చేశారు. త్వరలో సీపీ(ఐ)ఎం రాష్ట్ర నాలుగువ మహాసభలు జరుగబోతున్న సందర్భంగా ఆమె అందించిన స్ఫూర్తి నేటి మానవిలో...

ఆమె జీవితం ఆదర్శప్రాయం

లక్ష్మీదేవమ్మ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి పట్టణంలో పుట్టారు. ఆర్థిక స్థోమత కలిగిన కుటుంబం వీరిది. లేకలేక పుట్టిన లక్ష్మీదేవమ్మను తల్లిదండ్రులు ఎంతో గారాబంగా పెంచారు. ఆమె ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. చిన్నప్పటినుండీ తన చుట్టూ ఉన్న స్నేహితులను కూడగట్టుకుని చదువులోనూ, అల్లరిలోనూ ఓ ప్రత్యేకత కనబరిచేవారు. చదువంటే ఆమెకు చాలా ఇష్టం. పత్రిక, అభ్యుదయ పుస్తకాలు, మహనీయుల చరిత్రలు, నవలలు ఇలా ఏది దొరికినా చదివేవారు. అప్పట్లో ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఉండేది. విద్యార్థులంతా ప్రతివారం అక్కడికివెళ్ళి చదువుతున్నారా లేదా అనే పర్యవేక్షణ కూడా ఉండేది. అందువల్లనే చదవడం ఆమెకు అలవాటుగా మారింది.

నిరంతర అధ్యయనశీలి

పదో తరగతి చదువుతున్న సమయంలో మహబూబ్‌నగర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీహరితో ఆమెకు వివాహం జరిగింది. భర్త ప్రోత్సాహంతో పార్టీలోకి వచ్చారు. 1958లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. అమ్మ నవల, వర్లీ ఆదివాసుల తిరుగుబాటు, జెన్నీమార్క్స్ పుస్తకాలు చదివి ఎంతో ఉత్తేజం పొందారు. ఈ అధ్యయనంతో ప్రజల కోసం పని చేయాలనే సంకల్పం ఆమెలో మరింత పెరిగింది. పిల్లల చదువుల కోసం కొంత కాలం ఉద్యమాలకు దూరంగా ఉన్నా వాళ్లు కాస్త ఎదిగిన తర్వాత పార్టీ అనుమతితో ఉద్యమ జీవితం మొదలుపెట్టారు. 80 ఏండ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో ఆమె ప్రజాశక్తి, మానవి, పార్టీ సాహిత్యం నిత్యం అధ్యయనం చేసేవారు. అజ్ఞాత సోదరి పేరుతో నాటి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మోటూరి హనుమంతరావుగారికి పార్టీ కార్యక్రమాల కోసం నిధిని అందించేవారు.

మహిళలను ఏకం చేసి

గ్రామాల్లో మహిళలకు అతి తక్కువ కూలి ఇచ్చి వారి శ్రమను దోచుకుంటుంటే కూలీలను సంఘటితం చేసి విజయాలు సాధించారు. అంతేకాదు 1987లో అత్యంత వెనకబడిన పాలమూరు జిల్లా కరువు తాండవించింది. ఆకలిచావులు కూడా సంభవించాయి. అటువంటి సమయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అంబలి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో లక్ష్మీదేవమ్మ కీలకపాత్ర పోషించారు. మహిళలను ఏకం చేసి 16 గ్రామాల్లో అంబలి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే కోవిడ్ మహమ్మారి సమయంలో సీపీఐ(ఎం) తెలుగు రాష్ట్రాలకు చెరో రు.25,000/-ల చొప్పున ఆఫీసుకు వచ్చి అందజేశారు. ఇలా తన శక్తిమేరకు పార్టీకి, ముఖ్యంగా జిల్లాకు ఆర్థికంగా నిధులు సమకూర్చేందుకు చివరికంటా ప్రయత్నించారు.

తల్లికి తలకొరివి పెట్టి...

ఐద్వా ఆధ్వర్యంలో నడిచే ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కు కన్వీనర్‌గా ఉన్నారు. అనేకమంది బాధిత మహిళలకు అండగా నిలబడ్డారు. లక్ష్మీదేవమ్మ తన తల్లి చనిపోయినప్పుడు ఒక్కగానొక్క కూతురయిన తానే తలకొరివి పెడతానని, ఆడపిల్లనైనంత మాత్రాన ఎందుకు తలకొరివి పెట్టకూడదు అని కుటుంబ సభ్యులను ఎదిరించి తల్లికి తలకొరివి పెట్టారు. ఆనాడు మహిళల్లో అదొక పెద్ద చర్చ. మహిళలపై కొనసాగుతున్న సామాజిక కట్టుబాట్లకు అదొక సవాల్‌గా నిలిచింది. ఇలా ఆమె మహిళలను చైతన్యం చేయడం కోసం నిరంతరం తపించేవారు. బతికున్నప్పుడే కాదు, చనిపోయిన తర్వాత కూడా తన శరీరం అనేక పరిశోధనలకు తోడ్పడాలన్న ఆమె కోరిక మేరకు పార్థివ దేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అందించారు. ఇది కదా మనకు ప్రేరణ. లక్ష్య సాధన కోసం చెయ్యాల్సిన కృషిని అనుక్షణం గుర్తుచేసే ఆదర్శ జీవితం ఆమెది.

ఆమె ఆశయ సాధనలో

లక్ష్మీదేవమ్మ ఉద్యమకారిణి మాత్రమే కాదు మంచి రచయిత కూడా. ఆమె రచనలు సులువైన సరళితో ఉండేవి. మా అమ్మమ్మ కథ, పట్నంలో బతుకుదామని, గుర్తుకొస్తున్నాయి, జీవితం-ఉద్యమం అనే పుస్తకాలు ఆమె రచించారు. చివరి రోజుల్లో ఆమె ఊపిరితిత్తుల వ్యాధితో హైద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చేరింది. ఆ ఆస్పత్రి బెడ్‌పై ఉండే ఆమె తన నాలుగో పుస్తకం జీవితం - ఉద్యమం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె ఆశయ సాధనలో వసంత, అర్జున్‌లు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. అలాగే అమ్మమ్మ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమంలో అడుగుపెట్టిన మనుమరాలు మమత ప్రస్తుతం పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు.

ఎప్పుడూ పార్టీ గురించే ఆలోచించేవారు



లక్ష్మీదేవమ్మ నాకు మేనత్త కూతురు. 1986లో నేను బి.ఇ.డి వాళ్ల ఇంట్లోనే ఉండి చదువుకున్నాను. ఎంతో ప్రేమగా చూసుకునేవారు. ఆమె సీపీఐ(ఎం) సారథ్యంలో అనేక కార్యక్రమాలు చేసేవారు. మహిళలను సమీకరించి సమస్యలపై పోరాటం చేసేలా చైతన్యపరిచేవారు. పార్టీ ఆదేశాల మేరకు అంబలి కేంద్రాలు పెట్టారు. వనపర్తిలో పవనగంటి ఈశ్వర్ భార్య సత్యమ్మ, నాగేశ్వర్ భార్య వీరమ్మలను, నాగిరెడ్డి భార్య విమలమ్మలను కలుపుకుని అనేక కార్యక్రమాలు చేసేవారు. ఎప్పుడూ పార్టీ గురించే ఆలోచించేవారు.

- రాధా పురుషోత్తం, వనపర్తి

పోరాట పతాకం



చిరునవ్వుకు చిరునామ లక్ష్మీదేవమ్మ.. చిరకాలపు స్నేహాన్ని అందించావమ్మా.. నన్ను ఒంటరిని చేసితివి ఎందుకమ్మా.. అనుదినం నీ జ్ఞాపకాలే అత్తమ్మ... లక్ష్మీదేవమ్మ అజాత శత్రువు. స్నేహశీలి. కల్మషం లేని పసిపిల్లల మనస్తత్వం. ఇంట్లో ఎటు చూసినా ఆమె జ్ఞాపకాలే. ఆమె లేని లోటు బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ముఖ్యంగా నేను ఓ మంచి స్నేహితురాలిని కోల్పోయాను. తనతో నా అనుబంధం 25 ఏండ్లు. ఎంతో గౌరవం, ప్రేమగా ఉన్నారు. తను ఒక మోడ్రన్ అత్తగారు. లేటెస్ట్ ట్రెండ్స్ అన్నీ తెలుసుకునేవారు. ఇంగ్లీష్, హిందీ భాషలు బాగా తెలుసు కాబట్టి ఆయా భాషల సినిమాలు, పాటలు అర్థం చేసుకునేవారు. ఆమె ఒక మానవతావాది. అందరినీ గౌరవించటం, అందరితోనూ కలిసిపోవటం ఆమె ప్రత్యేకత. మనకు వున్నంతలో ఎదుటి వారికి సహాయం చేయటం ఆమె దగ్గరి నుండి నేర్చుకున్నాను. తనకు పార్టీ అన్నా, పార్టీ కార్యకర్తలన్నా మక్కువ. వారిని కలిసినప్పుడల్లా వారి బాగోగులు అడిగి తెలుసుకునేవారు. వయసు తారతమ్యం లేకుండా అందరినీ పలకరించేవారు. ఆమె జీవితం ఓ పోరాటం. ఎన్ని సమస్యలు వచ్చినా ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నారు. విజేతగా నిలిచారు. చావును కూడా ఎదిరించి, పోరాడి చివరకు అలసిపోయారు. మరణించిన తర్వాత కూడా తన దేహాన్ని ప్రజల కొరకు అందించారు. ఆమె జీవితం మాకు ఆదర్శప్రాయం.

- వసంత అర్జున్, చిన్నకోడలు.

ఉద్యమ స్ఫూర్తి



స్ఫూర్తినిచ్చే త్యాగాల అరుణ తారలు ఒక్కొక్కరకుగా నింగికెగసి పోతుంటే మనసులో తీరని బాధ కలచి వేస్తున్నది. నేను కర్నూల్ జిల్లా నుండి ఆమె మహబూబ్‌నగర్ జిల్లా నుండి ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరయ్యే వారం. చిరునవ్వుతో ఎంతో ఆప్యాయంగా పలకరించే వారు. నిండైన ఆమె ప్రవర్తన నన్నెంతో ఆకర్షిం చేది. అందుకే ఇద్దరం గొప్ప స్నేహితులమయ్యాం. తర్వాత వియ్యపురాళ్లమయ్యాం. పీడిత బాధిత మహిళల సమస్యల పట్ల స్పందించి, వారి పోరాటాల్లో మమేకమై జీవితమంతా పరిమళించారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా జీవించారు. చివరికంటూ క్రమశిక్షణతో, అత్యంత నిబద్ధతతో జీవించారు. మానవతకు వర్గపోరాటాన్ని జోడించి నడిచారు. ఆమె జీవితం త్యాగమయం.

- కె.విశాలక్ష్మి

నమ్మిన సిద్ధాంతం కోసం...



నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు ఎస్ఎఫ్ఐ కార్యక్రమాలకు వెళ్లడానికి ఎంతో ప్రోత్సహించేది. అమ్మమ్మ పుస్తకాలు బాగా చదివేది. తనకు పర్సనల్‌లైబ్రరీ ఉండేది. దాని క్యాట్‌లాగ్ తయారు చేయడానికి నన్ను హెల్ప్ అడిగేది. అలా అభ్యుదయ సాహిత్యం నాకూ అలవాటయ్యింది. సినిమాలకు కూడా బాగా తీసుకెళ్లేది. డబ్బును ఎంత జాగ్రత్తగా ఖర్చు పెట్టాలో చెప్పేది. నలుగురితో కలవడం, సరదాగా ఉండడం అంటే అమ్మమ్మకు బాగా ఇష్టం. లోపల ఎంత కష్టం ఉన్నా పైకి కనబడనిచ్చేవారు కాదు. బయట వాళ్లు చాలా మంది మీకు ఆ పదవులు ఇస్తాము ఈ పదవులు ఇస్తాము అన్నా ఒప్పుకోలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడింది.

- మమత.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. వాటిలో రైతులను, వినియోగదారులను, మీడియా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఉన్నతాధికారులు క్షేత్ర పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. 108 తరహాలోనే విద్యుత్ సరఫరాలో సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన డయల్ '1912' ఫోన్‌నెంబర్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. 1912కు వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలనీ, ఆ వ్యవస్థ నిర్వహణ ప్రచారానికి అదనపు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో వచ్చే మార్చిలో పీక్ డిమాండ్ 6328 మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీక్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సబ్ స్టేషన్ల వారీగా ఓవర్ లోడ్ సమస్యలను పరిష్కరించాలనీ, ట్రాన్స్ మిషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకవేళ ఈదురు గాలుల వలన విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ రీస్టోర్ టీం) వాహనాలను వాడుకోవాలని తెలిపారు. మెరుగైన సరఫరాకు అహర్నిశలు కష్టపడుతున్న ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎస్ అధికారులను అభినందించారు. ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ..వేసవి దృష్టా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామనీ, ఇబ్బందుల్లేకుండా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తినా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు లోడ్‌పై పర్యవేక్షణ చేస్తూ 132/33 కేవీ సబ్ స్టేషన్లలో కావాల్సిన సామర్థ్యం మేరకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పెంచుతున్నామనీ, దీని వలన వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా అంతరాయాలు ఏర్పడవని వివరించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవి కాలానికి సంబంధించి మార్చిలో 6,328 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్న అంచనా మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. అందులో భాగంగా 44 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, మరో 32 వచ్చే నెల వరకు పూర్తి చేస్తామని తెలిపారు. 33 కేవి 13 ఓవర్ లోడ్ ఫీడర్స్, 11 కేవి 35 ఓవర్ లోడ్ ఫీడర్స్ కూడా లోడ్ రిలీఫ్ చేశామని అన్నారు. ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యం పెంపు, ప్రత్యామ్నాయ లైన్ల ఏర్పాటు, 17 కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటు, రాబోయే మార్చిలో 12 కొత్త సబ్ స్టేషన్ల ప్రారంభిస్తామని వివరించారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు క్షేత్రస్థాయిలో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 27న నోడల్ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను వెల్లడిస్తారని తెలిపారు. 29న నోడల్ అధికారులు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో కలిసి జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో వేసవి కార్యాచరణపై, ఫిబ్రవరి 4న ఎస్ఈలు డివిజన్ స్థాయిలో పూర్తి సిబ్బందితో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు.



దావోస్ @ రూ.1,78,950 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది.

పెట్టుబడుల వెల్లువ పట్ల సీఎం హర్షం

అమెజాన్, సన్ పెట్రో కెమికల్స్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. అమెజాన్ రూ.60,000కోట్లు, సన్‌పెట్రో కెమికల్ రూ.45,500 కోట్లు పెట్టుబడి పెట్టాయని తెలిపారు. రెండు కంపెనీలే ఏకంగా రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడి పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పట్ల నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, వ్యాపార వృద్ధికి ముందుకు రావడాన్ని వారు స్వాగతించారు. ఐటీ, పెట్రో, విద్యుత్, ఆహార తదితర అన్ని రంగాల్లో అపార అనుభవమున్న ప్రపంచ దిగ్గజ కంపెనీలకు తెలంగాణ వ్యాపార దిక్సూచిగా మారిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు.

గ్రామసభల్లో అదే తీరు

(మొదటిపేజీ తరువాయి)

డివిజన్‌లో నిర్వహించిన డివిజన్ మహాసభ రసాభాసగా జరిగింది.కాంగ్రెస్ నాయకులకు మాత్రమే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు అందజేశారని స్థానిక కార్పొరేటర్ ముస్తాఫా, అధికారులను నిలదీశారు. బోనకల్ మండలం రావినూతల గ్రామసభలో సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ దళిత కాలనీకి చెందిన ప్రజలు ఎంపీడీవో రురావత్ రమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కుర్చీలు లేపి విసిరేశారు. బోనకల్ గ్రామసభలో అంతోటి నిర్మల తనకు ఇల్లు లేదని, పెన్షన్ రావటం లేదని బోరున ఏడ్చుకుంటూ అధికారులను నిలదీసింది. చిరునోముల గ్రామసభలో కాంగ్రెస్ మహిళా నాయకులు అన్నెపోగు సుబ్బలక్ష్మి తనకు ఇల్లు లేదని, తన పేరు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాలో ఎందుకు లేదని అధికారులను నిలదీశారు. ఓ యువకుడు మద్యం మత్తులో తన చేతిలో ఉన్న కాగితాలను అధికారులపైకి విసిరేశాడు.

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేదని ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఫ్లెక్సీని తొలగించారు. తాంసి మండల కేంద్రంలో సైతం ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రామసభల్లో పథకాల జాబితాలపై అభ్యంతరాలు నిరసనలు వ్యక్తమయ్యాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో నిర్వహించి గ్రామ సభల్లో లబ్దిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేవని, రీ-సర్వే చేయాలని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

వనపర్తి జిల్లా పీపనగండ్ల, చిన్నంబాయి మండల పరిధిలోని దగడపల్లి గ్రామ సభలో అనర్హుల పేర్లు వచ్చాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో రమణారావుకు వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని గుడ్లనర్వలో గ్రామసభ రసాభాసగా జరిగింది. రైతు రుణమాఫీ ఇంకా చాలామందికి రాలేదని, భూమి ఉన్న వారికి ఆత్మీయ భరోసాలో పేరు ఉంటడంపై నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది.



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని జీర్లపల్లి గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు. ఇండ్ల వద్దకు వచ్చి ఫొటోలు తీసుకున్నా తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో పనులు చేయకున్నా లిస్ట్‌లో పేర్లు ఎలా వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని సలాక్‌పూర్ గ్రామసభలో.. అనర్హుల పేర్లు జాబితాలో ఎక్కువగా ఉన్నాయని మాజీ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అదేవిధంగా బ్యానర్‌పై మాజీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఫొటోలు లేవని గజ్వేల్ గ్రామసభలో స్థానికులు తహసీల్దార్ శ్రవణ్ కుమార్‌ను నిలదీశారు.

అర్హుల పేర్లు లేకపోవడంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి పేర్లు లబ్దిదారుల జాబితాలో ఎందుకు లేవని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులను నిలదీశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామసభకు ఆయన హాజరయ్యారు. సభ ముందు కింద కూర్చుండి మాజీ సర్పంచ్ పుప్పాల శైలజరాజారామ్‌తో కలిసి నిరసన తెలిపారు. అధికారులకు పూలు అందజేస్తూ, రెండు చేతులు జోడించి దండం పెట్టి గ్రామ ప్రజల సమస్యలను వినిపించారు. వీణవంక మండలం చల్లూరు గ్రామసభకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా కచ్చితమైన హామీ ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో బీజేపీ నాయకులు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది.

అమెరికాకే దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షకాలంలో కీలకమైన, పరిమితంగా అందుబాటులో ఉన్న వనరులన్నీ ఈ పనికి కేటాయిస్తే దేశాన్ని ఉద్ధరించేందుకు చేయాల్సిన పనులు చేయలేరని చెప్తున్నారు.

ఈ చర్యలు పని చేయవు

ప్రమాణస్వీకారం చేసిన తక్షణమే ట్రంప్ అంతర్జాతీయ సరిహద్దుల వద్ద అత్యవసర పరిస్థితి విధించారు. ట్రంప్ సర్కారు చర్యలన్నీ కొత్తగా అమెరికా చేరుకుందామనుకుంటున్న వారిని అడ్డుకోవడానికి ఉపయోగపడతాయేమో కానీ దశాబ్దాల అమెరికా శ్రామికజనావళిలో కలిసిపోయిన కోటి ముప్పై లక్షలమందిని మాత్రం వెనక్కు పంపేందుకు పనికి రావని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు.

పత్రాలు లేనివారిని గుర్తించటం సవాలే

అమెరికాలో అనధికారికంగా నివసిస్తున్నవారిలో మూడింట రెండువంతుల మంది పదేండ్లకుపైగా అమెరికాలోనే నివసిస్తున్నారు. వారందరికీ సామాజికభద్రత ఖాతా నంబర్లు, బ్యాంకు ఖాతాలున్నాయి. వారిని పనికి పెట్టుకున్న సంస్థలు తమవాటా సామాజిక భద్రత ఖాతాలకు తమవంతు సొమ్ము జత చేస్తూ ఉంటాయి. వైద్య సుంకాలు కూడా చెల్లిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పత్రాలు లేనివారిని గుర్తించటం అంత తేలికైన విషయం కాదని విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ప్రభుత్వ అనుమతులతో దేశంలోకి వచ్చినవారినీ వేధించేందుకు ట్రంప్ విధానాలు దారితీసే ప్రమాదమున్నదని అంటున్నారు.

'తరలింపులకు భారీ మొత్తంలో కావాలి'

దేశం నుంచి కోటి 30 లక్షల మందిని గుర్తించి అరెస్టు చేసి తరలించాలంటే కనీసం రెండున్నర లక్షల నుంచి నాలుగు లక్షలమంది సిబ్బంది కావాలని అమెరికా ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ అంచనా. అంటే ట్రంప్ లక్ష్యాలు సాధించాలంటే ఇప్పుడున్న సిబ్బందికంటే కనీసం 10 నుండి 20 రెట్లు అదనపు సిబ్బంది కావాలి. ఈ కసరత్తు పూర్తి చేయటానికి కనీసం లక్ష కోట్ల డాలర్లు కావాల్సి ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు. వీరందరినీ తరలించాలంటే ఇప్పుడు అమెరికాలో ఉన్న విమానయాన సదుపాయాలు కనీసం 500 రెట్లు పెరగాలన్న విషయాన్నీ గుర్తు చేస్తున్నారు.

'పెద్ద ఎత్తున కార్మికుల కొరత ఏర్పడే ప్రమాదం'

అమెరికా జనాభాలో ట్రంప్ చెప్తున్న అక్రమంగా నివసించే జనాభా 3.3 శాతం ఉంటుందని అంచనా. శ్రమశక్తిలో వీరి సంఖ్య గణనీయంగా ఐదుశాతం పైమాటే. వ్యవసాయ క్షేత్రాల్లోనూ, ఆస్పత్రుల్లోనూ, శిశుసంరక్షణ కేంద్రాల్లోనూ పనిచేసేవారిలో అత్యధికులు ఇలా సరైన పత్రాలు, కాగితాలు లేనివారే. భవన నిర్మాణ రంగంలో 12 శాతం ఇటువంటివారే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరందరినీ తరలించటమంటే ఆయా రంగాల్లో పెద్దఎత్తున కార్మికుల కొరత ఏర్పడే ప్రమాదముంటుందని విశ్లేషకులు చెప్తున్నారు.

అలజడులు సృష్టించేందుకు ట్రంప్ యత్నం

అక్రమ వలసదారుల విషయంలో భయభ్రాంతులకు గురిచేయటం, సామాజిక అశాంతి పెచ్చరిల్లేందుకు అవకాశాలు కల్పించటం, వలసదారుల శ్రమశక్తిపై ఆధారపడి పని చేసే ఆర్థికరంగాలను అతలాకుతలం చేయటం ట్రంప్ సర్కారు చర్యల్లో భాగమని అంటున్నారు. ఇలాంటి చర్యలు అక్కడ ధరల పెరుగుదలతో పాటు ఆర్థిక వ్యవస్థను ప్రతికూలంగా ప్రభావితం చేయనున్నాయని విశ్లేషిస్తున్నారు. ట్రంప్ నిర్ణయాలు అమలు జరిగితే ఆర్థిక వృద్ధి రేటు సగటున 6.8 శాతం వరకూ పడిపోయే ప్రమాదమున్నదని అమెరికా ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ హెచ్చరించింది.

వారికి క్షమాభిక్ష సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

తాన్యా చుట్కాన్ స్పందించారు. ఆ చేదు నిజాన్ని ఏ క్షమాపణా మార్చలేదన్నారు. శాంతియుతంగా జరగాల్సిన అధికార మార్పిడిలో చోటుచేసుకొన్న ఉల్లంఘనను సరిదిద్దలేరని చెప్పారు. "2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ఎలాంటి మోసమూ చోటుచేసుకోలేదు. శాంతియుతంగా జరగాల్సిన అధికార బదిలీకి ఆ సమయంలో ఓడిపోయినవారు ఆటంకం కలిగించడం సరికాదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావచ్చు" అని జడ్జి బెరిల్ హూవెల్ అన్నారు. మరో న్యాయమూర్తి కొలీన్ కొల్లార్ కోటెల్ సైతం ట్రంప్ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఈ కేసుకు సంబంధించిన వీడియోలు, విచారణ రికార్డులు, జ్యూరీ తీర్పులను భద్రపరిచినట్టు స్పష్టం చేశారు.

ఆరోజేం జరిగిందంటే..

గత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో(2020, నవంబర్) రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా, ఆ దేశ ప్రెసిడెంట్‌గా ఉన్న ట్రంప్ మళ్లీ పోటీ చేసి.. డెమోక్రాటిక్ క్యాండిడేట్ అయిన జో బైడెన్ చేతిలో ఓడిపోయారు. ఇక 2021 జనవరి 26న అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైంది. ఇది జరగడానికి కొన్ని గంటల ముందు ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఆవేశపూరితంగా, రెచ్చగొట్టేలా ప్రసంగించారు. దీంతో వారంతా వేల సంఖ్యలో క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఈ ఘటనలో 140 మందికి పైగా పోలీసు అధికారులు గాయాలపాలయ్యారు. దాడుల్లో పాల్గొన్న 1,500 మందిపై వాషింగ్టన్ ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఆ ఛార్జ్‌షీట్‌లో ట్రంప్ పేరు కూడా ఉన్నది. దీంతో ఇప్పుడు ట్రంప్ వారికి క్షమాభిక్ష ప్రసాదించటం, దానిని న్యాయమూర్తులు తోసిపుచ్చటంతో ఆదిలోనే ట్రంప్ నిర్ణయానికి బ్రేకులు పడినట్టయ్యిందని అంతర్జాతీయ నిపుణులు అంటున్నారు.

వంద కోట్లకు చేరువలో భారతీయ ఓటర్లు

(మొదటిపేజీ తరువాయి)

సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో 18-29 సంవత్సరాల మధ్య వయసున్న యువ ఓటర్లు 21.7 కోట్ల మంది ఉన్నారని, ఓటర్ల లింగ నిష్పత్తి 2024లో 948 ఉంటే ఇప్పుడు 954...అంటే ఆరు పాయింట్లు పెరిగిందని తెలిపింది.

దేశంలో ఓటర్ల సంఖ్య త్వరలోనే వంద కోట్లు దాటుతుందని ఈ నెల 7వ తేదీన ఢిల్లీ శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. ఓటింగ్‌లో ఇది మరో రికార్డు అవుతుందని ఆయన తెలిపారు.

ట్రంప్ నిర్ణయంతో కలవరం

వాషింగ్టన్: అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్‌రాకతో ఆ దేశంలో ఉండే భారతీయుల్లో కలవరం మొదలైంది. జన్మత: పౌరసత్వం విషయంలో ట్రంప్ నిర్ణయం వారిని తీవ్ర అలజడికి గురి చేస్తున్నది. దీంతో నెలల నిండకుండానే భారతీయులు ప్రసవాలకు సిద్ధమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జన్మత: పౌరసత్వం విధానాన్ని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం.. లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మత: పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. దీనిని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. "అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మత: పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు" అని ఆయన ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలతో ఈ ఆర్డర్ వచ్చే నెల అంటే ఫిబ్రవరి 20వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. అంటే.. ఆ తేదీ ముందు వరకు అమెరికాలో ఉంటున్న భారతీయులు లేదా ఇతర దేశాల దంపతులకు పుట్టిన బిడ్డలకు జన్మత: అమెరికా పౌరసత్వం లభిస్తుంది. ఆ తర్వాత పుట్టిన వారికి ఈ పౌరసత్వం రాదు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ గర్భిణీలు నెలలు నిండక ముందే డెలివరీకి సిద్ధమవుతున్నట్టు అమెరికా మీడియా నివేదిస్తోంది. నెలలు నిండకముందే పిల్లల్ని కనేందుకు భారతీయ దంపతులు తొందరపడుతున్నట్టు వెల్లడిస్తున్నది. ఇందుకోసం ఆస్పత్రుల వద్ద క్యూ కడుతున్నారని సమాచారం. ముఖ్యంగా 8, 9 నెలల గర్భిణీలు సీ-సెక్షన్ (సిజేరియన్) కోసం తొందరపడుతున్నట్టు తెలిసింది. కొందరు ఏడు నెలలు కూడా నిండకుండానే ముందస్తు ప్రసవాల కోసం వైద్యులను సంప్రదిస్తున్న ఘటనలు అక్కడ ఉన్నాయని కొన్ని కథనాలు చెప్తున్నాయి. ఇలా నెలలు నిండకుండానే జరిగే కాన్పుల కారణంగా తల్లి, బిడ్డకు ప్రమాదమని వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నెలలు నిండకుండానే పుట్టిన పిల్లల్లో ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో రూపొందవనీ, శిశువు తక్కువ బరువు, పోషణతోపాటు నాడీ సంబంధిత సమస్యలు ఉంటాయని చెప్తున్నారు.

నవచిత్రం

త్రిపుల్ బ్లాక్‌బస్టర్ అంటున్నారు



భీమ్స్, వెంకటేష్, అనిల్ రావిపూడి

వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ కాంబోలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి విడుదలై, విశేష ప్రేక్షకాదరణతో రికార్డ్ బ్రేకింగ్ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో పొంగల్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. అంతేకాకుండా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ బాక్సాఫీస్ సంభవం పేరుతో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

వెంకటేష్ మాట్లాడుతూ, "'సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ అనేది వండర్ ఫుల్ హ్యాపీ ఫీలింగ్. సంక్రాంతికి హానెస్ట్‌గా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలని అనుకున్నాం. కానీ ఆడియన్స్ సినిమాని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళారు. చాలా సపోర్ట్, ఎంకరేజ్‌మెంట్ ఇచ్చారు. హిట్ కాదు.. ట్రిపుల్ బ్లాక్‌బ్లాక్ బస్టర్ అంటున్నారు. ఈ సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థ్యాంక్స్' అని అన్నారు. 'మా సినిమాని ఇంతమంది చూసి అప్రిషియేట్ చేయడం, రెవెన్యూ సైడ్ కూడా మేము ఊహించనిదాని కంటే అద్భుతంగా రావడం చాలా ఆనందంగా ఉంది. వచ్చిన ప్రతి రూపాయి ప్రేక్షకుడి నవ్వుతో రావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సక్సెస్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఫ్యామిలీ సినిమాలకి ఉన్న స్ట్రెంత్‌ని ఈ సినిమా మరోసారి నిరూపించింది' అని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు.

సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ, 'దర్శకుడు అనిల్ ఓ లైబ్రెరీ. ఆయన దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను. చాలా చిన్న, చిన్న పదాలని ఎంత అందంగా పట్టుకోవచ్చో తెలుసుకున్నాను. ఈ సినిమా నాకు ఓ అమ్మలాంటి జ్ఞాపకం. ఈ సినిమాతో ప్రతి గడపకు వెళ్ళగలిగాను. ప్రేక్షకుల ప్రేమకు ధన్యవాదాలు' అని తెలిపారు.



చిరస్థాయిగా నిలిచిపోయే


అరుదైన సినిమా

బాలకృష్ణ, దర్శకుడు బాబీ కొల్లి కలయికలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా ఈనెల 12న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలైంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తూ సంచలన వసూళ్ల సాధిస్తున్న ఈ సినిమా బాలకృష్ణ కెరీర్‌లోనే అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో అనంతపురంలో అభిమానుల సమక్షంలో ఈ చిత్ర విజయోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించిన చిత్ర బృందం, ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ వేడుకలో బాలకృష్ణ స్వయంగా 'గణ గణ గణ ఆంధ్ర తెలంగాణ' పాటను పాడి అభిమానుల్లో ఉత్సాహం నింపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ విజయోత్సవ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి ఇంతటి విజయాన్ని అందించిన అభిమానులకు, ప్రేక్షకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రతి సినిమాకి ఏదో కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఎంతో రీసెర్చ్ చేస్తుంటాము. ఈ సినిమా కోసం కూడా ఎంతో రీసెర్చ్ చేశాం. 'ఆదిత్య 369'లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి గుర్తుండిపోయే పాత్రలు చేయాలనే ఆలోచన నుంచి 'డాకు మహారాజ్' పాత్ర పుట్టింది. 'అఖండ' ఆ తర్వాత 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', ఇప్పుడు 'డాకు మహారాజ్' ఈ సినిమాలు అభిమానులకు నచ్చడమే కాకుండా.. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు అందరూ సంతోషంగా ఉండేలా చేశాయి. చిరస్థాయిగా నిలిచిపోయే సినిమాలు అరుదుగా ఉంటాయి. అలాంటి సినిమా 'డాకు మహారాజ్' అని అన్నారు.


'రిలీజైన మొదటి రోజు నుంచే బాలకృష్ణ అభిమానులు ఫోన్లు, మెసేజ్‌లు చేసి మంచి సినిమా చేశారని మెచ్చుకున్నారు. హీరోని అభిమానించే, దర్శకుడిని నమ్మే.. నిర్మాత నాగవంశీ వల్లే ఈ సినిమా ఇంత గొప్పగా వచ్చింది. చినబాబుకి, త్రివిక్రమ్‌కి ధన్యవాదాలు' అని దర్శకుడు బాబీ కొల్లి చెప్పారు.

ఆస్కార్ కోసం పోటీ పడుతున్న చిత్రాలు





సినీ వర్గాలు అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుగా ఆస్కార్‌ని భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఆస్కార్స్ 2025' అవార్డుల కోసం పోటీ పడుతున్న ఉత్తమ చిత్రాల జాబితాను అకాడమీ ప్రకటించింది. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో దావానంలా వ్యాపించిన కార్చిచ్చు కారణంగా నామినేషన్ల కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు గురువారం 97వ అకాడమీ అవార్డుల కోసం పోటీ పడుతున్న చిత్రాల జాబితాను విడుదల చేసింది. 'అనోరా', 'ది బ్రూటలిస్ట్', 'ఎ కంప్లీట్ అన్‌నోన్', 'కాన్‌క్లేవ్', 'డ్యూన్: పార్ట్ 2', 'ఎమిలియా పెరెజ్', 'ఐ యామ్ స్టిల్ హియర్', 'నికెల్ బాయ్స్', 'ది సబ్‌స్టాన్స్', 'విక్డ్' చిత్రాలు ఆస్కార్ బరికి అర్హత సాధించాయి.





ఇక్కడా అదే వ్యథ!

రంజీలో భారత బ్యాటర్లు విఫలం

పేలవ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లు రంజీ ట్రోఫీలోనూ వైఫల్య గాథ కొనసాగించారు. టెస్టుల్లో స్వదేశంలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ సహా ఆసీస్ పర్యటనలో తేలిపోయిన రోహిత్ శర్మ రంజీ మ్యాచ్‌లో విఫలం అయ్యాడు. యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ సైతం దారుణంగా నిరాశపరిచారు.

నవతెలంగాణ-ముంబయి

పరుగుల వేటలో విఫలమై కెరీర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్న రోహిత్ శర్మకు దేశవాళీ క్రికెట్‌లోనూ ఊరట దక్కలేదు. రంజీ ట్రోఫీ గ్రూప్-ఏలో జమ్ము కాశ్మీర్ మ్యాచ్ బరిలో నిలిచిన రోహిత్ శర్మ బ్యాటర్‌గా నిరాశపరిచాడు. టీమ్ ఇండియా ఓపెనింగ్ భాగస్వామి యశస్వి జైస్వాల్‌తో కలిసి క్రీజులోకి వచ్చిన రోహిత్ శర్మ 19 బంతుల్లో 3 పరుగులకే వికెట్ కోల్పోయాడు. ఉమర్ నజీర్ సంధించిన ఆఫ్ సైడ్ బంతిని మిడ్ వికెట్‌గా ఆడేందుకు చూసిన రోహిత్ శర్మ ఎడ్జ్‌తో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ 8 బంతుల్లో 4 పరుగులకే అవుటయ్యాడు. శ్రేయస్ అయ్యర్ (11), అజింక్య రహానె (12), శివం దూబె (0) సైతం నిరాశపరిచారు. శార్దుల్ ఠాకూర్ (51) అర్థ సెంచరీతో ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 33.2 ఓవర్లలో 120/10 పరుగులు చేసింది. జమ్ము కాశ్మీర్ పేసర్ ఉమర్ నజీర్ (4/41), యుధ్‌వీర్ సింగ్ (4/31) నాలుగేసి వికెట్లు పడగొట్టారు. జమ్ము కాశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 42 ఓవర్లలో 174/7 పరుగులతో ఆడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 54 పరుగుల ముందంజలో నిలిచింది. ఇక సౌరాష్ట్ర, ఢిల్లీ మ్యాచ్‌లో రిషబ్ పంత్ (1) నిరాశపరిచాడు. సౌరాష్ట్ర స్పిన్నర్ రవీంద్ర జడేజా (5/66) ఐదు వికెట్ల మాయతో దేశవాళీలో జోరు చూపించాడు. రవీంద్ర జడేజా (38) బ్యాట్‌తోనూ రాణించాడు. కర్ణాటక, పంజాబ్ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ (4) 8 బంతుల్లోనే వికెట్ కోల్పోయాడు. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం కానుంది. భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌లు పరుగుల వేటలో ఆత్మవిశ్వాసం సాధించేందుకు రంజీ బరిలో నిలిచారు.

కింగ్ వస్తున్నాడు!

రెడ్ బాల్ ఫార్మాట్‌లో ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న రోహిత్ శర్మ దేశవాళీలో అడుగుపెట్టగా.. హిట్‌మ్యాన్ బాటలోనే విరాట్ కోహ్లి నడువనున్నాడు. రంజీ ట్రోఫీ ఆఖరు లీగ్ రౌండ్‌కు విరాట్ కోహ్లి రానున్నాడు. సర్వీసెస్, ఢిల్లీ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి ఆడనున్నాడు. రిషబ్ పంత్ ఇప్పటికే ఢిల్లీ జట్టుతో ఆడుతున్న సంగతి తెలిసిందే. కెఎల్ రాహుల్ సైతం కర్ణాటక తరఫున ఆఖరు రంజీ మ్యాచ్‌లో ఆడనున్నట్టు సమాచారం.



ఇటీవల నిరాశపరిచే ప్రదర్శనలతో జాతీయ జట్టులో చోటు కోల్పోయిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ సైతం రంజీ మ్యాచ్‌లో ఆడనున్నాడు. జనవరి 30 నుంచి ఆరంభం కానున్న హైదరాబాద్, విదర్భ మ్యాచ్‌లో స్టార్ పేసర్ ఆడనున్నట్టు హెచ్‌సీఏ వర్గాలు తెలిపాయి. రంజీ మ్యాచ్ కోసం మహ్మద్ సిరాజ్ ఇప్పటికే జింఖానా స్టేడియంలో సాధన సైతం షురూ చేశాడు.

తన్మయ్ సెంచరీ

హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ 90 ఓవర్లలో 291/2తో ఆడుతుంది. తన్మయ్ అగర్వాల్ (137 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఓపెనర్ అభిరాత్ రెడ్డి (73), రాహుల్ (52) అర్ధ సెంచరీలు సాధించారు.

పోరాటం ముగిసింది!

- లక్ష్యసేన్, సాత్విక్ జోడీ పరాజయం
- ఇండోనేషియా మాస్టర్స్ 500

జకర్తా (ఇండోనేషియా): ప్రపంచ బ్యాడ్మింటన్ సీజన్ ఆరంభం భారత షట్లర్లకు కలిసి రావటం లేదు. ఇండోనేషియా మాస్టర్స్ 500 టోర్నీలో భారత షట్లర్లు ఎవరూ కనీసం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోలేదు. మహిళల సింగిల్స్‌లో తొలి రోజే ఆశలు ఆవిరి కాగా.. ఇతర విభాగాల్లో ప్రీ క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ నిరాశపరిచింది. థాయ్‌లాండ్ షట్లర్ల చేతిలో 20-22, 21-23తో వరుసగా రెండు గేముల్లో టైబ్రేకర్లలో తడబాటుకు గురయ్యారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడాడు. 16-21, 21-12, 21-23తో జపాన్ స్టార్ కెంటా నిషిమోటో చేతిలో లక్ష్యసేన్ పరాజయం పాలయ్యాడు. తొలి గేమ్‌లో ఓడినా.. రెండో గేమ్‌ను అలవోకగా నెగ్గిన లక్ష్యసేన్ నిర్ణయాత్మక మూడో గేమ్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జంట 21-13, 22-24, 18-21తో మూడు గేముల మ్యాచ్‌లో మలేషియా అమ్మాయిల చేతిలో ఓటమి చెందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు 21-18, 15-21, 19-21తో ప్రీ క్వార్టర్స్‌లో నిరాశపరిచారు.





కళ పోరాట ఆయుధం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో ప్రజలెదుర్కొన్న ఏ సమస్యలూ పరిష్కారానికి నోచలేదన్నారు. అందుకే సంగారెడ్డిలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకోబడతాయన్నారు. రాబోయే కాలంలో ఉవ్వెత్తున ప్రజా ఉద్యమాలు నడిపేందుకు పోరాట కర్తవ్యాల్ని రూపొందిస్తామని తెలిపారు.

ఆలోచింపజేసిన వీధి నాటికలు

మొదటి రోజు నిర్వహించిన ప్రజా సాంస్కృతికోత్సవాల్లో పలు వీధి నాటకాల్ని ప్రదర్శించారు. అదే విధంగా పాటలు పాడారు. ముందుగా హైదరాబాద్ పీఎన్ఎం కళాకారుల బృందం 'హల్లాబోల్' వీధినాటికను ప్రదర్శించింది. హష్మీ రచించిన 'ఎలుగెత్తి చాటుదాం' వీధి నాటికలో రెక్కలు ముక్కలు చేసుకుని సంపదను సృష్టిస్తున్న కార్మికులకు కనీస వేతనాల్లేక మురికి వాడల్లో సాగే జీవన విధానాన్ని చూపారు. వేతనాల పెంపు, సమస్యల పరిష్కారం కోసం పోరాడే కార్మికుల పక్షాన ప్రజా కళాకారులు వీధి నాటిక ప్రదర్శించడాన్ని కూడా రాజ్యాంగ యంత్రాంగంలో భాగమైన పోలీసులు కళాకారులపై చూపిన జులుం సీన్స్ వీక్షకుల్ని ఆకట్టుకున్నాయి. కార్మికులు సంఘటితమై పోరాడి హక్కులు సాధించుకోవాలనే సందేశాన్ని నాటిక ద్వారా ఇచ్చారు. బి.స్టూడియో హైదరాబాద్ కళాకారుల బృందం 'డెమోక్రసీ' పేరిట ప్రదర్శించిన వీధి నాటిక నేటి రాజకీయ ముఖ చిత్రాన్ని తెలియజేసింది. నియంతల్ని ఎదిరించి సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని నేటి బూర్జువా రాజకీయ పార్టీలు ఎలా భ్రష్టుపట్టించాయో నాటిక ద్వారా తెలియజేశారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి...ఫాసిజం నశించాలి అంటూ కళాకారులు నినదించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువను దిగజార్చి కులం, మతం, డబ్బుకు ఓట్లమ్ముకోవడాన్ని కూడా ఇందులో చూపారు. విలువల్లేని వాళ్లు ఎన్నికల్లో గెల్చిన తర్వాత ప్రభుత్వాన్ని ప్రజల కోసం కాకుండా తమ దోపిడీ, స్వార్థం కోసం ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరుల్ని లూటీ చేసిన తీరును సైతం నొక్కి చెప్పారు. నాటికలోని అన్ని సీన్స్ అక్కడ ఉన్న ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యాయి. ప్రస్తుతమున్న బీజేపీ, కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలను అద్దం పట్టినట్టు చూపారు. అదే విధంగా నిజాం కాలంలో వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాట సన్నివేశాలను 'వీర తెలంగాణ' నాటిక ద్వారా సూర్యాపేట జిల్లా కళాకారులు తెలియజేశారు. నిజాం, జాగీరుదార్లు, భూస్వాముల ఆగడాలను కండ్లకు కట్టినట్టు చూపారు. ఆడపిల్లల బతుకులపై నల్లగొండ కళాకారులు ఒగ్గుకథ, హరే రామ హరే కృష్ణ దృశ్యకావ్యాన్ని సంగారెడ్డి కళాకారులు ప్రదర్శించారు. ఏపీ కళాకారులు సురేష్ "పద పదవే నా గీతమా' అంటూ ఆలపించిన పాట అందర్నీ ముగ్దుల్ని చేసింది. ఖమ్మం పీఎన్ఎం కళాకారుడు సదానందం పాడిన 'ఇంకెప్పుడు ఇంకెంతకాలం' అంటూ 'పదపద పిలుస్తోంది సోషలిజం' అనే పాట ఉత్తేజపర్చింది. చంద్రమౌళి, శ్రీ కృష్ణ పాటల ద్వారా ప్రజా కళలు, కళాకారుల ఔనత్యాన్ని చాటారు. ఈ కార్యక్రమానికి పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ అధ్యక్షత వహించగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, టి.సాగర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆడివయ్య, జిల్లా కార్యదర్శి జయరాజు, పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, రాష్ట్ర నాయకులు వేల్పుల వెంకన్న, జక్కిడి నర్సింహారెడ్డి, శంకర్, జిల్లా కార్యదర్శి నాగభూషణం, పాల్గొన్నారు.

తగ్గేదేలే ఎర్రజెండా

- మానవాళికి కమ్యూనిస్టులు అవసరం
- ఎర్రజెండా పోరాటాలకు నా మద్దతు
- ప్రజా సాంస్కృతికోత్సవాల్లో ప్రజా వాగ్గేయకారులు గోరటి వెంకన్న

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"తగ్గేదేలే పుష్ప... కాదు తగ్గేదేలే ఎర్రజెండా" మానవాళికి కమ్యూనిస్టులు అవసరముంది అని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రజా సాంస్కృతికోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మాటా-పాటా-ఆటా ద్వారా ఆయన సభను ఉర్రూతలూగించారు. ప్రపంచ శాంతి కోసమే కాదు ప్రజల మధ్య సామరస్యం కోసం కమ్యూనిస్టులు ఉండాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టులు ఏ మతానికి వ్యతిరేకం, అనుకూలంగా ఉండరని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పని విధానం కోసం పోరాడిన వీరుల రక్తంలో తడిసిన ఎర్రజెండా ఫలితంగానే కార్మికులకు స్వేచ్ఛ లభించిందన్నారు. అబద్ధాలతో ప్రజల్ని బలహీనుల్ని చేయాలని చూస్తున్న పరిస్థితుల్లో ప్రజల పక్షాన గొంతెతి ఆడిపాడుతున్న పీఎన్ఎం కళాకారులకు అభినందనలు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, బీంరెడ్డి నర్సింహ్మారెడ్డి మార్గంలో ప్రజల కోసం సీపీఐ(ఎం) చేస్తున్న పోరాటాలకు మద్దతుగా ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం "గల్లీ చిన్నది గరీబోళ్ల కథ పెద్దది" అనే పాట పాడుతూ కళాకారులతో కలిసి గోరటి వెంకన్న ఆడిపాడి చిందేశారు. గోరటి ఆటా, పాటా, మాటలతో సభికులు కేరింతలు కొడుతూ వారితో కలిసి గంతేశారు.

భద్రాద్రిలో విమానాశ్రయ ఏర్పాటుకు ముందడుగు

- ఆరుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం పర్యటన
- విమానాశ్రయ ఏర్పాటు ఆవశ్యకత ఉంది : ఎంపీ
- జిల్లా వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతుంది : కలెక్టర్
- విమానాశ్రయ ఏర్పాటు ద్వారా వాణిజ్య రంగం అభివృద్ధి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయ ఏర్పాటుకు ముందడుగు పడింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం అధ్యయనానికి కేంద్రం నుంచి ఆరుగురు సభ్యుల బృందం కొత్తగూడెంలో గురువారం పర్యటించారు. కొత్తగూడెం గరీబ్ పేట చుట్టూ సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల పరిధిలోని భూములను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం పరిశీలించింది. విమానాశ్రయ ఏర్పాటుకు స్థలంలో ఉన్నటు వంటి వనరులు, రహదారులు, గుట్టలు ఏమైనా ఉన్నాయా.. నిర్మాణానికి సాధ్య అసాధ్యాలను వారు పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా మొత్తం స్థలంను వీక్షించి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, కేంద్ర బృంద సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ఆవశ్యకతను పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు, 12 లక్షల జనాభా, 5 నియోజకవర్గాలు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదనలో ఉందని తెలిపారు. జిల్లా భౌగోళిక స్వరూపాన్ని మ్యాప్ ద్వారా సభ్యులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో ఎయిర్ పోర్టు స్థాపనకు సాధ్యా అసాధ్యాలను పరిశీలించడానికి కేంద్ర బృందం జిల్లాకు వచ్చిందని, వారికి మొత్తం 950 ఎకరాల భూమిని సూచించామని, దీనిలో 20 నుంచి 30 శాతం పట్టా భూములు ఉన్నాయని తెలిపారు.

ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషితో జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుందని వివరించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం దేశంలోనే రెండవ ప్రాముఖ్యత కలిగిన రామ మందిరం అని, విమానాశ్రయ ఏర్పాటు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్థల పరిశీలన నివేదికలను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి అందించాలని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, విమానాశ్రయ ఏర్పాటు ద్వారా జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం బృంద సభ్యులు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను పరిశీలించి త్వరితగతిన నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. అనంతరం రెవెన్యూ ఫారెస్ట్, మైనింగ్, విద్యుత్ ఇరిగేషన్ ఇంజనీరింగ్, సర్వే అధికారులు విమానాశ్రయ ఏర్పాటుకు సూచించిన భూమి అనుకూలతను, పూర్తి వివరాలను బృంద సభ్యులకు వివరించారు. అనంతరం బృంద సభ్యులను శాలువా, మేమంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు ఏరో ప్లానింగ్ అధికారి అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్చర్ అధికారి మొహమ్మద్ సాకిబ్, ఆపరేషన్ అధికారి ప్రశాంత్ గుప్తా, సి.ఎన్.ఎస్ అధికారి ఆర్.దివాకర్, ఇంజనీరింగ్ అధికారి సి.మనీష్ జోన్వాల్, ఎఫ్‌పీడీ అధికారి ప్రవీణ్ ఉన్నికృష్ణన్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, సీపీఓ సంజీవరావు, ఎంపీటీసీఎల్ ఎస్సీ మహేందర్, ఆర్అండ్‌బీ ఈఈ వి.వెంకటేశ్వర్లు, సుజాతనగర్ తహసీల్దార్ శిరీష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతీకార చర్యలకు దిగితే తీవ్ర పర్యవసానాలే

- దావోస్ సమావేశాల్లో డబ్ల్యూటీఓ

దావోస్ : వాణిజ్య యుద్ధాల వల్ల అంతర్జాతీయ అభివృద్ధికి తీవ్రమైన పర్యవసానాలు కలుగుతాయని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) డైరెక్టర్ జనరల్ నాగొజి ఒకొంజొ హెచ్చరించారు. గురువారం ఇక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులపై చర్చించేందుకు ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 శాతం లేదా 60 శాతం టారిఫ్‌లు విధిస్తూ మనం ప్రతీకార చర్యలకు పాల్పడినట్లైతే, మళ్ళీ 1930ల కాలానికి వెళ్లిపోతామని, రెండంకెల్లో జిడిపి నష్టాలను చవి చూస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి పరిస్థితులు అందరికీ తీవ్ర వినాశనాన్ని కలిగిస్తాయన్నారు. అందుకు మూల్యం చెల్లించక తప్పదన్నారు. కృత్రిమ మేథస్సు, సంస్కరణలపై తక్షణమే కార్యాచరణ చేపట్టాలని పలు దేశాలకు చెందిన నేతలు పిలుపునిచ్చారు. తప్పుడు సమాచార వ్యాప్తిని, సైబర్ వేధింపులను అణచివేసేందుకు యురోపియన్ యూనియన్ వ్యాప్తంగా సోషల్ మీడియా పాలనలో సంస్కరణలు రావాలని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ కోరారు.



సర్వతోముఖాభివృద్ధి మూలస్తంభం : అశ్విని వైష్ణవ్

రాబోయే కాలంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో వుంచుతూ 6 నుంచి 8 శాతం ఆర్థికాభివృద్ధి రేటును భారత్ కొనసాగిస్తుందని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం చెప్పారు. గురువారం ఇక్కడ జరుగుతున్న డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక ప్రణాళికకు సర్వతోముఖాభివృద్ధి అనేది మూల స్తంభంగా వుంటుందని అన్నారు. దీనికి తోడు తయారీ, సేవలు, చట్టాల సరళీకరణ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కొనసాగిస్తూనే వుండాల్సి వుంటుందన్నారు. ఆర్థికాభివృద్ధి ఫలితాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశంలో అన్ని రంగాలవారీగా అద్భుతమైన నైపుణ్యాలు మనకు అందుబాటులో వున్నాయని అన్నారు. భారత్ అనుసరిస్తున్న విధానాల కారణంగానే ప్రపంచం నేడు భారత్‌ను అమితంగా విశ్వసిస్తోందన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బీఆర్ఎస్ నేతల అవహేళన వల్లే రైతు ఆత్మహత్యలు

- సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులను బీఆర్ఎస్ నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడటం వల్లే ఆత్మహత్యలు పెరుగుతున్నాయని సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. 'సంపినోడే సంతాప సభ పెట్టినట్టు' బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి తప్పైయిందంటూ బీఆర్ఎస్ నేతలు రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ కమిటీ వేయలేదనీ, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. టీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి ఏ రోజు వ్యవసాయ రంగంపై అధ్యయనం చేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు ఏడువేల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే కేవలం 1220 మందికే పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జీవో నెంబర్ 421ను ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు.

రాహుల్‌గాంధీకి అస్వస్థత

- ఎన్నికల ర్యాలీ రద్దు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన పాల్గొనాల్సి ఉన్న ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ముస్తఫాబాద్‌లో ఎన్నికల ప్రచారాన్ని రాహుల్ గాంధీ నిర్వహించాల్సి ఉంది. అయితే అనారోగ్యం కారణంగా వైద్యుల సూచన మేరకు ఈ ప్రచార సభ రద్దయింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ తెలిపారు. అయితే శుక్రవారం మాదిపూర్‌లో రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీ షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని చెప్పారు. భారీ బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తారని తెలిపారు. కాగా, బుధవారం సదర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇందర్‌లోక్ మెట్రో స్టేషన్ సమీపంలో కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల ర్యాలీకి రాహుల్ గాంధీ హాజరుకాలేదు. దీంతో ఆయన పాల్గోవాల్సిన మూడు ప్రచార సభల్లో రెండు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో ముస్లిం ఓటర్లల్లో చీలిక రాకుండా చూడ్డానికే రాహుల్ గాంధీ ఆప్‌కు సహకరిస్తున్నట్లు వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలను దేవేందర్ యాదవ్ ఖండించారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ ఆఫీసులో కమీషన్ల దందా

- ఫైళ్ల క్లియరెన్స్ కోసం 9 నుంచి 12 శాతం వసూలు
- ఏసీబీ డీజీకి సర్పంచుల సంఘం జేఏసీ ఫిర్యాదు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆఫీసులో 9 నుంచి 12 శాతం కమీషన్ల దందా నడుస్తున్నదని కాంట్రాక్టర్లు చెబుతున్నారనీ, ఒక్కో ఫైల్ క్లియరెన్స్ కోసం 9 నుంచి 12 శాతం వసూలు చేస్తున్నారని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, నాయకులు కె.శంకర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని ఏసీబీని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఈ మేరకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. తమ ఫిర్యాదును సుమోటోగా స్వీకరించి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల విషయంలో కమీషన్లు చెల్లించే పరిస్థితిలో లేనందునే క్లియరెన్స్ చేయడం లేదని ఆరోపించారు. కమీషన్లు తీసుకుంటున్న వారిపై నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌డీఎఫ్, మన ఊరు-మన బడి కింద జనరేట్ అయిన చెక్కులను ప్రభుత్వం క్లియర్ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నేడు టెట్ ప్రాథమిక కీ విడుదల

- 27 వరకు అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేయనుంది. ఈనెల 27న సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాథమిక కీపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించనుంది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో ఈనెల రెండు నుంచి 20 వరకు టెట్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పేపర్-1కు 94,327 మంది, పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్‌కు 93,263 మంది, సోషల్ స్టడీస్‌కు 88,163 మంది కలిపి మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కు 69,476 (73.65 శాతం) మంది, పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్‌కు 69,390 (74.40 శాతం) మంది, సోషల్ స్టడీస్‌కు 66,412 (75.33 శాతం) మంది కలిపి మొత్తం 2,05,278 (74.44 శాతం) మంది హాజరయ్యారు.

ఐటీ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐటీ ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ ఉద్యోగులను కించపరిచి, అవమానించేలా ముఖ్యమంత్రి వ్యాఖ్యలున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతంపై ఐటీ రంగం వాటా ఉందనీ, దేశ ప్రగతిలో ఐటీ ఉద్యోగుల శ్రమ ఉందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి శ్రమ విలువ తెలియదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేయలేదనీ, ఓ సంస్థ అమెరికా మార్కెటింగ్ విభాగానికి అధిపతిగా పని చేశారని గుర్తుచేశారు. పెయింటర్‌గా ఉన్న రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని గుర్తుచేశారు. ఐటీ సంస్థల ఉద్యోగులకు రేవంత్ రెడ్డి క్షమాపణ కోరాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తుంగ బాలు, బొమ్మెర రామమూర్తి ,ఫయాజ్, కాంచన పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శం

- బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేతాజి సుభాష్ చంద్రబోస్ ఆశయాలు, ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శనీయమని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి చెప్పారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. బోస్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ(సంఘటన) ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, రాజస్థాన్ రాష్ట్రం దౌన నియోజకవర్గ ఎమ్మెల్యే బాగ్‌చంద్ సైనీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వీరుడిగా చరిత్రలో నిలిచిన నేతాజీ, తన స్వేదంతో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి, సింగపూర్‌లో తొలిసారి భారత స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన త్యాగాలు, సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయన్నారు. ఆయన త్యాగాలు, సేవలను చరిత్రలో మళ్లీ లిఖించి, భవిష్యత్ తరాలకు బోధించాల్సిన అవసరం ఉందన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు..

కార్మిక వర్గం ఆత్మీయ ఆతిథ్యం

- 10 వేల కుటుంబాల్ని కలిసి రూ.10 లక్షల విరాళాల సేకరణ
- రాష్ట్ర మహాసభల సందర్భంగా బహుముఖ కార్యక్రమాలు
- ఎర్రజెండా పట్ల కష్టజీవుల్లో అపూర్వ ఆదరణ
- ఆర్థిక పోరాటాలు.. సామాజిక సేవా కార్యక్రమాలు

పటాన్‌చెరులో 38 రోజులు.. 200 దళాలతో ఇంటింటికీ సీపీఐ(ఎం)



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మినీ ఇండియాగా పేరుగాంచిన పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికవర్గం సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు ఆత్మీయ ఆతిథ్యమిస్తోంది. జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల జయప్రదం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. సీపీఐ(ఎం) పట్ల కష్టజీవుల్లో అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజా ఉద్యమానికి నాంది పలికిన పటాన్‌చెరు ప్రాంతం ఇప్పటికీ సీపీఐ(ఎం)కు బలమైన ప్రజా పునాదిని కలిగి ఉంది. పారిశ్రామిక కార్మికవర్గం, శ్రామికులు, పేదలు పెద్ద ఎత్తున ఎర్రజెండాను గుండెలకు హత్తుకుని పార్టీ రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం తాము సైతం అంటూ కృషి చేస్తున్నారు. ఒకటా రెండా 38 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి కష్టజీవుల్ని కలిసి రూ.10 లక్షల పైచిలుకు మాస్ ఫండ్స్ క్యాంపెయిన్ చేశారు. పరిశ్రమల్లో కార్మికులుగా నెల వేతనం విరాళంగా ఇచ్చిన కార్మికులు నివాస ప్రాంతంలోనూ కుటుంబ పరంగా భారీ ఎత్తున విరాళాలు అందజేసి కార్మిక వర్గ పక్షపాతి సీపీఐ(ఎం)ను ఆదరిస్తున్న తీరు విప్లవ చైతన్యాన్ని ప్రదర్శిస్తోంది.

సామాజిక సేవా కార్యక్రమాలు

పలు సామాజిక సేవా కార్యక్రమాలూ నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతంలోని కంపెనీల్లో ఎర్రజెండా యూనియన్ నాయకత్వం కార్మికులకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నది. ఆస్పత్రుల్లో, విద్యా సంస్థలతో మాట్లాడి నాణ్యమైన వైద్యం, విద్య అందేలా యూనియన్ నాయకత్వం చొరవ చూపుతోంది. నాయకత్వం నిజాయితీగా పనిచేయడం, జవాబుదారీతనంగా ఉండటం, సీపీఐ(ఎం) సిద్ధాంతం పట్ల చైతన్యవంతం చేస్తూ క్లాసులు, సదస్సులు, సెమినార్ల ద్వారా అవగాహన కల్పించడంతో కార్మికులు ఎర్రజెండా సైనికులుగా పనిచేస్తున్నారు. సామాజిక న్యాయం కోసం మహనీయులైన జ్యోతిరావుపూలే, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, బీటీ రణదివే, పుచ్చలపల్లి సుందరయ్య జయంతి, వర్ధంతుల సందర్భంగా సహపంక్తి భోజన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికుల నివాస ప్రాంతాల్లోనూ కుటుంబపరమైన సమస్యలే కాకుండా కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సీపీఐ(ఎం) పోరాడి అనేక సమస్యల్ని పరిష్కరించింది. రాష్ట్ర మహాసభల సందర్భంగా పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, ఆర్‌సీ పురం, అమీన్‌పూర్, గడ్డపోతారం, ఇంద్రేశం, బొల్లారం, ఖాజీపల్లి, గుమ్మడిదల, జిన్నారం, ఇస్నాపూర్ వంటి ప్రాంతాల్లో మాస్ క్యాంపెయిన్ చేశారు. బొల్లారం, ఇంద్రేశం, ముత్తంగిలో మెడికల్ క్యాంపులు, పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

మహాసభల సందర్భంగా బహుముఖ కార్యక్రమాలు, విస్తృత ప్రచారం

రాష్ట్ర మహాసభల్ని పురస్కరించుకుని కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో వివిధ అంశాలపై సెమినార్లు, సదస్సులు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ అంశాలపై నిర్వహించిన సెమినార్స్‌లో చుక్క రాములు, ఎస్.వీరయ్య, జే.వెంకటేశ్, భూపాల్ వంటి రాష్ట్ర నాయకత్వం పాల్గొని ప్రసంగించారు. ముత్తంగిలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. తోషిబా, శాండ్విక్, అగర్వాల్, పెన్నా, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, పార్లే, కిర్బీ, పార్కర్ వంటి పరిశ్రమల్లో గేట్ మీటింగ్‌లు, జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి 25న జరిగే బహిరంగ సభకు తరలేందుకు సన్నద్ధం చేశారు. వాల్‌రైటింగ్, పోస్టర్లు, కరపత్రాలు, జీపుజాతా, కళారూపాల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, తోరణాలు, జెండాలతో లింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతమంతా ఎరుపుమయంగా మారింది.

10 వేల కుటుంబాల్ని కలిసి రూ.10 లక్షల విరాళాల సేకరణ

కార్మిక పోరాటాల గడ్డ పటాన్‌చెరు ప్రాంతంలో పార్టీ రాష్ట్ర మహాసభలకు విస్తృత ప్రచార కార్యక్రమాలతో పాటు భారీ ఎత్తున విరాళాల సేకరణ జరుగుతోంది. పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో 200 దళాలుగా ఏర్పడిన సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు 38 రోజుల పాటు ఇంటింటికీ సీపీఐ(ఎం) మాస్ ఫండ్స్ క్యాంపెయిన్ నిర్వహించారు. 10 వేల కుటుంబాల్ని కలిసి రూ.10 లక్షలకు పైగా కష్టజీవుల నుంచి విరాళాలు సేకరించారు. కార్మిక వర్గం పెద్ద ఎత్తున స్పందిస్తూ ఆత్మీయ ఆతిథ్యాన్నిస్తోంది. ప్రజల కోసం పోరాడే సీపీఐ(ఎం) తన మహాసభల నిర్వహణ కోసం కష్టజీవుల నుంచే విరాళాలు సేకరిస్తోంది. తప్పుడు పద్ధతుల్లో సంపాదించే పెట్టుబడిదారుల, ఇతర సంపన్నుల నుంచి పైసా విరాళాలు సేకరించకూడదన్న పార్టీ నిబంధనలకు లోబడే సంగారెడ్డి జిల్లాలో ప్రజల్ని కలిసి విరాళాలు సేకరిస్తోంది. పారిశ్రామిక కార్మికులు నివాసముండే భ్రమరాంబిక కాలనీలో రూ.5 లక్షలు, కర్దనూరులోని సిద్దార్థ నగర్ కాలనీలో రూ.లక్ష, మదీనాగూడలోని ఆదర్శ నగర్ ప్రజలు రూ.2.50 లక్షలు, మియాపూర్‌లోని సుందరయ్య కాలనీ ప్రజలు రూ.1.30 లక్షలు, ఇతర కాలనీల్లో మరో లక్షన్నర వరకు ఇంటింటి క్యాంపెయిన్‌లో పెద్ద ఎత్తున విరాళాలిచ్చి ఆదరించారు. తోషిబా, శాండ్విక్, సీబీఎల్, మహింద్రా, కిర్బీ యూనియన్స్ పెద్ద ఎత్తున విరాళాలిచ్చాయి.

సీపీఐ(ఎం) కార్మిక వర్గ పక్షపాతి



సీపీఐ(ఎం).. కార్మిక వర్గ పక్షపాతి. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని లక్షలాది మంది కార్మికుల దైనందిన సమస్యలపై ఎర్రజెండా మాత్రమే పోరాడుతోంది. మొదట్లో అంద్రామోటర్స్, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగుల పక్షాన పోరాడిన సీపీఐ(ఎం) ప్రస్తుతం వందలాది పరిశ్రమల్లో యూనియన్లు కలిగి ఉంది. కంపెనీల్లోనే కాకుండా నివాస ప్రాంతాల్లోనూ కార్మికులు, ప్రజల సమస్యలపై పోరాడుతున్నందున పార్టీ రాష్ట్ర మహాసభలను కష్టజీవులు ఆదరిస్తున్నారు. తమ నెల జీతాన్ని విరాళంగా ఇచ్చి ఆత్మీయ ఆతిథ్యమిస్తున్న తీరు గొప్పది.

- జే.మల్లిఖార్జున్

మహాసభల్లో పోరాట కర్తవ్యాలు రూపొందిస్తాం



సంగారెడ్డిలో తొలిసారి నిర్వహించే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రజల భవిష్యతుకు సంబంధించిన అంశాల్ని చర్చిస్తాం. రాబోయే కాలంలో నిర్వహించే పోరాట కర్తవ్యాల్ని రూపొందిస్తాం. ఇప్పటి వరకు ప్రజలు, కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించాం. మహాసభల స్ఫూర్తితో మరింత సమరశీల ఉద్యమాలు నడిపే దిశగా ముందుకు సాగుతాం. ప్రజల వద్దకెళితే అపూర్వ ఆదరణ లభిస్తుంది. కమ్యూనిస్టులు బలపడాలని కోరుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి ఉంది. అందుకే పోరాడే సీపీఐ(ఎం) పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైంది.

- కె.రాజయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

ప్రజల కష్టసుఖాల్లో ఎర్రజెండా ఉంటది



సీపీఐ(ఎం) నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామి అవుతోంది. కార్మికుల సమస్యలపై పోరాడి మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంలో ఎర్రజెండా ముందుంది. అందుకే కార్మికులు పెద్ద ఎత్తున సీపీఐ(ఎం) మహాసభలకు సహకరిస్తున్నారు. సీపీఐ(ఎం) రాజకీయ విధానాలు, చేస్తున్న పోరాటాల్ని వివరిస్తూ ప్రజల వద్దకెళ్లాం. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన పోరాడేది ఎర్రజెండా మాత్రమే. అ విషయాల్ని వివరిస్తూనే 38 రోజుల పాటు పది వేల కుటుంబాల్ని కలిసి ఫండ్ క్యాంపెయిన్ చేశాం. కష్టజీవుల్లో విశేష స్పందన కనిపించింది.

- పాండురంగారెడ్డి, సీపీఐ(ఎం) ఏరియా నాయకులు

నేతాజీ అస్థికలు తెప్పించండి

జయంతి రోజు ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల డిమాండ్

- స్పందించని మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్‌ఫౌజ్ స్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై అనుమానాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన అస్థికలను భారత్‌కు తీసుకొచ్చి, వాటికి డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలన్న డిమాండ్ పెరుగుతోంది. నేతాజీ కుటుంబ సభ్యులు కూడా పదేపదే ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తున్నారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అస్థికలకు డీఎన్ఏ పరీక్ష నిర్వహిస్తే విమాన ప్రమాదంలో చనిపోయింది నేతాజీయా కాదా అనే విషయం తేలిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేతాజీ అస్థికలను జపాన్‌లోని రెంకోజీలో ఉన్న బౌద్ధ దేవాలయంలో ఓ కలశంలో భద్రపరిచారు. అనేక దశాబ్దాలుగా అవి అక్కడే ఉన్నాయి. అవి నేతాజీవేనని కొందరు భావిస్తుండగా మరి కొందరు కావని అంటున్నారు.



ఇప్పుడు తైవాన్‌గా పిలుస్తున్న ప్రాంతంలో 1945 ఆగస్ట్ 18న జపాన్ సైనిక విమానం కూలిపోయింది. ఆ ప్రమాదంలో నేతాజీ మరణించారని కొందరు, కాదని కొందరు వాదిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుండే నేతాజీ అదృశ్యమయ్యారు. దీనిపై పది జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తులు జరిగాయి. ఇప్పుడు వాటి నివేదికలు న్యూఢిల్లీలోని నేషనల్ ఆర్కైవ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం తైవాన్‌లోని తైహోకూలో ఉన్న జపాన్ సైనిక వైమానిక స్థావరంలోని ఆస్పత్రిలో బోస్ చనిపోయారని ఆ దర్యాప్తు నివేదికలు ధృవీకరించాయి.

అయితే సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి మనోజ్ కుమార్ ముఖర్జీ నేతృత్వంలోని కమిటీ మాత్రం ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇది నేతాజీ మరణంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిట్టచివరి విచారణ కమిటీ. 2005 నవంబరులో కమిటీ తన నివేదికను సమర్పించింది. బోస్ చనిపోయిన మాట నిజమే కానీ అందరూ చెబుతున్నట్లు విమాన ప్రమాదంలో కాదని కమిటీ తెలిపింది. జపాన్ దేవాలయంలో ఉన్న అస్థికలు నేతాజీవి కావని స్పష్టం చేసింది. అయితే కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. తమకు జపాన్ బౌద్ధ దేవాలయ మత గురువులు సహకరించలేదని, తక్కువగా కాలిపోయిన కొన్ని ఎముక ముక్కలను సేకరించి డీఎన్ఏ పరీక్ష నిర్వహించేందుకు అనుమతించలేదని కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది.

నేతాజీ 128వ జన్మదినాన్ని పురస్కరించుకొని భరత జాతి గురువారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా నేతాజీ మనుమడు చంద్రకుమార్ బోస్ మాట్లాడుతూ 'మరో దేశంలో ఉన్న నేతాజీ అస్థికలను భారత్‌కు తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన కుమార్తె ప్రొఫెసర్ అనితా బోస్, ఇతర కుటుంబ సభ్యులు పీఎంఓకు, భారత ప్రభుత్వానికి అనేక లేఖలు రాశారు. అవి నేతాజీ అస్థికలేనని పది దర్యాప్తు కమిటీలు నిర్ధారించాయి. ఒకవేళ అవి బోస్ అస్థికలు కావని ప్రభుత్వం భావిస్తే దానిపై ప్రకటన విడుదల చేయాలి. అంతేకానీ మౌనం వహించడం ఆ మహానేత స్మృతికి అవమానమే' అని అన్నారు. 'గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ జపాన్‌లో పర్యటించారు. దేశాన్ని పాలించిన ఇతర ప్రధానులతో పోలిస్తే మోడీయే ఎక్కువ సార్లు జపాన్ వెళ్లారు. అయితే ఆయన ఎప్పుడూ రెంకోజీ వెళ్లి నేతాజీ అస్థికలను చూడలేదు' అని మరో బంధువు సూర్య బోస్ చెప్పారు.

ఇన్‌కాయిస్‌కు నేతాజీ 'ఆప్ద ప్రబంధన్' పురస్కారం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విపత్తుల నివారణకు నిస్వార్థ సేవలందించే పౌరులకు, సంస్థలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అందజేసే ప్రతిష్టాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఆప్ద ప్రబంధన్' పురస్కారం ఈ ఏడాదికి గాను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కాయిస్)కు లభించింది. ఈ పురస్కారం కింద రూ.51 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. నేతాజీ జయంతి సందర్భంగా గురువారం నాడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రకటించింది. ఈ పురస్కారానికి గతేడాది జులై నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ..295 నామినేషన్లు వచ్చినట్లు హోంశాఖ వెల్లడించింది. వీటిలో ఇన్‌కాయిస్‌ను పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది.

10 నిమిషాల్లో సునామీ హెచ్చరికలు

హైదరాబాద్‌లో 1999లో స్థాపించిన ఇన్‌కాయిస్ సముద్ర సంబంధిత ప్రమాదాల గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో ప్రఖ్యాతిగాంచింది. ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్ (ఐటిఇడబ్ల్యుసి) వ్యవస్థతో 10 నిమిషాల్లోనే ఈ సంస్థ సునామీ హెచ్చరికలను అందజేయగలదు. భారత్‌తో పాటు 28 దేశాలకు సేవలందిస్తోంది. సునామీ సర్వీస్ ప్రొవైడర్ గా యునెస్కో సైతం ఇన్‌కాయిస్‌ను గుర్తించింది.

భూకంప కేంద్రాలు, అలల తీవ్రత, ఇతర సముద్ర సెన్సార్‌ల నెట్‌వర్క్‌కు ఈ సంస్థ సమాచార సేవలందిస్తోంది. 2013 ఫైలిన్, 2014 హుద్హుద్ తుఫాను సమయంలో అందించిన సలహాలు, సహాయంతో సకాలంలో ప్రజల తరలింపు, తీరప్రాంత ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్రం పోశించింది. సముద్రంలో గల్లంతైన వ్యక్తులు, వస్తువులను గుర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు సహకారం అందించేందుకు ప్రత్యేకంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఎయిడెడ్ టూల్ (సరత్)ని అభివృద్ధి చేసి ఇన్‌కాయిస్ సేవలందిస్తోంది.

సినీప్రముఖులపై మూడోరోజూ ఐటీ సోదాలు

అస్వస్థతకు గురైన దిల్‌రాజు తల్లి

ఆస్పత్రికి తరలించిన ఆదాయపు పన్ను శాఖాధికారులు

క్షుణ్ణంగా సాగుతున్న తనిఖీలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గురువారం మూడోరోజు కూడా సినీ ప్రముఖుల నివాసాలు, కార్యాలయాలలో ఆదాయపు పన్ను(ఐటీ) శాఖాధికారుల సోదాలు కొనసాగాయి. ప్రముఖ సినీ నిర్మాణ సంస్థలు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మైత్రి మూవీస్, మ్యాంగో మీడియా సంస్థలకు చెందిన కార్యాలయాల్లో సోదాలను ఐటీ అధికారులు క్షుణ్ణంగా సాగిస్తున్నారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, మైత్రి మూవీస్ అధినేత నవీన్, మరో నిర్మాత రిలయన్స్ శ్రీధర్‌లకు చెందిన కార్యాలయాలు, నివాసాల్లో గత రెండ్రోజులుగా సోదాల్లో లభించిన డాక్యుమెంట్లు, అకౌంట్లు, ఆదాయ పన్ను లెక్కల పత్రాలను అధికారులు బృందాలుగా విడిపోయి పరిశీలిస్తున్నారు. వారివారి నివాసాలు, బ్యాంకులలోని లాకర్లలో తమకు తేలిన ఆస్తులు, వాటి విలువలను కూడా అధికారులు మదింపు చేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో దిల్‌రాజు నివాసంలో ఒకపక్క ఐటీ అధికారులు సోదాలు జరుపుతుండగా ఆయన తల్లి హఠాత్తుగా అస్వస్థతకు గుర య్యారు. దాంతో ఐటీ అధికారులు స్వయంగా ఆమెను తమ వాహనాల్లోనే స్థానికంగా ఉన్న ప్రముఖ ఆస్పత్రికి తరలిం చారు. పుష్ప-2 సినీ దర్శకుడు సుకుమార్ నివాసంలో సైతం ఐటీ అధికారులు సోదాలను దాదాపుగా ముగించినట్టు సమా చారం. కాగా, ఈ మూడు నిర్మాణ సంస్థలకు చెందిన కొందరు డిస్ట్రిబ్యూటర్ల నివాసాల్లోనూ ఐటీ అధికారులు తాజాగా సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద, ఈ మూడు నిర్మాణ సంస్థలు నిర్మించిన సినిమాల ద్వారా గడించిన కోట్లాది రూపాయల ఆదాయాలు, వాటికి జరిపిన ఆదాయపు పన్ను చెల్లింపుల విషయంలో భారీ వ్యత్యాసాలనే ఐటీ అధికారులు గుర్తిస్తున్నట్టు సమాచారం. ఈ మారు తాము జరుపుతున్న ఐటీ సోదాలలో ప్రభుత్వానికి భారీ మొత్తంలోనే ఆదాయపు పన్ను గండి పడిందని ఐటీ వర్గాలు చెప్తున్నట్టు తెలిసింది.

అమెరికాలో 600బిలియన్ల డాలర్ల పెట్టుబడులు

సౌదీ యువరాజు వెల్లడి



దుబాయ్ : రాబోయే నాలుగేళ్ళ కాలంలో అమెరికాలో 600బిలియన్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గురువారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, తన మొదటి విదేశీ పర్యటనగా బ్రిటన్‌లో పర్యటించడానికి ట్రంప్ యోచిస్తున్నారు. 2017లో ట్రంప్ ఇలాగే పర్యటించారు. చమురు సంపన్న గల్ఫ్ దేశాల పాలకులతో అమెరికా సంబంధాలు మెరుగైన రీతిలో వుండేందుకు తాము ప్రాధాన్యత ఇస్తామని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలని తాము కూడా భావిస్తున్నట్లు సౌదీ యువరాజు తెలిపారు. అయితే ఈ పెట్టుబడులు ఏ ఏ రంగాల్లో ఎక్కడెక్కడ పెడతారు, వాణిజ్య వివరాలు వంటివి ఆయననే జారీ చేసిన ప్రకటనలో వెల్లడించలేదు. ఇటీవల కాలంలో సౌదీ చమురు ఎగుమతులపై అమెరికా ఎక్కువగా ఆధారపడుతూ వస్తోంది. అలాగే అమెరికా తయారీ ఆయుధాలు, రక్షణ వ్యవస్థలపై సౌదీ అరేబియా ప్రధానంగా ఆధారపడుతోంది. బహుశా రక్షణ రంగంలోకూడా పెట్టుబడులు పెట్టే అవకాశాలు వుండొచ్చునని భావిస్తున్నారు. కాగా ఈ ఫోన్‌కాల్‌పై వైట్‌హౌస్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.